మంగళవారం
16-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 356
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

దక్షిణ కొరియా దెబ్బకు దిగొచ్చిన ట్రంప్

వాషింగ్టన్: ఇటీవల జార్జియాలో 475 మంది అక్రమ వలసదార్లను నిర్బంధించినట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. ఇక్కడ అదుపులోకి తీసుకున్నవారిలో దక్షిణ కొరియా వారే ఎక్కువ. దీనిపై దక్షిణకొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ స్పందిస్తూ... "ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మా వ్యాపార సంస్థలు యూఎస్‌లో పెట్టుబడులు పెట్టడానికి వెనకాడతాయి" అని హెచ్చరించారు. దీంతో స్వరం మార్చిన ట్రంప్... ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "క్లిష్ట ఉత్పత్తులు తయారు చేసే విదేశీ కంపెనీలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టిన సమయంలో కొంతకాలం నిపుణులైన కార్మికులను వారు మా దేశానికి తీసుకురావాలని నేను కోరుకుంటున్నాను. వారి నుంచి మన కార్మికులు శిక్షణ పొందాలి. మేం ఆ విదేశీ సంస్థల ఉద్యోగులను స్వాగతిస్తున్నాం. మేం వారినుంచి నేర్చుకొని, వారికంటే మెరుగ్గా రాణిస్తాం" అని ట్రంప్ రాసుకొచ్చారు.

వక్ఫ్ చట్టంపై ఎదురుదెబ్బ

కేంద్ర సవరణలకు అడ్డుకట్ట

కీలక నిబంధనలపై 'స్టే'
ముస్లిం వర్గానికే వక్ఫ్ బోర్డు సీఈవో పదవి ఇవ్వాలి

- రాష్ట్రాల వక్ఫ్ మండళ్లలో ముస్లిమేతరులు ముగ్గురే ఉండాలి
- ఆస్తి వక్ఫ్‌దా? ప్రభుత్వానిదా? అని తేల్చేది జిల్లా కలెక్టర్ కాదు
- సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు



న్యూఢిల్లీ: వక్ఫ్ చట్ట సవరణ 2025 ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. మతపరమైన ఆస్తుల పరిరక్షణ పేరుతో చేసిన ఈ సవరణలు ఇప్పుడు రాజ్యాంగబద్ధతపైనే సందేహాలు రేపుతున్నాయి. తాజాగా, ఈ చట్టంలోని కొన్ని కీలక సెక్షన్లపై సుప్రీంకోర్టు మధ్యంతరంగా స్టే విధించింది. వివిధ రాష్ట్రాల నుంచి దాఖలైన పిటిషన్లలో, సవరణలు మౌలిక హక్కులకు విరుద్ధమని, ప్రజాస్వామ్యానికి భంగం కలిగిస్తున్నాయని ఆరోపణలు వచ్చాయి. వక్ఫ్ (సవరణ) చట్టం-2025లోని అనేక కీలక నిబంధనల అమలుపై సుప్రీం కోర్టు సోమవారం స్టే ఇచ్చింది. అయితే రాజ్యాంగబద్ధత ఉన్నందున మొత్తం చట్టంపై స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. గత గత ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్న వారు మాత్రమే ఆస్తిని వక్ఫ్‌గా అంకితం చేయగలరనే నిబంధనతో సహా వక్ఫ్ (సవరణ) చట్టం-2025లోని అనేక కీలక నిబంధనలను నిలిపివేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్, న్యాయమూర్తి జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. 'చట్టం రాజ్యాంగబద్ధతకు ఊహ ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటుందని, అరుదైన సందర్భాల్లో మాత్రమే జోక్యం చేసుకోవచ్చని మేము భావించాము' అని ధర్మాసనం పేర్కొంది. వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ణయించడానికి కలెక్టర్‌కు ఇచ్చిన అధికారాలపై కూడా సుప్రీం కోర్టు తాత్కాలిక నిషేధం విధించింది. వక్ఫ్ బోర్డులలో ముస్లింయేతర భాగస్వామ్యం అనే వివాదాస్పద అంశంపై తీర్పునిస్తూ, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో 20 మందిలో నలుగురు కంటే ఎక్కువ మంది ముస్లింయేతర సభ్యులు ఉండకూడదని, రాష్ట్ర వక్ఫ్ బోర్డులలో 11 మందిలో ముగ్గురు కంటే ఎక్కువ మంది ఉండకూడదని ఆదేశించింది. 'కొత్త చట్టంలోని ప్రతి విభాగానికి 'ప్రాథమిక సవాలు' ధర్మాసనం పరిగణించింది. 'చట్టంలోని మొత్తం నిబంధనలను నిలిపివేయడానికి ఎటువంటి కేసును రూపొందించలేదు' అని కనుగొన్నట్లు సీజేఐ చెప్పారు. అయితే కొన్ని విభాగాలకు కొంత రక్షణ అవసరమని ఆయన అన్నారు. తన ఆదేశాలు ప్రాథమికంగా, తాత్కాలికంగా ఉన్నాయని, తుది విచారణ దశలో చట్టం రాజ్యాంగ చెల్లుబాటుపై పిటిషనర్లు లేదా

- మిగతా 2 లో

మావోయిస్టు సీనియర్ కమాండర్
సహదేవ్ ఎన్‌కౌంటర్

విశాలాంధ్ర-చింతూరు: జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో సోమవారం ఉదయం భద్రతా దళాలకు మావోయిస్టులు జరిగిన ఎదురుకాల్పులలో కోటి రూపాయల రివార్డు ఉన్న సహదేవ్ సోరెన్‌ను మృతి చెందారు. ఎదురు కాల్పులలో మరో ఇద్దరు మావోయిస్టులు కూడా చని పోయారు. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా సోమవారం ఉదయం హజారీబాగ్ జిల్లాలోని తతిఝరియ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరండి గ్రామంలో కోబ్రా 209 బెటాలియన్, గిరిదిహ్, హజారీబాగ్ పోలీసులు సంయుక్త బృందం గాలింపు చేపట్టాయి. రెండు పక్షాల

- మిగతా 2 లో

బండి సంజయ్‌కు కోర్టు సమన్లు

విశాలాంధ్ర - హైదరాబాద్: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వేసిన పరువు నష్టం పిటిషన్‌పై సోమ వారం కోర్టులో విచారణ జరిగింది. ఫోన్ ట్యాపింగ్, ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్) దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలతో తనను ముడిపెడుతూ బండి సంజయ్ నిరాధార వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ కేటీఆర్ ఇటీవల హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. తనకు బహిరంగ క్షమాపణతో పాటు రూ.10 కోట్లు చెల్లించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సిటీ సివిల్ కోర్టు విచారణ జరిపింది. డిసెంబర్ 15న ఈ కేసు విచారణకు హాజరు కావాలని బండి సంజయ్‌కు సమన్లు జారీ చేసింది.

మత మార్పిడి ప్రజల హక్కు

బెంగళూరు: హిందూ సమాజంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు వేరే మతంలోకి మారతారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య ప్రశ్నించారు. ప్రజల్ని మతం మారమని ఏ రాజకీయ పార్టీ కోరదని, అయినప్పటికీ మతమార్పిడులు జరుగుతున్నాయని, అది వారి హక్కు అని అన్నారు. 'సమానత్వమే ఉంటే అంటరానితనం ఇంకా ఎందుకు మిగిలి ఉంది? అంటరానితనాన్ని మనం సృష్టించామా? ఇస్లాం, క్రైస్తవం, ఇతర ఏ మతాల్లోనైనా అసమానత్వం ఉండొచ్చు. మేము కానీ బీజేపీ కానీ ఎవర్నీ మతం మారమని కోరం. ప్రజలే మతం మారుతుంటారు. అది వారి హక్కు కూడా' అని సిద్ధరామయ్య అన్నారు.



తప్పు చేస్తే... ఎస్ఐఆర్ ఆపేస్తాం

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు హెచ్చరిక
7న తుది వాదనలు వింటాం
తీర్పు దేశం మొత్తానికి వర్తిస్తుంది

న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అనుసరిస్తున్న పద్ధతుల్లో ఏదైనా చట్ట విరుద్ధం అని తేలితే, బీహార్‌లో చేపట్టిన 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్)ను రద్దు చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ నిర్వహణలో ఎన్నికల సంఘం చట్టాలను, తప్పనిసరి

- మిగతా 2 లో

ప్రతిపక్షాల హర్షం

- వక్ఫ్ భూములపై కేంద్రం కుట్రకు ఎదురుదెబ్బ: కాంగ్రెస్
- బీజేపీ దుర్మార్గం రుజువైంది: వామపక్షాలు
- తీర్పు తమకు అనుకూలమన్న కేంద్రం

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ సవరణ చట్టం-2025పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులపై ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేశాయి. వక్ఫ్ భూముల లాక్కోవడానికి చేసిన ప్రయత్నానికి చెక్ పెట్టేలా సుప్రీం ఉత్తర్వులు ఉన్నాయని కాంగ్రెస్

- మిగతా 2 లో

వక్ఫ్‌పై సుప్రీం ప్రశ్నలకు
సమాధానాలివ్వాలి: సీపీఐ

న్యూఢిల్లీ: వివాదాస్పద వక్ఫ్ చట్టానికి సంబంధించి సుప్రీం కోర్టు ప్రశ్నలకు పార్లమెంటు సమాధానం ఇవ్వాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. సుప్రీం లేవనెత్తిన అంశాలన్నింటిపై స్పష్టత ఇవ్వకుండా చట్టాన్ని అమల్లోకి ప్రభుత్వం తేలేదన్నారు. 'సీపీఐ

- మిగతా 2 లో

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

అర్హులందరికీ అక్రిడిటేషన్‌లు: మంత్రి పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డ్‌లు

- మిగతా 2 లో

ఎల్ఈడీ దీపాలపై
పక్కా పర్యవేక్షణ

- గ్రామాల్లో నిర్వహణ బాధ్యతలు సర్పంచ్‌లకే
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం
- ఐఐటీ సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్
- పేరొందిన కంపెనీల నుంచి టెండర్లు: సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రమంతా ఎల్ఈడీ వీధిదీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచ్‌లకే అప్పగించాలని అన్నారు. కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంతంగా నిర్వహించే అధికారం పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్

- మిగతా 2 లో

కమ్యూనిస్టుల పోరాట చరిత్ర
నిరుపమానం

చాడ వెంకటరెడ్డి

విశాలాంధ్ర-హుస్నాబాద్: కమ్యూనిస్టుల పోరాట చరిత్ర చెరిపితే చెరిగేది కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో అమరులయిన అనభేరి ప్రభాకర్ దళ సభ్యుల సమాధులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్టు 15న వచ్చినా హైదరాబాద్ సంస్థానం మాత్రం నిజం పరిపాలనలో ఉందని, దేశంలో మొత్తంలో హైదరాబాద్ సంస్థానం అత్యంత పెద్దదని అన్నారు. ఇక్కడి ప్రజలను దొరలు, దేశముఖ్‌లు, జమీందారులు, జాగిర్దారులు

- మిగతా 2 లో

నేపాల్‌లో కొలువుదీరిన కొత్త కేబినెట్

2 లో

ప్రగతి బాటలో పల్లెలు

- రహదారులతోనే గ్రామాల అభివృద్ధి
- నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి: కూనంనేని

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్: ప్రజలకు విద్య, వైద్యంతోపాటు రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి పల్లెను ప్రగతివైపు నడిపిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం, కోరుకొండ, లోతువాగు, ప్రశాంతి నగర్, శేషగిరినగర్, తెలగారమవరం పంచాయతీల పరిధిలో ఎస్‌సీపీ, ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4.29 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ... రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. పల్లె రహదారులు, గ్రామాల అనుసంధాన రోడ్లు, ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. రహదారుల సౌకర్యం ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. హెల్త్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అలా అనకండి సార్..
మన పార్టీ వాళ్లంతా లోపలుంటారు!

నేపాల్‌లో కొలువుదీరిన కొత్త కేబినెట్

మంత్రులుగా ఖానల్, ఘీసింగ్, ఆర్యల్ ప్రమాణం

ఖాట్మండు: నేపాల్ తాత్కాలిక మంత్రివర్గంలో ముగ్గురికి స్థానం దక్కింది. కొత్త మంత్రులతో అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన రామేశోర్ ఖానల్, కుల్మన్ ఘీసింగ్, ఓం ప్రకాశ్ ఆర్యల్... ఆర్థిక, ఇంధన, హోంశాఖ బాధ్యతలు చేపట్టనున్నారు.

రామేశోర్ ఖానల్: రామేశోర్ ఖానల్ (55) ఆర్థిక శాఖ కార్యదర్శిగా గతంలో పనిచేశారు. అదే శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకోబోతున్నారు. నేపాల్ రాష్ట్ర బ్యాంక్, నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ, వ్యవసాయాభివృద్ధి బ్యాంకు, నేపాల్ టెలికం కంపెనీ, నేపాల్ ఎయిర్‌లైన్స్ కార్పొరేషన్‌లో పనిచేసిన అనుభవం ఆయనకున్నది. వ్యాట్ బిల్లు కుంభకోణం నేపథ్యంలో దర్యాప్తును వాణిజ్య సంస్థలు అడ్డుకోవటం, రాజకీయంగా ఒత్తిడి పెరుగటంతో 2011లో ఆర్థిక శాఖ కార్యదర్శిగా రాజీనామా చేసిన ఆయన వార్తల్లో నిలిచారు. అప్పట్లో ఝాలా నాథ్ ఖానల్ ప్రధానిగా, భరత్ మోహన్ అధికారి ఆర్థిక మంత్రిగా ఉన్నారు.

కుల్మన్ ఘీసింగ్: కుల్మన్ ఘీసింగ్ (54)నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత నేపాల్‌కు వెలుగు వచ్చింది. చాలా సంవత్సరాల్లో మొదటిసారిగా 24 గంటల విద్యుత్ సరఫరా జరిగింది. అప్పట్లో దీనిని ఓ అద్భుతంగా అంతా వర్ణించారు. డిమాండును, సరఫరాను దృష్టిలో పెట్టుకొని సమర్థ నిర్వహణ ద్వారా 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమైందని ఆయన అప్పట్లో చెప్పారు. అంధకారానికి అలవాటుపడ్డ నేపాల్ ప్రజలకు ఆయన ఒక హీరో అయ్యారు. ఘీసింగ్‌కు జనాదరణ బాగా పెరిగింది. ఇదే క్రమంలో జెన్ జీలోని ఒక దశలో ఆయనకు దేశ పగ్గాలు అప్పగించాలని యోచించిన విషయం తెలిసిందే.

ఓం ప్రకాశ్ ఆర్యల్: ఓం ప్రకాశ్ ఆర్యల్ (49) హోంశాఖ బాధ్యత తీసుకుంటున్నారు. సుప్రీం కోర్టు న్యాయవాదిగా అవినీతిని అంతం చేసే వ్యక్తిగా ఆయనకు మంచి గుర్తింపు ఉంది. ప్రధాని కార్కికి నమ్మకస్తుడిగానూ ఆయనున్నారు.

తొలి మహిళా అటార్నీ జనరల్‌గా సబితా భండారి

నేపాల్‌కు తొలి మహిళా అటార్నీ జనరల్‌గా సీనియర్ న్యాయవాది సబితా భండారి నియమితులయ్యారు. ప్రధాని సుశీలా కార్కి సిఫార్సు మేరకు సబితా భండారి నియామకానికి అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఆమోదముద్ర వేసినట్లు అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. అంతకుముందు ఆయన అటార్నీ జనరల్‌గా రామేశ్ బాదల్ రాజీనామాను ఆమోదించారు. ప్రభుత్వం మారినప్పుడు అటార్నీ జనరల్ రాజీనామా చేయడం సాధారణమే. భండారి గతంలో జాతీయ సమాచార కమిషనర్‌గానూ పనిచేశారు. ఇప్పుడు దేశానికి తొలి మహిళా అటార్నీ జనరల్ అయ్యారు.

3,723 ఖైదీలు తిరిగి జైళ్లకు...

జెన్ జీ ఆందోళనల నేపథ్యంలో తప్పించుకున్న 3,723 మంది ఖైదీలను తిరిగి అరెస్టు చేసినట్లు నేపాల్ డీఐజీ వినోద్ ఘిమిరే తెలిపారు. మరో 10,320 మంది ఖైదీల కోసం గాలింపులు కొనసాగుతున్నట్లు చెప్పారు. వారి ఆచూకీ కోసం ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. కొందరు ఖైదీలు స్వచ్ఛందంగా తిరిగి వచ్చారని, కొందరిని భారత్ పోలీసులు పట్టుకొని తమకు అప్పగించారని ఆయనన్నారు. తప్పించుకున్న ఖైదీలను పట్టుకునేందుకు నేపాలీ ఆర్మీ, పోలీస్, సాయుధ పోలీసుల దళం సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నట్లు డీఐజీ వెల్లడించారు.

ఇజ్రాయిల్‌ను శిక్షించాలి

ద్వంద్వ ప్రమాణాలు తిరస్కరించాలి ప్రపంచానికి ఖతార్ ప్రధాని పిలుపు

దోహా: ద్వంద్వ ప్రమాణాలు తిరస్కరించాలని, ఇజ్రాయిల్‌ను శిక్షించాలని ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రెహమాన్ బిన్ జస్సిమ్ అల్ థాని పిలుపునిచ్చారు. ఖతార్ రాజధాని దోహాలో హమాస్ సభ్యులపై ఇజ్రాయిల్ దాడిని ఖండించారు. ఇదే అంశమై సోమవారం అరబ్, ఇస్లామిక్ నాయకుల ఐక్యతను ప్రతిబింబించేలా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఖతార్ ప్రధాని మాట్లాడుతూ ఇజ్రాయిల్ జవాబుదారీ తనాన్ని డిమాండ్ చేశారు. ద్వంద్వ ప్రమాణాలు తిరస్కరించేందుకు, అన్ని నేరాలకుగాను ఇజ్రాయిల్‌ను శిక్షించేందుకు సమయం ఆసన్నమైందని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. గాజా సమూల వినాశనంలో ఇజ్రాయిల్ ఫలించబోదన్నారు. అంతర్జాతీయ సమాజం మౌనం వహిస్తుండటం, జవాబుదారీతనాన్ని డిమాండ్ చేయలేకపోవడమే ఇజ్రాయిల్‌కు బలాన్నిస్తోందని ఖతార్ ప్రధాని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ సమాజం తక్షణమే స్పందించాలని కోరారు. కాగా, ఖతార్‌పై ఇజ్రాయిల్ దాడి జరపడం మీద ఈ సమావేశం ముసాయిదా తీర్మానం చేసినట్లు ఖతార్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మజీద్ అల్ అన్సారీ వెల్లడించారు. ఇజ్రాయిల్ దురాక్రమణ పలస్తీనాకు పరిమితం కాదని, ప్రాదేశికంగా విస్తరిస్తున్నదని టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదన్ అన్నారు. తాజా పరిస్థితుల దృష్ట్యా అరబ్, ఇస్లామిక్ దేశాలు ఏకం కావడం అత్యవసరమని ఆయనన్నారు. సమావేశంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, ఇరాక్ ప్రధాని మహమ్మద్ షియా అల్ సుదానీ, టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్, పలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

నెతన్యాహూ... ఖతార్ జోలికి వెళ్లొద్దు: ట్రంప్

ఖతార్ జోలికి వెళ్లొద్దని ఇజ్రాయిల్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేశారు. అది తమ మిత్రదేశమని, ఖతార్ ప్రధాని అద్భుతమైన వ్యక్తి అని అన్నారు. హమాస్‌పై ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చు కానీ ఖతార్ విషయంలో ఆచితూచి వ్యవహరించాలని ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ట్రంప్ హెచ్చరించారు.

ప్రగతి బాటలో పల్లెలు

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పంచాయతి కార్యాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ సేవాకేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, నునవత్ గోవిందు, కాంగ్రెస్ నేత నాగ సీతారాములు, తూము చౌదరి, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, హన్మంతరావు, కూచిపూడి జగన్, పూణె శ్రీనివాస్, అంకుబాబు, శిరీష, శ్రీనివాసరావు, రామకృష్ణ, రఘురామయ్య, వెంకటస్వామి, అమ్మ సాంబయ్య, శివలాల్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పోరాట చరిత్ర నిరుపమానం

(మొదటిపేజీ తరువాయి)

అనేకంగా చిత్రహింసలకు గురిచేసేవారని తెలిపారు. నిజాం సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని 1947 సెప్టెంబరు 11న తెలంగాణ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, మఖ్దూం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి పిలుపు ఇచ్చారని గుర్తుచేశారు. ఈ పోరాటానికి ప్రజలు చైతన్యవంతులై గ్రామాలలో ఉన్న దొరల, దేశ్‌ముఖ్‌ల, భూస్వాముల ఆగడాల పైన, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి 3 వేల గ్రామాలను నిజం పాలన నుంచి విముక్తి చేశారని చాడ గుర్తుచేశారు. తెలంగాణ పల్లెల్లో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచి, 4,500 మంది భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బిడ్డలు ప్రాణాలు అర్పించారని తెలిపారు. 1948 సెప్టెంబరు 17న నిజాం నవాబు తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని, అయితే ఇంతటి సుదీర్ఘ పోరాటంలో బీజేపీ మాతృ సంస్థ అయిన ఆర్‌ఎస్ఎస్ పాత్ర ఏమాత్రం లేదన్నారు. కానీ నేడు బీజేపీ మారేడు కాయకు మసిబూసినట్టు తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం పోరాటంగా, ఆనాటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, నిజాం నవాబు మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో కలిపినట్టు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఏడాది పాటు జరిగిన ఈ పోరాటంలో అనేక వేల మంది హిందువులను చంపేస్తూ, మహిళల మాన ప్రాణాలు తీసి, అనేక విధాలుగా చిత్రహింసలకు గురి చేస్తున్నా నిజాం నవాబును ఎందుకు అరెస్టు చేయలేదని చాడ దుయ్యబట్టారు. నిజాం నవాబుకు రాజుగా ప్రముఖ హోదా ఇచ్చి (నేటి గవర్నర్‌తో సమానం) సర్దార్ పటేల్ ఆయనను నియమించి వేల ఎకరాల భూమిని ఏడాదికి రూ.1 కోటి నజరానాను, రజాకారుల నాయకుడు అయిన కాసిం రజ్వి పాకిస్తాన్ పోవడానికి ఏ విధంగా ఒప్పుకున్నారో ఈ బీజేపీ వాళ్లు సమాధానం చెప్పాలని చాడ వెంకటరెడ్డి సూటిగా ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ వచ్చి నేటికి 13 ఏళ్లు గడుస్తున్నా సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా జరపడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గానీ, ప్రస్తుతం ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంగానీ ఎందుకు ప్రకటించలేకపోతున్నాయో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ఇప్పటికయినా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు స్మృతి వనాలు నిర్మించి భవిష్యత్ తరాలకు ఆనాటి పోరాట స్మృతులు చూపించాలని చాడ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సీపీఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుట్ల శంకర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగీర్ సత్యనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సీపీఐ కొహెద మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులు నాగేల్లి లక్ష్మారెడ్డి, బొయిని అశోక్, చాడ శ్రీధర్ రెడ్డి, గూడేం లక్ష్మి, ఎలగందుల రాజయ్య, బత్తుల బాబు, ముద్రకోల రాజయ్య, సీపీఐ మహ్మదాపూర్ గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల మెగిలయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యులు పిట్టల సుధాకర్, సీపీఐ నాయకులు పిట్టల ప్రసాద్, సంగ రాజయ్య, పిట్టల బాలయ్య, గ్రామ, మండల శాఖ కార్యకర్తలు పాల్గొని పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ప్రతిపక్షాల హర్షం

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించింది. ఈ చట్టంలో కీలక నిబంధనలపై సుప్రీం పాక్షికంగా స్టే విధించడాన్ని స్వాగతిస్తున్నట్లు వామపక్షాలు పేర్కొన్నాయి. మైనారిటీలతో, భాగస్వామ్య సంఘాలతో సంప్రదింపులు జరపకుండా వక్ఫ్ సవరణ చట్టాన్ని బీజేపీ హడావిడిగా తీసుకొచ్చిందని రుజువైందని వ్యాఖ్యానించాయి. సుప్రీం కోర్టు ప్రశ్నలకు, అభ్యంతరాలకు ప్రభుత్వం, పార్లమెంటు నుంచి స్పష్టతను కోరాయి. రాజ్యాంగ విలువలను కాపాడే విధంగా న్యాయం, సమానత్వం, సోదరభావానికి ఊతమిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొ న్నారు. వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేయడాన్ని కాంగ్రెస్ స్వాగతిస్తుందన్నారు. చట్టంలో అంతర్లీనంగా ఉన్న 'దుర్మార్గపు ఉద్దేశాలు' రద్దులో తాజా తీర్పుతో పురోగతి వచ్చినట్లు వెల్లడించారు. ఐదేళ్ల పాటు ఇస్లాం ఆచరించిన వారు మాత్రమే తమ ఆస్తిని వక్ఫ్ చేయగలరన్న నిబంధనపై సుప్రీం కోర్టు స్టే విధించింది. కాగా తమకు అనకూలంగా తీర్పు వెలువడిందని, పార్లమెంటు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని కేంద్రమంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ప్రజాస్వామ్యం గెలిచిందని అన్నారు. పార్లమెంటు చేసిన చట్టాన్ని ఎలా తిరస్కరిస్తామని ప్రశ్నించారు. 'వక్ఫ్ చట్టం పూర్తి పాఠం సుప్రీంకోర్టుకు తెలుసు. సుప్రీం కోర్టు నిర్ణయం ప్రజాస్వామ్యానికి శుభ సూచికమని నమ్ముతున్నా. ఎందుకంటే పార్లమెంటు ఏదైన చట్టం చేస్తే దానిని తిరస్కరించే అవకాశం ఉండదు. సుప్రీం కోర్టు తాజా తీర్పులో అదే పేర్కొంది. ఈ తీర్పు సంతృప్తినిచ్చింది. సర్వోన్నత న్యాయస్థానం ఏదైన నిర్ణయం తీసుకుంటే దాని ప్రభావం ఉంటుంది... పార్లమెంటు నిర్ణయాన్ని కోర్టు సమర్థించినట్టే' అని రిజిజు వెల్లడించారు.

బీజేపీ మత విభజన యత్నాలకు చెక్: కాంగ్రెస్

మైనారిటీల హక్కుల పరిరక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. 'మత ఘర్షణలను రెచ్చగొట్టడానికి, పాత సమస్యలను మళ్లీ తెచ్చేలా రూపొందిన 'విభజన' చట్టం కోసం బీజేపీ యత్నించింది. ఎన్నికల్లో ప్రయోజనం కోసం సమాజాన్ని విభజించాలనుకుంటోంది. భయం/ ప్రయోజనంతో పని లేకుండా రాజ్యాంగం హామీనిచ్చే విధంగా ప్రతి పౌరుని హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. బీజేపీ మాత్రం స్వప్రయోజనాల కోసం కుయుక్తులు ప్రదర్శిస్తూ, సమాజాన్ని విభజించాలని చూస్తోంది' అని ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ కేసులో గణనీయమైన విజయం సాధించినట్లు జైరాం రమేశ్ వెల్లడించారు. సుప్రీం కోర్టు కీలక నిబంధనలను నిలిపివేసిందని, కలెక్టర్ల అధికారాలు పరిమితం చేసిందని, వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురికాకుండా చూసిందన్నారు. ఐదేళ్లుగా ముస్లింగా ఉన్నానంటూ రుజువులు చూపే నిబంధనను నిలిపివేస్తూ, తగిన విధంగా నియమాలు రూపొందించాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని జైరాం రమేశ్ పేర్కొన్నారు. న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వ విలువల కోసం తీర్పును స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు.

రాజ్యాంగ విలువలకు రక్షణ: డీఎంకే

రాజ్యాంగ విలువల రక్షణకు హామీనిచ్చేలా సుప్రీం కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ తెలిపారు. 'బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇందులోని సవరణలను డీఎంకే వ్యతిరేకిస్తోంది. చట్టంగా మారినప్పుడు దానిపై సుప్రీంకెళ్లింది. ప్రభుత్వ అధికాలను దుర్వినియోగించేలా తీసుకుకొచ్చిన బిల్లును చట్టం చేయగా, దీనిని ఉపసంహరించుకునేలా కేంద్రాన్ని కోరుతూ తమిళనాడు అసెంబ్లీ తీర్మానం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఉత్తర్వులు ముస్లింల మతపరమైన హక్కుల పరిరక్షణకు, రాజ్యాంగ విలువల రక్షణకు మామీనిస్తుంది' అని పేర్కొన్నారు. ఆర్‌జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ స్పందిస్తూ 'వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన పార్టీల్లో ఆర్‌జేడీ ఒకటి. ఈ వ్యవహారంలో న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తాం' అని అన్నారు.

తుది తీర్పుపై ఆశలు: ముస్లిం లా బోర్డులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తే హర్షించేవాళ్లమని, తాజా ఉత్తర్వులు కొంతమేరకు ఉపశమనం కల్పించాయని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ), ఆలిండియా షియా పర్సనల్ లా బోర్డు (ఏఐఎస్‌పీఎల్‌బీ) పేర్కొన్నాయి. బోర్డులో ముస్లింయేతరులకు స్థానం కల్పించడం ఇబ్బంది పెట్టే అంశమన్నారు. మత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీనిస్తోందని గుర్తుచేశారు. ఇస్లాంలో వక్ఫ్ అంతర్గత భాగమని నొక్కిచెప్పారు. ఇతర మత సంస్థల్లో ఆయా మతస్థులే ఉన్నప్పుడు వక్ఫ్‌కు మినహాయింపు ఎందుకని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు దీనిపై స్టే విధించలేదని, ఇది పెద్ద సమస్యగా ఉందని, తుది తీర్పుపైనే ఆశలు పెట్టుకున్నామని ముస్లిం లా బోర్డులు పేర్కొన్నాయి. న్యాయంపై నమ్మకాన్ని తాజా ఉత్తర్వులు ఇచ్చినట్లు జమాత్ ఉలేమా ఏ హింద్ అధ్యక్షుడు మౌలానా అర్షద్ మదనీ అన్నారు.

మాకు సమస్య లేదు: మునంబం వాసులు

తాజా ఉత్తర్వులతో తమకు ఎలాంటి సమస్య లేదని, ఫరూక్ కాలేజి నుంచి తాము కొనుగోలు చేసిన భూమికి ఢోకా లేదని కేరళకు చెందిన మునంబం భూ సంరక్షణ సమితి వెల్లడించింది. చట్టంలోని సెక్షన్ 2(ఎ)పై స్టే విధించలేదు కాబట్టి... మా సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకెళ్లవచ్చని సమితి సభ్యుడు జోసెఫ్ బెన్నీ తెలిపారు. తమ సమస్యల సత్వర పరిష్కారానికిగాను పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని సమితి నిర్ణయించినట్లు వెల్లడించారు.

వక్ఫ్‌పై సుప్రీం ప్రశ్నలకు సమాధానాలివ్వాలి: సీపీఐ

(మొదటిపేజీ తరువాయి)

తరపున వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశాను. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు అనేక అంశాలను లేవనెత్తింది. వాటన్నింటిని పరిష్కరించకుండా చట్టాన్ని ఎలా అమలు చేస్తారు? సుప్రీంకోర్టు ఈ చట్టంపై స్టే విధించింది. కొన్ని అభ్యంతరాలు వ్యక్తంచేసింది. ప్రభుత్వం, పార్లమెంటు స్పందించాలి... న్యాయస్థానం లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి... కోర్టు అభ్యంతరాలపై స్పష్టతివ్వాలి. అప్పుడే చట్టం అమల్లోకి తెచ్చే అవకాశముంటుంది' అని డి.రాజా పేర్కొన్నారు. మైనారిటీలతో, భాగస్వామ్య సంఘాలతో సంప్రదింపులు జరపకుండా వక్ఫ్ సవరణ చట్టాన్ని బీజేపీ హడావిడిగా తీసుకొచ్చిందని రుజువు అయిందని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గం సోమవారం ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. ముస్లింలను బూచీగా చూపే ఉద్దేశంతో వివాదాస్పద సవరణలను బీజేపీ చేసిందని, సమాజ విభజనకు యత్నించిందని, వక్ఫ్ ఆస్తులు చేజిక్కించుకోవాలని భావించిందని పేర్కొంది. ఈ చట్టం మొత్తాన్ని సుప్రీం కోర్టు రద్దు చేయలేదని, కొన్ని అన్యాయమైన అంశాలు ఇంకా అలాగే ఉన్నాయని తెలిపింది. అభ్యంతకరమైన నిబంధలన్నీ రద్దు చేయాలని, సుప్రీం కోర్టు ప్రశ్నలన్నింటికి ప్రభుత్వం నుంచి సరైన సమాధానాలు వచ్చేంత వరకు ఈ చట్టాన్ని అమలు చేయరాదని సీపీఐ పేర్కొంది. మత చట్టాలను పారదర్శకంగా రూపొందించాలని, అర్థవంతమైన సంప్రదింపులు జరిపిన తర్వాతే మత చట్టాలను రూపొందించాలని, అవి మతపరంగా విభజనను సృష్టించేవిగా ఉండరాదని సూచించింది. బహుళ, లౌకిక ప్రజాస్వామ్యంలో మతపరమైన మైనారిటీల హక్కులకు రక్షణ ఉండాలని సీపీఐ వెల్లడించింది. వక్ఫ్ సరవణ చట్టంపై పాక్షిక స్టే విధిస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ పేర్కొన్నారు. పూర్తిగా స్టే విధించనప్పటికీ, కొన్ని నిబంధనలను నిలిపివేయడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన 'ఎక్స్'లో తెలిపారు. 'వక్ఫ్ సవరణ చట్టంలోని కొన్ని నిబంధనలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. దర్యాప్తు జరిపి సంబంధిత అధికారి ఆమోదిస్తే తప్ప ఆ ఆస్తి వక్ఫ్ పరిధిలోకి రాదు. పాక్షిక స్టేను స్వాగతిస్తున్నాం' అని బేబీ వెల్లడించారు.

సహదేవ్ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మధ్య కాల్పుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ సోరెన్, మరో ఇద్దరు మావోయిస్టులు చంచల్, బిర్సెన్ మృతి చెందినట్లు జార్ఖండ్ పోలీసులు తెలిపారు. చంచల్ పై రూ.25 లక్షలు, బిర్సెన్ పై రూ.10 లక్షలు రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలం నుంచి 3 ఏకే47 రైఫిల్స్‌ను కోబ్రా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈనెల 11వ తేదీన చత్తీస్‌గఢ్ లోని గరియా బంద్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో పదిమంది మావోయిస్టులు మృతి చెందిన విషయం విదితమే. ఈ వరుస ఎన్‌కౌంటర్ల గురించి కేంద్ర హెూం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ... భద్రత దళాలు మావోయిస్టులపై పెద్ద విజయాన్ని సాధించాయన్నారు. సోమవారం జరిగిన ఎదురుకాల్పు ల్లో కోటి రూపాయల రివార్డు కలిగిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవ్ మృతి చెందాడని, మిగిలిన మావోయిస్టులు కూడా సకాలంలో లొంగిపోవాలని, వచ్చే ఏడాది మార్చి 31 లోగా రెడ్ టెర్రర్ పూర్తిగా నాశనం కావడం ఖాయమని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

తప్పు చేస్తే... ఎస్ఐఆర్ ఆపేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనలను పాటించిందని తాము భావిస్తు న్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల కమిషన్ ఇలాంటి ప్రక్రి యను నిర్వహించకుండా ఆపలే మని ధర్మాసనం పేర్కొంది.ఎస్ఐఆర్‌పై తాము ఇచ్చే తుది తీర్పు బీహార్‌కు మాత్రమే కాదు, దేశం మొత్తానికి వర్తిస్తుందని స్పష్టం చేసింది. బీహార్ ఎస్ఐఆం కసరత్తుపై తుది వాదనలు అక్టోబర్ 7న వింటామని సుప్రీం పేర్కొంది.

నిర్వహణపై నిర్ణయాధికారం మాదే!

ఇంతకు ముందు, నిర్దిష్ట కాల వ్యవధుల్లో దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహించాలనే ఆదేశాలు జారీ అయితే తమ ప్రత్యేక అధికార పరిధికి విఘాతం కలుగుతుందని సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. 'ఓటర్ల జాబితా సమగ్ర సవరణ'కు సంబంధించిన విధానంపై పూర్తి విచక్షణతో స్వతంత్రంగా నిర్ణయాన్ని తీసుకునే అధికారం తమకు ఉందని పేర్కొంది. ఈ విషయంలో ఇతర సంస్థలతో నిమిత్తం లేకుండా పనిచేసే స్వేచ్ఛ తమకు ఉందని ఈసీ చెప్పింది. ఈ మేరకు వాదనలతో కోర్టులో కౌంటర్ అఫిడవిట్‌ను ఎన్నికల సంఘం దాఖలు చేసింది.

12వ గుర్తింపు పత్రంగా ఆధార్

ఎన్నికల సంఘం బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్ కోసం 11 గుర్తింపు కార్డులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంది. అయితే వీటిలో ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఆధార్‌ను గుర్తింపు పత్రంగా పరిగణించాలని కోరుతూ, సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీంతో ఆధార్‌ను 12వ గుర్తింపు పత్రంగా పరిగణించాలని సెప్టెంబర్ 8న సర్వోన్నత న్యాయస్థానం ఈసీకి ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆధార్ అనేది వ్యక్తుల గుర్తింపునకు, నివాసానికి చట్టబద్ధమైన రుజువుగా మాత్రమే ఉంటుందని, అది పౌరసత్వాన్ని సూచించదని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం బీహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి, సరైన ధ్రువీకరణ లేకుండా లక్షలాది మంది నిజమైన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తోందని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. ఈసీ ఆధార్‌ను గుర్తింపు పత్రంగా గుర్తించకపోవడం వల్ల నిజమైన ఓటర్లకు అన్యాయం జరుగుతోందని వాదించాయి. ఈ నేపథ్యంలోనే ఆగస్టు 18న విడుదల చేసిన ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో ఏకంగా 65 లక్షల మంది పేర్లు తొలగించబడ్డాయి. దీంతో 'ఓటు చోరీ' జరిగిందని కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు ఆందోళన చేపట్టాయి.

జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టల హెల్త్ పాలసీ, అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హై పవర్ కమిటీని కూడా పునరుద్దరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జి.ఓ. జారీచేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్ ను తక్షణమే రూపొందించాలని అన్నారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్దరించాలని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై ఎదురుదెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పూర్తి వాదనలు ముందుకు తీసుకెళ్ల కుండా అవి నిరోధించవని ధర్మాసనం స్పష్టం చేసింది.ఆ తర్వాత సీజేఐ గవాయ్ మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యం చేసుకున్న లేదా నిలిపివేసిన నిబంధనలను ప్రస్తావించారు. 'ఒక వ్యక్తి ముస్లిం మతాన్ని ఆచరిస్తున్నాడా లేదా అని పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వ నియమాలను రూపొందించే వరకు వక్ఫ్ (సెక్షన్ 3(ఆర్)) ఆస్తిని అంకితం చేయడానికి ముందు గత ఐదు సంవత్సరాలుగా ముస్లిం మతాన్ని ఆచరిస్తున్న వ్యక్తి అయి ఉండాలి. అటువంటి నియమం/యంత్రాంగం లేకుండా ఆ నిబంధన ఏకపక్ష అధికార వినియోగానికి దారితీస్తుంది' అని ఉత్తర్వుల్లో పేర్కొంది.

వక్ఫ్ ఆస్తుల స్థితిని నిర్ణయించడానికి నియమించబడిన ప్రభుత్వ అధికారులకు అధికారాలు ఉన్న సెక్షన్ 3సీకి సంబంధించి అత్యంత ముఖ్యమైన జోక్యాలలో ఒకటి వచ్చింది. ప్రభుత్వ అధికారి నివేదిక ఆక్రమణ లేదని నిర్ధారించే వరకు ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించరాదని చట్టంలోని సెక్షన్ 3సి(2) నిబంధనపై ధర్మాసనం స్టే విధించింది. ఒక ఆస్తిని ప్రభుత్వ భూమిగా ప్రకటించడానికి మరియు రెవెన్యూ రికార్డులను మార్చడానికి అధికారికి అధికారం ఇచ్చిన సెక్షన్ 3సి(3) నిర్వహణపై కూడా స్టే విధించింది. అధికారి కనుగొన్న దాని ఆధారంగా దాని రికార్డులను సరిచేయమని రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును ఆదేశించాల్సిన సెక్షన్ 3సి(4)ని ఈ ఉత్తర్వు నిలిపివేసింది. 'కలెక్టర్ హక్కులను నిర్ణయించడానికి అనుమతించడం అధికారాల విభజనకు విరుద్ధం. కార్యనిర్వాహకుడు పౌరుల హక్కులను నిర్ణయించడానికి అనుమతించబడదు' అని అది పేర్కొంది. వక్ఫ్ ట్రిబ్యునల్ సెక్షన్ 83 కింద ఆస్తిపై హక్కును చివరకు తీర్పు ఇచ్చే వరకు, హైకోర్టులో అప్పీల్‌కు లోబడి ఉండే వరకు, వక్ఫ్ స్వాధీనం లేదా దాని రికార్డులు ఏవీ భంగం కలిగించవని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే విచారణ పెండింగ్‌లో ఉన్న సమయంలో అటువంటి ఆస్తులలో మూడవ పక్ష హక్కులను సృష్టించలేమని అది పేర్కొంది. వక్ఫ్ బోర్డులలో ముస్లింయేతర భాగస్వామ్యంపై, నిబంధనలను నిలిపివేయడానికి ధర్మాసనం నిరాకరించింది. కానీ పరిమితులను విధించింది. ముస్లిమేతర వ్యక్తులకూ వక్ఫ్ బోర్డ్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో)గా అవకాశం ఇవ్వొచ్చంటూ చట్టంలో చేసిన సవరణపై స్టే ఇవ్వలేమని సుప్రీం కోర్టు బెంచ్ తెలిపింది. వీలైనంత మేరకు ముస్లిం వర్గానికే ఆ పదవిని కేటాయించేందుకు ప్రయత్నించాలని నిర్దేశించింది.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈవోలు) నియామకంతో వ్యవహరించే సెక్షన్ 23ని కొట్టివేయకపోయినా, ధర్మాసనం ఇలా పేర్కొంది : 'సాధ్యమైనంతవరకు బోర్డుకు చెందిన ఎక్స్-అఫిషియో కార్యదర్శి అయిన సీఈవోను ముస్లిం సమాజం నుంచి నియమించడానికి ప్రయత్నాలు చేయాలి' అని తెలిపింది. అయితే వక్ఫ్‌ల నమోదును తప్పనిసరి చేసే నిబంధనలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఇది కొత్త అవసరం కాదని, 1995, 2013 నాటి మునుపటి చట్టాల ప్రకారం ఉందని పేర్కొంది. ఈ చట్టం ప్రకారం, వక్ఫ్ అంటే మసీదులు, పాఠశాలలు, ఆసుపత్రులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థలను నిర్మించడం వంటి ధార్మిక లేదా మతపరమైన ప్రయోజనాల కోసం ముస్లిం చేసిన దానం. 'వక్ఫ్‌కు మరొక నిర్వచించే లక్షణం ఏమిటంటే అది విడదీయరానిది. అంటే దానిని అమ్మలేము, బహుమతిగా ఇవ్వలేము, వారసత్వంగా పొందలేము లేదా భారం వేయలేము' అని పేర్కొంది. '2025 వక్ఫ్ (సవరణ) చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్ల విచారణ సందర్భంగా కోర్టుల ద్వారా వక్ఫ్, వినియోగదారుని ద్వారా వక్ఫ్ లేదా డీడ్ ద్వారా వక్ఫ్' గా ప్రకటించబడిన ఆస్తులను డీనోటిఫై చేసే అధికారంతో సహా మూడు కీలక అంశాలపై మే 22న సుప్రీం కోర్టు మూడు కీలక అంశాలపై తన ఆదేశాలను రిజర్వ్ చేసింది. డీనోటిఫికేషన్ సమస్యతో పాటు రాష్ట్ర వక్ఫ్ బోర్డులు, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ కూర్పుపై పిటిషనర్లు ప్రశ్నలు లేవనెత్తారు. అక్కడ ఎక్స్-అఫిషియో సభ్యులు మినహా ముస్లింలు మాత్రమే పనిచేయాలని వారు వాదించారు. మూడవ అంశం కలెక్టర్ ఆస్తి ప్రభుత్వ భూమి కాదా అని నిర్ధారించడానికి విచారణ నిర్వహించినప్పుడు వక్ఫ్ ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించరని చెప్పే నిబంధనకు సంబంధించనది. ఏప్రిల్ 25న కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వక్ఫ్ (సవరణ) చట్టం-2025ను సమర్థిస్తూ 1,332 పేజీల ప్రాథమిక అఫిడవిట్‌ను దాఖలు చేసింది. 'పార్లమెంటు ఆమోదించిన రాజ్యాంగబద్ధతను కలిగి ఉన్న చట్టం' పై కోర్టు 'బ్లాంకెట్ స్టే' ని వ్యతిరేకించింది. ఏప్రిల్ 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం పొందిన తర్వాత కేంద్రం ఏప్రిల్ 8న ఈ చట్టాన్ని నోటిఫై చేసింది. లోక్‌సభ, రాజ్యసభ వరుసగా ఏప్రిల్ 3-4న వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 ను ఆమోదించాయి.

ఎల్ఈడీ దీపాలపై పక్కా పర్యవేక్షణ

(మొదటిపేజీ తరువాయి)

కమాండ్ కంట్రోల్ సెంటర్లో మున్సిపల్, పంచాయతీ రాజ్, జీహెచ్ఎంసీ అధికారులతో సోమవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా లేదా అని ప్రతి పోల్ సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్ బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్ కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్లగొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ అధ్వర్యంలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే నిర్వహణ బాధ్యత అప్పగిస్తే... లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్తో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ సీఎంకు నివేదించింది. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలి టీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని సీఎం ఆదేశించారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కాగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించుకోవాలని సీఎం సూచించారు. ఐఐటీ వంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.ఎనిమిది కోట్ల కరెంటు బిల్లు చెల్లించాల్సి వస్తుందని, విద్యుత్తు ఆదా చేసేందుకు సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలన్నారు.

అంతర్ పంటల సాగుతో ఆర్థికాభివృద్ధి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రైతుల ఆర్థిక భివృద్ధి కోసం అంతర పంటల సాగు దోహదం చేస్తుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన సోమవారం ఏజెన్సీ ప్రాంతమైన ములకలపల్లి మండలంలోని మూక మామిడి పంచాయతీ పరిధిలో వున్న గుట్టగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వెదురు సాగును ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు కనితి భద్రయ్య, కనితి రాధా, కనితి పొట్టమ్మల పొలాల్లో స్వయంగా వెదురు మొక్కలు నాటి, గ్రామీణ వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించేందుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మొగరాల గొప్ప గ్రామంలో రైతు కీసర సుజాత చేలో వెదురు మొక్కను నాటి ప్రారంభించారు. తదుపరి కుంద్రు వెంకటమ్మ ఎకరం పొలంలో సాగు చేస్తున్న మునగ తోటను, గడ్డం వారి గుంపు గ్రామంలో రైతు కొమ్ము బుచ్చన్న సాగు చేస్తున్న రెండెకరాల మునగ పంటను పరిశీలించారు. ప్రతి రైతు సంప్రదాయ పంటలతో పాటు కొత్త పంటల సాగుకు ప్రయత్నించాలని అప్పుడే ఆర్థిక ఫలితాలు వుంటాయన్నారు. అంతర్ పంటల సాగు ద్వారా తక్కువ భూమిలోనూ అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అదనపు కలెక్టర్ విద్యా చందన, తాసిల్దార్ గన్యా నాయక్, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఏటీఎం వెంకయ్య, ఏపీవో హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : ప్రజల వద్ద నుండి వచ్చిన ఫిర్యాదులను జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి, తక్షణ పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కే.సీతారామారావుతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పెండింగ్ ఫిర్యాదులను సమీక్షిస్తూ, సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి తమ సిబ్బందితో స్టాఫ్ మీటింగ్, క్షేత్రస్థాయి సిబ్బందికి ఫీల్డ్ లేదా వెబ్ ఎక్స్ మీటింగ్‌లు నిర్వహించి, పనులు ఆలస్యం కాకుండా పూర్తి చేయాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ "ప్రతి పెండింగ్ ఫిర్యాదును జాగ్రత్తగా పరిశీలించి, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి అని పేర్కొన్నారు. ప్రజావాణిలో సోమవారం మొత్తంగా 41 ఫిర్యాదులు స్వీకరించబడి, సంబంధిత శాఖలకు పంపించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఓ పి.డి వివి అప్పారావు, డి.పి.ఓ యాదగిరి, డి.ఏ.ఓ శ్రీధర్ రెడ్డి, డి.సీ.ఓ పద్మ, డి.ఈ.ఓ అశోక్, డి.ఎం.హెచ్.ఓ చంద్రశేఖర్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాటం మహోజ్వల ఘట్టం

విశాలాంధ్ర - వనపర్తి : దేశ పోరాటాల చరిత్రలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహోజ్వల ఘట్టమని, సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ అన్నారు. సోమవారం పానగల్ మండలం కేతేపల్లిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహించారు. నాటి కమ్యూనిస్టు యోధులు రావి నారాయణరెడ్డి, మగ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, సోయాబుల్లాఖాన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. రమేష్, శ్రీరామ్, కళావతమ్మ మాట్లాడుతూ నిజాం నవాబు, రజాకార్లు, అతని తాబేదారులైన దొరలు జాగిర్దారులు భూస్వాములు ప్రజలచే వెట్టి చాకిరి చేయించారని, ప్రజల మాన ప్రాణాలను ఆస్తులను దోపిడీ చేశారన్నారు. భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల వెట్టి చాకిరి ముక్తి కోసం సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందన్నారు. నాటి పోరాట ఫలితమే నేటికి కూడా వెట్టి చాకిరీ లేకుండా పోయిందని, పేదలకు భూములు పంచే విధానం వచ్చిందన్నారు. ఎస్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గోపాల్, ఏఐవైఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంతోష్, కమ్మావుల పెంటయ్య, మాల కుర్మయ్య, కాకం చిన్న రాముడు, పరశురాముడు, రామాంజనే యుడు, మద్దిలేటి, వెంకటమ్మ, శంకరమ్మ, కురువమ్మ పాల్గొన్నారు.

దుకాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి, సింగరేణి: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రోడ్డు వెడల్పులో భాగంగా దుకాణాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు విజ్ఞాపనపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరిట చిరు వ్యాపారస్తుల దుకాణాలలో కూల్చి వేస్తూ వారి జీవితాలను రోడ్డుపై పడవేశారని అన్నారు. కూల్చివేతలు ఎందుకు చేస్తున్నారో, దుకాణదారులకు ఎలాంటి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా కుల్చివేతలు చేస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పు కోసం చేపడుతున్న ప్రణాళికలుఇక్కడి ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రజాప్రతినిధిగా రామగుండం ఎమ్మెల్యేకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపు అయిలయ్య యాదవ్, మాజీ కార్పోరేటర్లు గాధం విజయ, కల్వచర్ల కృష్ణ వేణీ,బాదె అంజలి,నాయకులు బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, ఆర్శనపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నూతి తిరుపతి, మేతుకు దేవరాజ్ ముద్దసాని సంధ్యా రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్‌లో మహాత్మజ్యోతి బాపులే బాలుర పాఠశాలను, ఖానాపూర్, ఎమ్మెల్యే, బొజ్జు, పటేల్, ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలతో కలిసి టిఫిన్ చేసి, బోజనాలను రుచి చూశారు. కిచెన్ రూమ్‌లో వంటలను పరిశీలించి పిల్లలకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని, విద్యను పిల్లలకు అర్ధమయ్యే విధంగా బోధించాలని, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, దునికేనా. దయానంద్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, అధికారి ఎంపీడీవో సి.రత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నల్గొండను టీబీ, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : నల్గొండ జిల్లాను టీబి, మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఒకరోజు నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం ఆయన మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో జిల్లా అధికారులు, ప్రముఖులతో ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో వైద్య ఆరోగ్య, నీటిపారుదల, విద్య, ఉపాధి హామీ, జల్ జీవన్, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛభారత్, భవిత కేంద్రాలు, గ్రామ సడక్ యోజన, టిబి ముక్త్ భారత్, గృహనిర్మాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవార్ శాంతి భద్రతలపై వివరాలను అందించారు. డిస్టిక్ గవర్నర్ మదన్ మోహన్, ఇండియన్ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ పుల్లారావు, వైద్యులు జయప్రకాశ్ రెడ్డి, సామాజిక కార్యకర్త సురేష్ గుప్తా, కవి సగర్ల సత్తయ్య, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు కృష్ణకాంత్ నాయక్, విద్యార్థిని అమూల్య, ఇతర ప్రముఖులు సమావేశంలో పాల్గొని వారి రంగాలలో చేస్తున్న సేవలను వివరించారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాసులు టీబీ నివారణకు తీసుకుంటున్న చర్యలు, చికిత్సా విధానాలపై గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, టీబీ నిర్మూలనకు ఉన్న అడ్డంకులను అడిగి తెలుసుకున్నారు. టీబి నివారణ కార్యక్రమానికి గ్రామ స్థాయిలో సర్పంచ్‌లను చురుకుగా పాల్గొనేలా చేయాలన్నారు. మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మహిళా సాధికారతకు కూడా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డిని ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ప్రముఖులను టీబి నివారణ కార్యక్రమానికి భాగస్వాములను చేయాలని గవర్నర్ సూచించారు. జిల్లా యంత్రాంగం టీబి నివారణతో పాటు పోషణ అభియాన్, ఇతర సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నట్లు గవర్నర్ ప్రశంసించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఏసీపీ మౌనిక, డిఎఫ్ఓ రాజశేఖర్, రాష్ట్ర గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్ పాల్గొన్నారు. జిల్లా అధికారులు, ప్రముఖులను జిల్లా కలెక్టర్, ఎంపీ శాలువా, మెమెంటోతో సత్కరించారు.

పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర - తొర్రూర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని తొర్రూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల పెళ్లిళ్లకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల ప్రయోజనం చేరేలా కృషి జరుగుతోందని ఆమె అన్నారు.మండలంలోని 78 మంది లబ్ధిదారులకు 78,09,048 రూపాయల విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పెళ్లిళ్లు గౌరవప్రదంగా జరిగేందుకు ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబం ఆర్థిక ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పథకాలను అందిస్తోందని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ ఎడ్యుకేషన్ అవసరం

విశాలాంధ్ర - కోదాడ : విద్యార్థులకు నైపుణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని కోదాడ ఎమ్మెల్యే ఎన్.ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోదాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనలో ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) విద్య అనుసంధానం చేయాలని, నేటి పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు సాంకేతికత డిజిటల్ ఎడ్యుకేషన్ అవసరమని తెలిపారు. సాంకేతికత నైపుణ్యమైన విద్య కోసం డిఎంఎఫ్‌టి(డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్) నిధుల ద్వారా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. పాఠశాలలో సాంకేతికత విద్యాభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి జిల్లా కలెక్టర్‌లు చేస్తున్న కృషికి కోదాడ మండల విద్యాధికారి ఎండి.సలీం షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్డిఓ సూర్యనారాయణ, ఎమ్మార్వో వాజిద్ అలీ, కోదాడ మున్సిపల్ కమిషనర్ రమాదేవి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, పీసీసీ డెలిగేట్ సభ్యులు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు డి.మార్కండేయ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

విశాలాంధ్ర - హుస్నాబాద్ : మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నా బాద్ నియోజకవర్గం కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీజేపీ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పొన్నం ప్రభాకర్‌కు మద్దతుగా ప్రచారానికి వచ్చిన రేవంత్ రెడ్డి అంబేద్కర్ చౌరస్తాలో హుస్నాబాద్ నియోజకవర్గాన్ని కరీంనగర్ జిల్లాలో కలుపుతామని హామీలు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ అమలు చేయలేదని మండిపడ్డారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మగాని సతీష్, మాజీ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు పోలవేణి శ్రీనివాస్, బొల్లి శ్రీనివాస్, నార్లపురం సత్యం, బొమ్మగాని జగన్నాథం, కన్నె శంకర్, వెల్దండి సత్యనారాయణ, ఇటికల కుమార్ స్వామి, బైరీ అరుణ్, పోలోజు రవీందర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. రష్యా విక్రమ్ యుద్ధం వల్ల చైనా రష్యాల నుండి మన దేశానికి వచ్చే యూరియా రాకపోవడం వల్ల ఈ సంక్షోభానికి కారణమని కేంద్రం నుండి వచ్చే యూరియాను తగ్గించడంతో రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. యాసంగి పంటకు కూడా సరిపడా యూరియాను రైతులకు అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రెవెన్యూ పరిధిలోని ఏవో అబ్దుల్‌మాలిక్, గ్రామపంచాయతీ సిబ్బందిని అభినందించారు. జిల్లా నాయకులు రమేష్ చందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ కొమ్మలు, రాష్ట్ర నాయకులు బుడిగె సతీష్, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ చంటిస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, అర్రెమ్ వీరస్వామి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోల్లికొండ మధు, మాజీ సర్పంచ్ బాలాజీ నాయక్, మండల నాయకులు రమేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయకపోతే ఆందోళన తప్పదు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : అక్రమ కేసులు ఎత్తివేయకపోతే మరొక ఆందోళన తప్పదని వామపక్ష నాయకులు బి విజయసారథి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్ల చట్టాలు రద్దు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని నాడు వామపక్షాలు చేసిన పోరాటంలో భాగంగా సోమవారం వామపక్ష నేతలు కోర్టుకు హాజరవడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా నల్ల చట్టాలు కోసం వామపక్షాలు పెద్ద ఎత్తున చేసిన పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మోడీ దిగివచ్చి రైతులకు క్షమాపణలు చెప్పాడన్నారు. 50 రోజుల పాటు సుదీర్ఘంగా పోరాటం చేసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కావడంలో వామపక్ష పార్టీలనే కీలకపాత్ర ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చొరవచూపి అక్రమ కేసులు ఎత్తివేయాలని లేకపోతే మరో పోరాటం తప్పదన్నారు. కోర్టుకు హాజరైన వారిలో వామపక్ష పార్టీల నేతలు బి అజయ్ సారథిరెడ్డి, నల్లు సుధాకర్ రెడ్డి, తమ్మెర విశ్వేశ్వరరావు, ఆకుల రాజు, లావత్ లింగ్య నాయక్, జగ్గన్న, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, చొప్పరి శేఖర్, నర్రా శ్రావణ్, మేక వీరన్న, గుణగంటి రాజు, దేవేందర్, కుంట ఉపేందర్, నాగయ్య, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, తండ మాధవి, కనకం పద్మ, శ్రీలత, సామ పాపయ్య, రావుల రాజు, గౌని వెంకన్న, హేమా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి: ఎస్సై

విశాలాంధ్ర - నేరేడుచర్ల : విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నేరేడుచర్ల ఎస్సై రవీందర్ నాయక్, ఇంపాక్ట్ ట్రైనర్ యాంటీ నార్కోటిక్ సోల్జర్ నేరేడుచర్ల హరివిల్లు క్లబ్ అధ్యక్షురాలు వీరవెల్లి శ్రీలత, ఇంపాక్ట్ ట్రైనర్ సరికొప్పుల నాగేశ్వరరావులు అన్నారు. సోమవారం వారు స్థానిక పినాకిల్ స్కూల్‌లో మోటివేషన్ క్లాసులు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అని అన్నారు. సమయం చాలా విలువైనదని రోజులో ఉండే 24 గంటలలో 7 గంటలు అమ్మ నాన్నలతో, ఆటపాటలతో గడపాలని, 8 గంటలు నిద్రపోవాలని మిగతా 9 గంటలు చదువుకు కేటాయించాలని కోరారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పినాకిల్ విద్యాసంస్థ చైర్మన్ మధార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీతి నిజాయితీకి మారుపేరు ఉప్పుల మాల్సూర్

విశాలాంధ్ర - మోతె : నిరుపేద కుటుంబంలో జన్మించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి సేవలందించిన ఉప్పుల మాల్సూర్ నీతి నిజాయితీకి మారుపేరు అని కోదాడ శాసనసభ సభ్యురాలు ఉత్తమ్ పద్మావతిరెడ్డి, తుంగతుర్తి శాసనసభ సభ్యులు మందుల శామేలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఉప్పుల మాల్సూర్ కుటుంబ పరిస్థితుల స్థితిగతులను తెలుసుకొని వారు మాట్లాడారు ఉప్పుల మల్సూర్ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఒక్కసారి సర్పంచ్ స్థానాన్ని గెలుచుకున్న వ్యక్తి అని అన్నారు. ఎమ్మెల్యే పదవిలో ఉండి కూడా సొంత ఇంటిని నిర్మించుకోకపోవడం నిజాయితీకి నిదర్శనం అని అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నో సేవలు అందించిన ఆయన విగ్రహాన్ని సూర్యాపేట జిల్లాలో ఏర్పాటు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో ఉప్పుల మాల్సూర్ కుటుంబంలోని ఆయన కుమారులకు కూతుర్లకు మనవళ్లకు మనవరాళ్ల అందరికీ ఇంటి నిర్మాణం చేపిస్తామని హామీ ఇచ్చారు. బార్ అసోసియేష న్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు మం డల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఆర్ ఐ కరుణాకర్ రెడ్డి, జిపిఓ వినోద్ రెడ్డి మండల నాయకులు మైనంపాటి గురువారెడ్డి, మాజీ జెడ్పిటిసి పందిళ్ళపల్లి పుల్లారావు, మాత్యనాయక్, నూకల మధుసూదన్ రెడ్డి, సామా చిన్న వెంకట్ రెడ్డి, వీరండి రామాచారి, గుల్ల శ్రీను పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, అందిన ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా మొత్తం 27 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ అర్జీలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణ ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డి.ఆర్.ఓ పద్మజ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమర్పించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితి లోపల పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాముఖ్యతను నిలబెట్టాలని సూచించారు.

అమ్మవార్ల చరిత్ర తెలిసేలా చర్యలు తీసుకుంటాం : మంత్రి సీతక్క

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : వనదేవతలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల ఆచారాలు దెబ్బ తినకుండా మేడారంలోని అమ్మవార్ల గద్దెలను సుందరంగా తీర్చిదిద్దుతామని, యుద్ధ ప్రాతిపదిక పై గుడి నిర్మాణ ఏర్పాట్లు చేసి భక్తులకు అందుబాటులో తేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గిరిజనుల ఆచారాలు సాంప్రదాయాలు పూజార్ల అభిప్రాయం మేరకే నూతన గుడి నిర్మాణ ఏర్పాట్లు జరుగుతాయని ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం మేడారంలోని శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంగణంలో గిరిజన పూజారులు, ఆర్కిటిక్, దేవాదాయ అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఎస్పీ డాక్టర్ శబరీష్, పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు లతో కలిసి మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరుందిన సమ్మక్క సారలమ్మ జాతరలో సేవ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని, గుడి ప్రాంగణాన్ని మార్పులు చేర్పులు చేయడంలో గత కొద్ది రోజులుగా పూజారులతో సమావేశం అవుతున్నామన్నారు. సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు, గోవిందరాజు గోత్రాల ప్రకారం గుడి నిర్మాణ ఏర్పాట్లు జరుగుతాయని, దీనిపై గతంలోనే ముఖ్యమంత్రి సమక్షంలో సమావేశం నిర్వహించడం జరిగిందని అన్నారు. రానున్న మేడారం మహా జాతర సందర్భంగా భక్తులు అవలీలంగా తల్లులు దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేయబోతున్నామని, భక్తుల విశ్వాసం దెబ్బతినకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్, ఈ ఓ వీరస్వామి, గిరిజన పూజారులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముందు జర్నలిస్టుల ఆందోళన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : వృత్తి ధర్మంలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై రైతుల ద్వారా అభిప్రాయసరీ కరణ చేస్తున్న టీ న్యూస్ ఖమ్మం జర్నలిస్ట్ వెన్న సాంబశివరావు కెమెరామెన్ నాగరాజులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ టి యు డబ్ల్యు జే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళనకు దిగారు. సోమవారం కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులను ఎత్తివేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వ విధానంపై విమర్శలు చేశారు. ఈ ఆందోళనకు మద్దతుగా పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు వనమా రాఘవేంద్రరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలో యూరియా బాధలపై కవరేజ్ ఇస్తున్న టీ న్యూస్ బ్యూరో సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజులపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైల్లో వేయటం దారుణమన్నారు. తక్షణమే సాంబశివరావు, నాగరాజులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని అయనతోపాటు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్‌రావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, గుర్రం రాజేష్‌లు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, సిపిఎం జిల్లా నాయకులు అన్నవరపు సత్యనారాయణ, టీఎస్ యుడబ్ల్యూజే నాయకులు జునుమాల రమేష్, ఫెడరేషన్ నాయకుడు దాసరి వెంకటేశ్వర్లు హాజరై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన టియు డబ్ల్యు జే జిల్లా కార్యదర్శి ఎండి. షఫీ, టెంజూ జిల్లా అధ్యక్షుడు వట్టికొండ రవి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, సమ్మయ్య, జర్నలిస్టులు తాండ్ర కృష్ణ గోవింద్, ప్రభాకర్ రెడ్డి, రవి, సీమకుర్తి రామకృష్ణ, రవీంద్ర, ఆవుల కోటేష్, ప్రవీణ్, ఈశ్వర్, రాము, రాజ్ కుమార్ తాండ్ర, రాందాస్ నాయక్, దుర్గ, సురేష్, కవటం శ్రీనివాస్, చంద్ర శేఖర్, నరేష్, కొట్టి నవీన్, వీరు నాయక్, క్రాంతి, శ్యామ్, సతీష్, రాధా కృష్ణ, సంజీవ్ కుమార్, రామకృష్ణ, శ్రీనివాస రావు,అల్లాడ రమేష్, సయ్యద్ నజీర్ పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - భద్రాచలం : వివాదాస్పద పోడు భూములలో అమలవుతున్న సిఆర్పిసి 145 సెక్షను గిరిజనేతరులు ఉల్లంఘించినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. ఐటీడీఏ పరిధిలోని ఆదివాసి గిరిజన గ్రామాల్లో ఎన్ని ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ బాధ్యులైన అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తుందన్నారు. సోమవారం భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించిన దర్బార్ లో అధికారి ఏపీఓకు సమస్యల మెమొన్నం సమర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ ఐటీడీఏ కార్యాలయం గిరిజనుల సమస్యల కోసం ఉందా... లేక గిరిజనేతరుల కోసం పనిచేస్తుందా అని ప్రశ్నించారు. చర్ల మండలం కుదునూరు పంచాయతీ పరిధిలోని పోడు భూముల సమస్యను గత పది సంవత్సరాల నుండి ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ భూముల విషయంలో గతంలో ఒక ఆదివాసి రైతును కిరాతకంగా హత్య చేశారని తెలిపారు. ఐటీడీఏ అధికారులు ఆదివాసుల పక్షాన ఏమాత్రం పనిచేయడం లేదని ఆరోపించారు. అక్కడి భూముల విషయంలో గిరిజనేతరులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. ఆదివాసుల కోసం పాటుపడుతున్నామని చెప్తున్న ప్రజాప్రతినిధులు కేవలం మీడియా ప్రచారానికే పరిమితమయ్యారని సత్యనారాయణ ఆరోపించారు. ఏ పి ఓ కు దరఖాస్తు చేసిన వారిలో అయనతోపాటు స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కన్వీనర్ ఇర్పా ప్రకాష్, చర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

తాత్కాలిక పనులు చేపట్టాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : భారీ వర్షాలకు దెబ్బతిన్న చోట తాత్కాలిక పనులు చేపట్టి రాకపోకలు జరిగేలా చూడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ మండలం మొత్తం భూపతిపూర్ వెళ్లే బ్రిడ్జి వద్ద కోతకు గురైన వాగును పరిశీలించారు. అనంతరం తెగిపోయిన చెరువును సందర్శించారు. తాత్కాలిక పనులు చేపట్టి వెంటనే రాకపోకలు సాగించేలా చూడాలన్నారు. అనంతరం మెదక్ రైల్వే స్టేషన్ బ్యాక్ సైడ్‌లో దెబ్బతిన్న సీసీ రోడ్లను పరిశీలించారు. వెంట ఈఈ నర్సింలు, మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డిఈ మహేష్, ఏఈ నితిన్, శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: ఎస్సీ వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర ఆగలేదని, దీంతో మాలలకు అన్యాయం జరిగిందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సయ్య అధ్యక్షతన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాలకుల గెలుపు కోసం పాటు పడితే ఏప్రిల్ 18 న ముఖ్యమంత్రి జీఓ ఇచ్చి అన్యాయం చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి మాలలు వ్యతిరేకం కాదని, సామాజిక న్యాయం జరగటం లేదని విమర్శించారు. రోస్టర్ విధానం వల్ల శాతవాహన యూనివర్సిటీలో 33 గెస్ట్ లెక్చరర్ పోస్టులు భర్తీలో ఒక్కరికి కూడా పోస్ట్ రాలేదని గుర్తు చేశారు. రోస్టర్ విధానంతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల 22 స్థానంలో మాలలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రోస్టర్ విధానంపై చర్చించి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. మన హక్కుల కోసం ప్రజలకు వివరించి పోరాటంలో భాగస్వాములు చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.

సంపాదకీయం

వక్ఫ్ చట్టం-ప్రభుత్వానికి చెంపదెబ్బ

వక్ఫ్ చట్టం ఆధారంగా ముస్లిం ధర్మ సంస్థల మీద పెత్తనం చేయడం, ముస్లింలు ఎలా జీవించాలో, వారి ధర్మ సంస్థలను ఎలా నిర్వహించుకోవాలో నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి లేదని సోమవారం సుప్రీంకోర్టు ఉత్తర్వు జారీ చేయడం మోదీ ప్రభుత్వానికి పెద్ద చెంపదెబ్బ కొట్టినట్టైంది. మూడు వివాదాస్పద అంశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులో మూడు ప్రధానాంశాలు ఉన్నాయి. ఒకటి: వక్ఫ్ ఆస్తి ఏదో, ఏది కాదో నిర్ణయించే అధికారం జిల్లా కలెక్టర్లకు అప్పగించడం చెల్లదన్న అంశం. వక్ఫ్ చట్టం ప్రకారం జిల్లా కలెక్టర్ ఒక ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా అంగీకరించకపోతే అది వక్ఫ్ ఆస్తి కాకుండా పోయేది. సుప్రీంకోర్టు నేడు జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఈ అంశం తేలాల్సింది హైకోర్టులో మాత్రమే. రెండు: ఒక వ్యక్తి వక్ఫ్‌కు ఏదైనా ఆస్తి దానం చేయాలంటే ఆ వ్యక్తి అయిదేళ్లపాటు తాను ముస్లింగా జీవించానని రుజువు చేసుకోవాలని చట్టంలో పేర్కొన్న అంశం కూడా చెల్లదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. మూడు: వక్ఫ్ బోర్డు ఎక్స్ అఫీషియో అధికారి తప్పని సరిగా ముస్లిమే అయి ఉండాలని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించింది. ఈ మూడు అంశాలు కూడా వక్ఫ్ విషయంలో ప్రభుత్వం ఇష్టా రాజ్యం చెలాయించడానికి వీలు లేదని స్పష్టం చేయడమే. ఇది మోదీ ప్రభుత్వ పన్నాగాలకు పెద్ద విఘాతమే. ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థకు కూడా ఇలాంటి ఆదేశమే జారీ చేసింది. సకల రాజ్యాంగ వ్యవస్థలకన్నా ఎన్నికల కమిషనే సర్వోన్నతమైంది అన్నట్టుగా ఇటీవలి కాలంలో ఎన్నికల కమిషన్ వ్యవహరించడం చూస్తూనే ఉన్నాం. ఎన్నికల వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడానికి వీలు లేదని ఎన్నికల కమిషన్ ఇటీవల సుప్రీంకోర్టుకు సమర్పించిన ప్రమాణ పత్రంలో పేర్కొంది. దీనికి కూడా అత్యున్నత న్యాయస్థానం అడ్డుకట్ట వేసింది. మసీద్ ఉన్న స్థలం ఎవరిది అన్న విషయం కూడా కలెక్టర్ నిర్ణయిస్తారు అన్న అంశాన్ని కూడా సుప్రీంకోర్టు ఒప్పలేదు. ప్రభుత్వం తరఫున న్యాయస్థానాలలో వాదించేది సోలిసిటర్ జనరల్. ఆయన కచ్చితంగా ప్రభుత్వ వాదననే ముందుకు తోస్తుంటారు. వక్ఫ్ విషయంలో సోమవారం జారీ చేసిన ఉత్తర్వులలో సోలిసిటర్ జనరల్ వాదనలనూ తోసిపుచ్చినట్టయింది. వక్ఫ్ చట్టంపై నాలుగు నెలల ముందు సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. అప్పుడు తీర్పు వెలువరించలేదు. సోమవారం వెలువరించిన తీర్పు ప్రభుత్వ వాదనలన్నింటినీ తునాతునకలు చేసింది. అయితే ఈ చట్టంలోని కొన్ని అంశాలపై సుప్రీంకోర్టు తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంది తప్ప వక్ఫ్ చట్టం మొత్తంగా చెల్లదని మాత్రం చెప్పలేదు. కేవలం కొన్ని అంశాలు చెల్లవని వాటి మీద స్టే విధించింది. రాజ్యాంగ వ్యవస్థలు ఏవైనా సరే అవి రాజ్యాంగ నియమాలకు అనుగుణంగా నడుచుకోకపోతే సహించేది లేదని సుప్రీంకోర్టు విస్పష్టంగా తెలియజెప్పింది. రాజ్యాంగ అనుగుణంగా వ్యవహరించనప్పుడు ఆ చర్యలను రద్దు చేస్తామని కూడా హెచ్చరించినట్టైంది. కలెక్టర్లు ఏది నిర్ణయిస్తే అదే అంతిమం అవుతుందన్న వక్ఫ్ చట్టంలోని సారాన్ని సుప్రీంకోర్టు బదాబదలు చేసింది. కలెక్టర్లు సర్వం సహాధికారులు కారని స్పష్టం చేసింది. అంటే పరిపాలన ప్రభుత్వ ఇష్టానుసారం జరగడానికి వీలులేదనీ, కార్యనిర్వాహక వర్గం కూడా రాజ్యాంగబద్ధమైంది కాబట్టి తదనుగుణంగా వ్యవహరించక తప్పదన్నది సోమవారం వెలువరించిన ఆదేశాల సారాంశం. ప్రభుత్వానికి కలిగిన పెద్ద విఘాతం ఇదే. వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను సభ్యులుగా చేసి వాటి మీద ఆధిపత్యం చెలాయించాలన్నది ప్రభుత్వ అపేక్ష. కానీ వక్ఫ్ బోర్డుల్లో ముగ్గురికన్నా ఎక్కువ మంది ముస్లిమేతరులు సభ్యులుగా ఉండడానికి వీలు లేదని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించింది. అలాగే కేంద్ర వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులు నలుగురికన్నా ఎక్కువ ఉండడానికి వీలు లేదని కూడా తెలియజేసింది. ఒక్క ముస్లింల నిర్వహణలోని వక్ఫ్ బోర్డుల్లోనే ముస్లిమేతరులు ఎందుకు ఉండాలో అర్థం కాదు. ఇతర మతాల వారికీ ధార్మిక సంస్థలున్నాయి. వాటిలో అన్యమతాలకు చెందని వారు లేనప్పుడు ఒక్క వక్ఫ్ బోర్డుల్లోనే ముస్లిమేతరులను దూర్చాలన్న ప్రభుత్వం ఉద్దేశం ముస్లింల మీద కక్ష తీర్చుకోవడం కిందే లెక్క. పౌరుల వ్యక్తిగత అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం కలెక్టర్లకు ఇవ్వడం కుదరదన్నది సోమవారం నాటి తీర్పులో అత్యంత ప్రధానాంశం. ఇది అధికార విభజన సూత్రాలకు విరుద్ధమైందన్నది సుప్రీం తీర్పు అంతరార్థం. ఒక ఆస్తి వక్ఫ్ ది అని ముస్లింల వాదన ఒక వేపు, అది ప్రభుత్వ స్థలమని ప్రభుత్వ వాదన మరో వేపు ఉన్నప్పుడు కలెక్టర్‌కు నిర్ణయాధికారం ఇవ్వడానికి వీల్లేదని సుప్రీంకోర్టు తేల్చేసింది. మహా అయితే కలెక్టర్ సదరు ఆస్తి ప్రభుత్వానిది అని చెప్తూ ప్రభుత్వానికి నివేదిక పంపొచ్చు.

సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లో ఇక ఇద్దరు మహిళల ప్రాతినిధ్యం తప్పనిసరి అవుతుంది. ఆ మహిళలు కూడా ముస్లింలు అయి ఉండాలి. వక్ఫ్ బిల్లును పరిశీలించడానికి సంయుక్త పార్లమెంటరీ కమిటీ కూడా ఏర్పాటైంది. దానికి అధ్యక్షుడు బీజేపీ నాయకుడు జగదంబికా పాల్. సం యుక్త పార్లమెంటరీ కమిటీలో ఆయన వక్ఫ్ చట్టంలోని అంశాలపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడాన్ని అనుమతించలేదు. అలాంటప్పుడు సం యుక్త పార్లమెంటరీ కమిటీ వల్ల ప్రయోజనం ఏమిటో అంతు పట్టదు. సంయుక్త పార్లమెంటరీ కమిటీలో ప్రతిపక్ష సభ్యులు కూడా ఉంటారు. కాని వారి సంఖ్య అధికారపక్ష సభ్యులకన్నా సహజంగానే తక్కువ ఉంటుంది. అంటే నిర్ణయం ప్రభుత్వానికి అనుకూలంగానే ఉంటుంది. కానీ సంయుక్త పార్లమెంటరీ కమిటీల ప్రయోజనం కేవలం అధికార, ప్రతిపక్షాల బలాబలాలకు పరిమితమైంది కాదు. ప్రతిపక్షాల అభిప్రాయాలకు కూడా విలువ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జగదంబికా పాల్ ఈ అవకాశమే ఇవ్వలేదు. వక్ఫ్ బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడూ, సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఈ అంశాన్ని పరిశీలించినప్పుడూ బీజేపీ సభ్యులు లేవదీసిన వాదనలన్నీ సోమవారం నాటి సుప్రీం తీర్పుతో పటాపంచలైపోయినట్టే. వక్ఫ్ చట్టం రాజ్యాంగ బద్ధమైందో కాదో సుప్రీం కోర్టు ఇంకా తేల్చలేదు. ఆ చట్టంలోని కొన్ని అత్యవసరం అంశాలను వివేచించి కొన్ని అంశాల మీదే స్టే విధించింది. వక్ఫ్ చట్టంలో కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉన్నందువల్ల వాటిపై మాత్రమే సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని ప్రత్యేక అంశాలపై స్టే విధించక తప్పదని మాత్రమే సుప్రీంకోర్టు భావించింది. ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి, ఏజీ మసీహ్‌తో కూడిన బెంచి మొత్తం చట్టం అమలుపై స్టే విధించాలని భావించకపోవడం గమనార్హం. మత వ్యవహారాల్లో ప్రభుత్వం ఇష్టానుసారం వ్యవహరించడానికి వీలు లేదని మాత్రం స్పష్టంగా చెప్పింది. అధికార విభజనల సూత్రాన్ని యదేచ్ఛగా ఉల్లంఘించడం కూడా కుదరదని తేల్చింది. ఈ అంశాలన్నీ ప్రభుత్వ దురుద్దేశాన్ని బట్టబయలు చేసేవే.

మనీ ఈటర్స్

చింతపట్ల సుదర్శన్

ఎప్పుడూ రద్దీగా ఉండే వీధిలో జనం కనిపించకపోవడంతో ఇదేదో తేడాగా ఉందే అనుకుంది డాగీ. రకరకాల పార్టీల వాళ్లు తమ పార్టీ ఓటు ఉందని ప్రజలకు గుర్తు చెయ్యడానికి ఏదో ఓ మిష మీద బంద్‌కు పిలుపునిస్తుంటారు. అలాగేమైనా జరిగిందేమో అనుకుంటూ నాలుగు కాళ్లు ఎగరేస్తూ పరుగెత్తిన డాగీకి మాంసం కొట్టు మూసి ఉండడం కనిపించింది కానీ దాని ఎదురుగ్గా నిలబడి ఓ వీధి కుక్కల గ్యాంగు మోరలు ఎత్తి పెద్దపెట్టున, అదే పనిగా అరుస్తుండడం ఆశ్చర్యపరిచింది. ఇదేందయ్య ఇది నేనెప్పుడూ చూళ్లేదే అనుకుంది. కొట్టు మూసి ఉంటుందని తనూ 'ఎక్స్‌పెక్టు' చేసింది, కాని ఇలా రోడ్డున పడ్డ కుక్కలు అరుపులతో నిరసనను తెలియచేస్తయి అనుకోలేదు. అసలు ఏ పార్టీ ఈ బందు ఆనందాన్ని

రంగస్థలం

పొందుతున్నదో, ఆ పార్టీకి వీధి కుక్కలు మద్దతు ఎందుకిస్తున్నవో 'టీవీ ఏంకర్' లా తెల్సుకునే ప్రయత్నం చేసింది.

ఆ రోజును ఏ పార్టీ బంద్ కోసం ఉపయోగించుకోవడం లేదని అంతకంటే 'షాకింగ్' విషయం ఓటి ఉందని డాగీకి తెలియవచ్చింది. కొద్ది సేపటి కింద ఎక్కణ్నించో వచ్చిన పులి ఒకటి వీధుల్లో సంచరించిందని దాన్ని చూసిన జనం హడలెత్తి, బెంబేలెత్తి రోడ్లు ఖాళీ చేసేరని, వీధిలో షాపులన్నీ అంచేతే మూతపడ్డాయని అర్థం అయింది. అయితే పులిని చూసి విద్యావంతులూ, నాగరికులూ, బలవంతులూ, ఓటర్లూ కూడా అయిన మనుషులు పారిపోతే, వీధిలో ఏది దొరికితే అది తిని బతుకీడుస్తున్న కుక్కలు మూకుమ్మడిగా అరవడం దేనికి? పులికి భయపడకుండా, పారిపోకుండా నిలబడటమేమిటి? తుచ్ఛమైన ఈ కుక్క ప్రాణాలు ఉంటే ఏం? పోతేనేం? అనుకుని ఆశ వదులుకుని అరుస్తున్నాయా అని ఆరా తీసింది డాగీ. రోడ్డు మీద పాదయాత్రకు వచ్చిన రాజకీయ నాయకుడిలా, ఠీవిగా నడుచుకుంటూ వచ్చిన పులిని చూసి భయంతో ఓ కుక్క పిల్ల 'కుయ్యికుయ్యి' అందని, అది విని దాని తల్లి బిక్కచచ్చి 'భౌ భౌ' మందని ఆ పైన తమకు వచ్చిన విద్యను ప్రదర్శిస్తూ అక్కడ్నించి పారిపోదామని గుంపుగా కొన్ని కుక్కలు అరిచేయని, వాటి అరుపులకు పులి తోకను కాళ్ల మధ్య దాచిపెట్టుకుని మరో వీధి వైపు పారిపోయిందని, అదలా పారిపోతుంటే కుక్కల గుంపు మరింత పెద్దదయి విజయగర్వంతో విచ్చలవిడిగా మొరగసాగినదని సమాచారాన్ని సేకరించింది డాగీ.

ఇదేం చిత్రం! భళారే విచిత్రం! వీధి కుక్కలు మొరిగితే పారిపోయిన పులి అదేం పులి? అదసలు పులేనా? అయినా దొంగలు పడ్డ ఆరునెల్లకు కుక్కలు మొరిగినాయన్నట్టు అది అనగా ఆ పులి అక్కడ్నించి వెళ్లిపోయేక కూడా ఇవి ఇంకా మొరగడం సబబు కాదు కదా. తనను చూసి మొరుగుతున్నవి కేవలం వీధి కుక్కలని, తనలాగా వాటికి విసరడానికి గోళ్లున్న 'పంజా' లేదని దానికి గనక అనిపిస్తే, అది గనక తిరిగొస్తే...ఎవడి ప్రాణం వాడికి గుంపులో గోవిందయ్యలా అక్కడే నిలబడి 'మాబ్ హిస్టీరియా' కు లోబడి అరిస్తే కడుపు నిండదు. ఆ పులి గనక తిరిగి వస్తే తినడానికి కడుపే ఉండదు అనుకుంటూ ఇంటి దారి పట్టింది డాగీ. అరుగు ఎక్కుతున్న డాగీని చూసి 'హమ్మయ్య' వచ్చేశావా? మనూళ్లో పులి తిరుగుతున్నదట తెలుసా! నువ్వెక్కడున్నావో, ఏమైపోయావో అని తెగ టెన్షన్‌పడ్డా అంది డాంకీ. నాకేమవుతుంది. ఏమీ అవలేదు. మాంసం కొట్టు ముందుండే మా వాళ్ల గ్యాంగ్ అరిచిన అరుపులకి పులి పార్టీ మార్చిన ఎంఎల్‌ఏలా మరో వీధిలోకి 'జంప్' అయిందట. అసలు మా వీధి కుక్కలకు ఇంత 'హార్స్ పవర్' లాంటి 'డాగ్ పవర్' ఉందని నాకిన్నేళ్లూ తెలీనే లేదు అంది డాగీ తన జాగాలో కూచుంటూ. ఏంటి హార్స్ పవరూ, డాగ్ పవరూ అన్న మాటలు వినపడ్డయి అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. ఊళ్లోకి 'టూరిస్టు'గా పులి వచ్చిందట సందర్శించడానికి నీకేం భయం లేదూ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని హన్‌మాన్ చాలీసా చదువుకుంటూ కూచోక ఇలా వచ్చావు అంది డాగీ. మీకు విషయం తెలీదా? అది 'జూ' నుంచి పారిపోయి వచ్చిందట. 'జూ' అధికారులు దాన్ని మత్తెక్కించి, చిత్తుచేసి జైలు నుంచి పారిపోయిన ఖైదీని పోలీసులు పట్టుకున్నట్టు పట్టుకుపోయారులే! అన్నాడబ్బాయి. అవునా? నిజంగానా? అంది డాగీ. అవునూ, నిజమూ రెండూను అన్నాడబ్బాయి. ఆశ్చర్యంగా నోరు తెరవల్సిన విషయం ఏమిటంటే అది మన వీధి కుక్కల అరుపులకు జడిసి పారిపోయిందట అంది డాంకీ పళ్లికిలిస్తూ. పిల్లి శాపానికి ఉట్టి తెగిపడదు. వీధి కుక్కల అరుపులకి పులి పారిపోదు. అది అడవిలోంచి వచ్చిన 'వైల్డ్ టైగర్' కాదు. 'జూ' లో చేవ చచ్చిన 'మైల్డ్ టైగర్'. అసలు మనుషులయినా పులులైనా స్థాన బలం, హోదా బలం ఉంటేనే ఏమైనా చెయ్యడం. అడవి నుంచి వచ్చిన పులైతే, మ్యాన్ ఈటర్ అయి ఉంటే ఈపాటికి శాల్తీలు లేచిపోయి ఉండేవి అన్నాడు అబ్బాయి. అవును 'బ్రో' నీ మాట నూటికి నూరుశాతం కరెక్టే. మన లీడర్లనే చూడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జూలో పులులే. అధికార పక్షంలోకి వచ్చారంటే ఇక మ్యాన్ ఈటర్లే అంది డాంకీ.

నువ్వు చాలా స్మార్ట్ డాంకీవి సుమా! ప్రతిపక్షంలో ఉండి శ్రీరంగనీతులు వల్లించే వారంతా అధికారపక్షంలోకి రాగానే నెత్తురు రుచి మరిగిన పులుల్లా అక్రమ సంపాదనకు ఎగబడతారు. వీధి రౌడీల్లా వసూళ్లకు తెగబడతారు. అవి పథకాలు కావచ్చు, కాంట్రాక్టు కావచ్చు, మందు దుకాణాలు కావచ్చు. ఇదీ అదీ అనికాక ఎక్కడెక్కడ కన్నం వేయాలో అక్కడక్కడ నొక్కేసి, పావు ఇక్కడ ముప్పావు అక్కడ దాచేసుకుంటారు అన్నాడు అబ్బాయి. ముప్పావంటే స్విస్ బ్యాంకనీ అనేక దేశాలనీ అర్థం కదా అంది డాంకీ. 'కౌన్ బనేగా కరోడ్ పతీ' కి పనికొస్తావు నువ్వు. ఈ మధ్య ఓ సంస్థ సర్వేచేసి తేల్చింది. దేశంలో నాలుగువేల మంది ఎమ్మెల్యేలు ఏబయి అయిదు వేల కోట్లు పోగేసుకున్నారట అన్నాడబ్బాయి. అవును మరి వ్యాపారం అన్నాక ముప్ఫయి నలభై కోట్లు ఖర్చుపెట్టి ఎంఎల్‌ఏలు అయిన వాళ్లు ఆ మాత్రం సంపాదించకపోతే ఎలా? అంది డాగీ.

ఒకప్పుడు రాజకీయం అనేది ప్రజాసేవ అయితే ఇప్పుడది పక్కా వ్యాపారం అయిందన్న మాట. డబ్బిచ్చి ఓట్లు కొనుక్కునే వాడికే కద ప్రజల్ని దోచుకునే హక్కు ఉండేది అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

విశాల వామపక్ష ఐక్యత తక్షణ అవశ్యం

డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

బీజేపీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజారిటీతో గెలుపొందింది. ప్రజాస్వామ్యంగా ఎన్నికై అధికారం చేపట్టినప్పటికీ ప్రజాస్వామ్యం నుంచి మరో వ్యవస్థకు మారాలన్న లక్ష్యం అంతరంగికంగా గాఢంగా ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ ఆయుధమే బీజేపీ. ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగానికి, విలువలకు ప్రమాదం కలిగిస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్‌కు దేశ స్వాతంత్ర్యానికి జరిగిన మహత్తర పోరాటంలో ఎలాంటి పాత్ర లేదు. ఫాసిస్టు విధానాల నుంచి ఆర్‌ఎస్‌ఎస్ స్ఫూర్తి పొందింది. ప్రజాస్వామ్య రిపబ్లిక్ నుంచి అసమానతలు గల మతం, కులం వర్గం, జెండర్ ఆధారిత మతపరమైన హిందూ రాష్ట్ర రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ తొలి నుంచి నిశ్చయించు కొంది. ఈ నిర్ణయానికి, ద్రోహ చింతనకు వ్యతిరేకంగా, ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం కమ్యూనిస్టులు, విశాల వామపక్ష ఉద్యమం ఎల్లవేళలా నిలిచింది. అయితే ఐక్యత లోపం, వామపక్ష సఖ్యత లేకపోవడం మూలంగా పూర్తి శక్తితో ప్రతిఘటించలేదు. నిరంకుశ ధోరణులు పెరగడం, విధ్వంసకర నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, మతాల మధ్య కావాలని విభజనలను సృష్టించడం, ఫాసిస్టు ధోరణులను పాటిస్తున్న శక్తులకు ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి, సమానత్వానికి విలువలనిస్తున్న శక్తులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పాలకులు, పాలక వర్గాలు వనరులపైన, సంస్థల పైన తీవ్రమైన పట్టు సాధించినప్పుడు పేదలు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల ప్రజలు రోజురోజుకీ అభద్రతకు లోనవుతున్నారు.

ఈ తరుణంలో వామపక్ష ఐక్యత తక్షణం అవసరం. వామపక్ష ఐక్యత ఎత్తుగడలను అనుసరించడం కాదు చారిత్రక అవసరం. ఆయా రాష్ట్రాలలో కామ్రేడ్లు మాట్లాడుకోవడంలో సానుభూతిపరుల అభిప్రాయాలలో, మేధావులు వామపక్ష శక్తులన్నీ ఐక్యం కావాలని కోరుతున్నారు. జాతీయ విముక్తి పోరాట కాలం నుంచి కమ్యూనిస్టు ఉద్యమంలో బలమైన మూలాలున్నాయి. రష్యాలో అక్టోబరు విప్లవం విజయవంతం నుంచి స్ఫూర్తి పొందారు. వలస పాలనలో దోపిడీని అనుభవించిన యువ విప్లవకారులు, కార్మికులు వారి నాయకులు కేవలం రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించడం మాత్రమేగాక ఆర్థిక, సామాజిక దోపిడీని అంతమొందించే వ్యవస్థ కోసం సంఘటితం కావాలని కోరుకున్నారు. 1925లో కాన్పూరులో సమావేశమై భారత కమ్యూనిస్టు పార్టీని (సీపీఐ) స్థాపించారు. అంతర్జాతీయ మార్క్సిజం -లెనినిజం, సోషలిజం సాధన లక్ష్యంతో దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి విప్లవకారులంతా ఒక్కటయ్యారు. అప్పటి నుంచే కమ్యూనిస్టు రాజకీయాలు ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూనే కార్మికుల, రైతుల, విద్యార్థుల, మహిళల సంఘాలను ఏర్పాటు చేశారు. బొంబాయి, కలకత్తాలలో ధీరోదాత్త పోరాటాలు జరిపారు. మహత్తర తెలంగాణలో రైతుల సాయుధ పోరాటం జరిగింది. పుదుచ్చేరిలో ఫ్రెంచి వాళ్లకు వ్యతిరేకంగా కార్మికులు ఒక్కటయ్యారు పున్నప్రవాయలార్, తెభాగా పోరాటాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా తంజావూరు డెల్టా ప్రాంతంలో రైతులు తిరుగుబాటు చేశారు. ప్రిన్సిలీస్టేట్స్‌లో స్వేచ్ఛ కోసం, పౌర హక్కుల కోసం ఉద్యమాలు జరిగాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సోషలిస్టు ఇండియా సాధనకు కమ్యూనిస్టు లక్ష్యం కోసం ప్రణాళిక రూపొందించడానికి ముందే ఈ ఉద్యమాలు జరిగాయి. పోరాటాలతో పాటు కార్మికులను, రైతులను, యువకులను, విద్యార్థులను, కళాకారులను, రచయిత లను, మేధావులను, వివిధ సామూహిక సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రజా ఉద్యమాలకు ఈ సంఘాలు మూలాలు. అలాగే ప్రగతిశీల సాంస్కృతికవాదులు, మేధావులు క్రియాశీలంగా పని చేశారు. చారిత్రక ఆకస్మిక అలజడుల మధ్య భారతదేశంలో సైద్ధాంతిక సవాళ్లు ఎదురయ్యాయి. సైద్ధాంతిక స్పష్టత, రాజకీయ వ్యూహాలపై సవాళ్లు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో 1964లో కమ్యూనిస్టు పార్టీలో చీలికలు చోటు చేసుకున్నాయి. పార్టీ సీపీఐ(ఎం) గా చీలింది. అంతర్జాతీయ, జాతీయ చర్చల పర్యావసానంగా చీలికలు వచ్చాయి. అలాగే ట్రేడ్ యూనియన్, విద్యార్థి, యువజన సంఘాలు కూడా విభజనకు గురయ్యాయి. చీలిక ప్రభావం ఎన్నికల పోటీలో ప్రతికూల ప్రభావం చూపింది. చీలిన రెండు పక్షాలు ఒకదానిపై మరొకటి పోటీపడ్డాయి. అనంతరం అనేక వామపక్ష గ్రూపులుగా ఏర్పాటయ్యాయి. పార్టీ చీలికలు, విడిపోవడంతో జాతీయ రాజకీయాలలో జోక్యం చేసుకునే స్థితి

ముసాయిదా తీర్మానాన్ని విడుదల చేస్తున్న డి.రాజా

బలహీనమైంది. అయితే అనేక రాష్ట్రాలలో, సెక్టార్లలో గణనీయమైన ప్రభావం కొనసాగింది. అనేక ప్రజా సమూహాల పోరాటాలలో కమ్యూనిస్టులు ముందు పీఠిన నిలిచారు. ఐక్యంగా లేకపోవడం వల్ల తరచుగా ఉద్యమాలు వెనబడుతున్నాయి.

1991లో దేశంలో నయా ఉదారవాద విధానాలు ప్రవేశించి నూతన సవాళ్లు ఎదురయ్యాయి. ప్రపంచ పెట్టుబడిదారులు ఇండియాలో భారీ వాణిజ్య సంస్థలు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాశనం చేశారు. క్రమంగా ప్రైవేటీకరణ విస్తరించి, వ్యవసాయరంగం తీవ్ర దురవస్థకు చేరింది. దేశంలో పెట్టుబడుల ఉప సంహరణ, విదేశీ పెట్టుబడుల ఆధిపత్యం, సామాజిక భద్రత మీద దాడులకు వ్యతిరేకంగా వామపక్షాలు మిలియన్‌ల మంది సమీకృతులై పోరాటాలు నిర్వహిస్తున్నారు. మత రాజకీయాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అనేక చారిత్రాత్మక కార్మిక సమ్మెలు, వీరోచితమైన రైతుల మహత్తర పోరాటాలు, సైద్ధాంతిక ప్రచార కార్యక్రమాలు జరిగాయి. వామపక్ష శక్తులు భారతదేశ ప్రజాస్వామ్యం పట్ల అప్రమత్తంగా ఉన్నాయి. అయినప్పటికీ పార్లమెంటులో వామపక్ష పార్టీలు బలహీనపడ్డాయి. 1978 లో భటిండాలో జరిగిన సీపీఐ మహాసభలో పార్టీ ఎదుర్కొన్న సవాళ్లను గుర్తించడం జరిగింది. నాటి నుంచి వామపక్ష ఐక్యత ఆవశ్యకత కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. దాదాపు ఐదు దశాబ్దాలుగా హద్దులను అధిగమించి దేశ వ్యాప్తంగా వామపక్ష శక్తులు ఐక్య కార్యాచరణ కోసం ప్రయత్నం జరుగుతోంది. ప్రస్తుతం కార్పొరేట్లు, మత శక్తులు ఐక్యమవుతున్నాయి. ఒకవైపు సంపద, వనరులు కొద్దిమంది గుత్త పెట్టుబడిదారీ సంపన్నుల చేతుల్లో ఉన్నాయి. అసమ్మతి తెలిపే శక్తుల గొంతులను అణచివేసేందుకు దుందుడుకు అతివాద జాతీయ వాదం మతవాదుల ద్వేషం ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రజాస్వామ్య సంస్థలను విధ్వంసం చేశారు. ఫెడరల్ సూత్రాలను నాశనం చేశారు. కార్మికుల, రైతుల, విద్యార్థులు, మైనారిటీలు, మహిళలను ఒక పద్ధతి ప్రకారం అణచివేస్తున్నారు. భారతదేశ స్వరూప స్వభావాలను మార్చేందుకు ఫాసిజం వైపు నడిపించేందుకు ఒక పద్ధతి ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వామపక్ష ఐక్యత ఎంతగానో అవసరమైంది. వామపక్షాలన్నీ ఒక తాటిపైకి రావలసిన అవసరం నేడు ఎంతైనా ఉంది. గతంలో ఏర్పడిన విభజనల వారసత్వాన్ని తప్పనిసరిగా అధిగ మించాలి. పాలకవర్గాల ప్రయోజనాలకోసం మరింత ముందుకు నడుస్తున్న శక్తులను అధిగమించి అనైక్యతను విడనాడాలి. ఐక్యత కోసం తీవ్ర ఒత్తిడి జరుగుతోంది. అన్ని వామపక్ష పార్టీలు మార్క్సిజం, లెనినిజం ఉమ్మడి సైద్ధాంతిక సూత్రాలను అనుసరించాలి. కార్మికవర్గం, రైతాంగం మార్క్సిజానికి కట్టుబడి ఉండాలి. పెట్టుబడిదారులు ఏమాత్రం సర్దుబాటు లేకుండా సామ్రాజ్యవాదాన్ని, మతోన్మాదాన్ని కులఅణచివేతను పాటిస్తున్నారు. అనుసరించే విధానంలో అనేక వ్యూహాత్మక విభేదాలు ఉన్నాయి. భారీ లక్ష్యాలు ఇంకా సాధించవలసి ఉన్నది. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు సమ్మెలు చేస్తున్నారు. కార్పొరేట్లు భూములను లాక్కునేందుకు వ్యతిరేకంగా రైతులు పోరాడుతున్నారు. నిరుద్యోగానికి, పెరుగుతున్న ఫీజులకు విద్యార్థులు, యువత నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీరి సమ్మెలకు, నిరసనలకు వామపక్షాలు ముందు పీఠిన నిలిచి పోరాటాలను సమర్థిస్తున్నారు. అలాగే సంఘీభావాన్ని, మద్దతును తెలుపుతూ పోరాటాలను బలోపేతం చేస్తున్నారు. మతోన్మాద అడ్డంకులను అధిగమించి వామపక్షాల నాయకత్వం బాధ్యతను వహించాలి. ఐక్య ఫ్రంట్‌ను ఏర్పాటుచేసుకోవాలి. అలాంటి ఐక్యతను కేవలం ఎన్నికల పొత్తులకు మాత్రమే పరిమితం చేయకూడదు. ప్రజాసమూహాల పోరాటాల నిర్మాణానికి వామపక్ష ఐక్యత తప్పనిసరి. సంయుక్తంగా ప్రచారం, సైద్ధాంతిక పోరాటాలను పాలకశక్తుల ప్రచారానికి వ్యతిరేకంగా నిర్వహించాలి. నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల అత్యాచారాలు, స్త్రీ, పురుషులపై హింస, వాతావరణ విధ్వంసం తదితర సమస్యలపై ఉమ్మడిపోరాటాలు నిర్వహించాలి. ఎన్నికల ఫలితాలపై తక్షణం సమీక్షించుకుని సంఘీభావాన్ని నెలకొల్పుకోవాలి. ఐక్యత ముందడుగు స్పష్టంగా ఉండాలి. ప్రజలపై ప్రభావాన్ని చూపే సమస్యలపైన సంయుక్త కార్యాచరణను ముందుగా నిర్వహించాలి. ప్రభుత్వరంగ సంస్థలను రక్షించుకోవాలి. విద్య, ఆరోగ్య రంగాలకు వ్యతిరేకంగా ప్రైవేటీకరణను నిరసిస్తూ ప్రచారం చేయడం భూమికోసం, వేతనాలకోసం, పోరాటాలు చేయడం మత విభజనకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం ఎంతైనా అవసరం. భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా పాలకవర్గ విధానాలను ఉమ్మడిగా సైద్ధాంతిక పోరాటాన్ని నిర్వహించాలి. అంతేకాదు, దేశ ప్రస్తుత పరిస్థితుల్లో సోషలిస్టు ప్రత్యామ్నాయాన్ని నిర్మించాలి. విశాల ప్రజాస్వామ్య పరిధిలో ఐక్యతను పునరుద్ధరించాలి. సెక్యులర్ శక్తులు ఇందుకు ప్రచారం చేయాలి. దేశవ్యాప్తంగా ప్రగతిశీల శక్తులను ఐక్యంచేసేం దుకు వామపక్షం ప్రధానపాత్రను వహించాలి. సీపీఐ 25 వ మహాసభ కోసం రూపొందించిన ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకుని మావోయిస్టు గ్రూపులు సాయుధపోరాట పంథాను తిరిగి పరిశీలించాలని లోతుగా ఆలోచించాలని, కమ్యూనిస్టు ఉద్యమం ప్రధానస్రవంతిలో తిరిగి చేరాలని ప్రజాప్రయోజనాల కోసం ఐక్య ప్రజాకార్యాచరణకు తమ శక్తియుక్తులన్నింటినీ వినియోగించాలని ముసాయిదా కోరింది. భారతదేశంలో 100 సంవత్సరాలుగా కమ్యూనిస్టు ఉద్యమం సాగుతోంది. సీపీఐ 25 వ మహాసభ వాస్తవ పరిస్థితులను, ఒక పంథాను ముందుకు తీసుకెళ్లేందుకు ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తుంది. గత శతాబ్దికాలంలో పొందిన అనుభవాలను, పార్టీ చీలిన తర్వాత ఎదురైన వెనుకబాటు తద్వారా పొందిన కష్టాలను పరిశీలించుకోవాలి. ప్రస్తుత పరిస్థితిని స్పష్టంగా అంచనా వేసుకోవాలి. సూత్రీకరణ ఆధారంగా కమ్యూనిస్టు ఉద్యమం తిరిగి పునరేకీకరణ జరగవలసిన అవసరం నేడు ఎంతైనాఉంది. కార్యాచరణ విభేదాలు కొనసాగుతున్నా యని భావిస్తున్నవారు ముందుకురావాలి. ఈ అంశంపై విశాలంగా, లోతుగా చర్చించాలి. మనల్ని విభజించిన దానికంటే ఎక్కువగా ఐక్యం చేయవలసిందేమిటో గుర్తించాలి. ఈ లక్ష్యం బలీయమైనది. తీవ్రమైన సవాళ్లు ఎదురైనప్పుడు భారతదేశం ఎల్లవేళలా సందర్భాన్ని అనుసరించి వామపక్షశక్తులు ధైర్యంగా నిలుస్తున్నాయి. ఈ విషయాన్ని చరిత్ర చెబుతోంది. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా, అత్యవసర పరిస్థితిని ప్రతిఘటించడానికి, నయాఉదారవాద సందర్భాలలో కమ్యూనిస్టులు ప్రజలకు అండగా నిలిచారు. నేడు ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నది. ఈ సందర్భంగా వామపక్షాలు చీలికలై ఉండరాదు. ఐక్యత అనేది విలాసంకాదు. పార్టీ పరిరక్షణకు, ముందుకుసాగడానికి ఐక్యత తప్పనిసరి. భారతదేశ ప్రజలు గొంతులేనివారికి గొంతు అందించడానికి ఐక్య వామపక్షశక్తులు తగినవి. ప్రజాస్వామ్య పరిరక్షకులుగా నిలవాలి. సోషలిజం సాధనకు మార్గదర్శకంగా నిలవాలి. అలాంటి ఐక్యతకు సమయం ఆసన్నమైంది.

వధ్య శిలపై గాలేరు నగరి రెండవ దశ ?



వి. శంకరయ్య

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నెలల క్రితం తిరుపతి పర్యటన సందర్భంగా గాలేరు నగరి రెండో దశ రూట్ మ్యాప్ గురించి చేసిన ప్రకటన దాని భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. సోమశిల స్వర్ణ ముఖి లింకు కెనాల్‌లో భాగమైన మేర్లపాక జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా గాలేరు నగరి రెండవ దశ లో భాగమైన మల్లిమడుగుకు ఆ తర్వాత తిరుమల శాశ్వత తాగునీటి కోసం ఉద్దేశించిన బాలాజీ రిజర్వాయర్‌తో పాటు గాలేరు నగరి రెండవ దశకు కృష్ణానదీ జలాలు తన హయాంలో తరలించుతానని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒరిజినల్ డీపీఆర్ మేరకు గాలేరు నగరి రెండవ దశకు 10.77 టీఎంసీల నీటి కేటాయింపు లున్నాయి. ఉమ్మడి కడప జిల్లాలో సర్వారాయసాగర్ ఉద్దిమడుగు జలాశయాలు దాటుకొని రాజంపేట కోడూరు మీదుగా మల్లి మడుగు జలాశయానికి గ్రావెటీతో ప్రధాన కాలువ రావాలి. అయితే గతంలోనే చంద్రబాబు నాయుడు అటవీ భూముల అనుమతి సాధ్యం కాదని అలైన్‌మెంట్ మార్పు చేసి వున్నారు. కండలేరు నుంచి కేపీ కెనాల్ ద్వారా ఎత్తిపోతలు ప్రకటించారు.

కండలేరు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం అవసరానికి మించి వున్నా కేపీ

కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యం నాలుగు వేల క్యూసెక్కులు మాత్రమే. అయితే ఎప్పుడూ నాలుగు వేల క్యూసెక్కులు విడుదల చేసింది లేదు. ప్రవహించనూ లేదు. కేపీ కెనాల్ కింద ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు ప్రస్తుతం తిరుపతి జిల్లాతో కలిపి మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయవలసి వుంది. చెన్నై తాగునీటికి 15 టీఎంసీల నీళ్లు ఈ కాలువ ద్వారానే అందించాలి. అంతే కాదు. ఇది వరకే వెంకటగిరి సమీపంలో ఆల్తూరుపాడు వద్ద నిర్మాణం చేపట్టిన జలాశయం నుంచి సోమశిల స్వర్ణముఖి లింకు కెనాల్‌కు నాలుగు టీఎంసీల నీళ్లు సరఫరా చేయాలి. ఇవన్నీ కాకుండా తిరుపతి తాగునీటికి రామాపురం జలాశయానికి ఈ కాలువ ద్వారా నీటి సరఫరా చేయ వలసి వుంది. అంటే కాలువ కింద ఆయకట్టుకు 30 టీఎంసీలు, చెన్నైకి 15 టీఎంసీలు, సోమశిల స్వర్ణ ముఖి లింకు కెనాల్‌కు నాలుగు టీఎంసీలు మొత్తం 50 టీఎంసీలు ఈ పాటికే సరఫరా చేయవలసి వుంది. ఈ పరిస్థితుల్లో గాలేరు నగరి రెండవ దశకు ఎత్తిపోతలతో మరొక పది టీఎంసీల నీళ్లు ఈ కాలువ ద్వారా సరఫరా చేయడం ఏలా సాధ్యం?. పైగా జగన్‌మోహన్ రెడ్డి తన హయాంలో అన్ని టెండర్లు రద్దు చేయడమే కాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా గాలేరు నగరి హంద్రీనీవా అనుసంధానం పేరుతో 6.5 టీఎంసీల సామర్థ్యంతో తంబళ్లపల్లి పుంగనూరు నియోజకవర్గాల్లో మూడు రిజర్వాయర్లకు 2144 కోట్లకు పరిపాలన అనుమతి ఇచ్చి టెండర్లు కూడా నిర్వహించి గాలేరు నగరి రెండవ దశ నీటి కేటాయింపులకు గండి కొట్టారు . ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఈ రిజర్వాయర్ల గురించి మీనమేషాలు లెక్కిస్తోంది. అంత క్రితమే డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కూడా గాలేరు నగరి రెండవ దశకు మరొక వెన్నుపోటు పడింది. గాలేరు నగరి పథకం తొలి డీపీఆర్ మేరకు గండికోట నీటి నిల్వ సామర్థ్యం 16.484 టీఎంసీలైతే డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెగించి 26 టీఎంసీలకు సామర్థ్యం పెంచి నిర్మాణం చేశారు. అంత వరకు ఆగకుండా తన నియోజకవర్గంలో తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టుకు నీళ్లు అందించేందుకు గండికోట నుంచి లిఫ్ట పెట్టి పైడిపాలెం జలాశయం నిర్మించారు. అసంపూర్తిగా వున్న చిత్రావతి జలాశయం పూర్తి చేశారు.

ఈ పూర్వ రంగంలో గాలేరు నగరి రెండవ దశ నిర్మాణం అట కెక్కింది. గాలేరు నగరి పథకానికి 38 టీఎంసీల కేటాయింపులుంటే ఆవిరి పారుదల నష్టం ఆరు టీఎంసీలు పోగా మిగిలినవి 32 టీఎంసీలే, ఇందులో గండికోట 26 టీఎంసీలు ఉమ్మడి కడప జిల్లాలోనే వామి కొండ 1.600 టీఎంసీలు సర్వారాయసాగర్ 3.059 టీఎంసీలు, ఉద్దిమడుగు 1.040 టీఎంసీలు మొత్తం 31 టీఎంసీలు కడప జిల్లాలోనే కాజేయబడ్డాయి. మరి గాలేరు నగరి రెండవ దశకు మిగిలినదెంత? హళ్లి కి హళ్లి సున్నాకు సున్నా మాత్రమే. రాష్ట్ర విభజన తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు కూడా రెండవ దశకు జరిగిన అపకారం సరిదిద్దక పోగా గ్రావెటీతో వున్న పథకాన్ని కేపీ కెనాల్ నుంచి ఎత్తిపోతలకు మార్పు చేశారు. గాలేరు నగరి రెండవ దశకు ఇంత అపకారం జరుగుతుంటే డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో గాని రాష్ట్ర విభజన తర్వాత టీడీపీ కాలంలో గాని జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గాని ఈ ప్రాంతానికి చెందిన ఒక్క శాసన సభ్యుడు నోరు విప్పిన పాపాన పోలేదు. ఇప్పుడు ఎన్నికైన ఎమ్మెల్యేలూ పట్టించుకోవడం లేదు. ఈ పథకం అమలు జరిగితే తిరుపతి, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో లక్షా పదివేల ఎకరాలకు చెందిన రైతులకు లబ్ధి చేకూరుతుంది. వాస్తవంలో మల్లి మడుగు నుంచి బయలుదేరే కైలాస్ గిరి కెనాల్ కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం మీదుగా ఆరణియార్ జలాశయంతో అంత మౌతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా వాసి. జిల్లా రుణం తీర్చుకోవాలంటే గాలేరు నగరి రెండవ దశ ఒరిజినల్ అలైన్‌మెంట్ సర్వారాయసాగర్ ఉద్దిమడుగు మీదుగా గ్రావెటీతో మల్లిమడుగు అనుసంధానం చేయవలసి వుంది. తత్ఫలితంగా ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు గాలేరు నగరి రెండవ దశ ద్వారా సాగునీరు అందుతుంది.

విశ్రాంత పాత్రికేయులు

ఏఐ కంటెంట్ సృష్టికర్తలకు లైసెన్స్‌లు అవసరం: పార్లమెంట్ సంఘం

న్యూఢిల్లీ: కృత్రిమేధ సాయంతో కంటెంట్ సృష్టించేవారు కచ్చితంగా లైసెన్స్‌లు తీసుకోవాలని పార్లమెంటరీ ప్యానల్ సూచించింది. దీంతో ఏఐ ఆధారిత వీడియోలు, కంటెంట్‌కు అనుమతులు తప్పనిసరిగా మారే అవకాశం ఉంది. తీవ్రస్థాయిలో వ్యాపిస్తున్న తప్పుడు వార్తలను అడ్డుకోవడానికి ఈ ప్రతిపాదనను ముందుకుతీసుకొచ్చినట్లు తెలుస్తోంది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ నివేదికను ఇచ్చింది. దీనికి బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే అధ్యక్షత వహిస్తున్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే సంస్థలు, వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొనే మార్గాలను కోరింది. ఈ కమిటీ ఇటీవలే తమ ముసాయిదా నివేదికను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించింది. వచ్చే సీజన్ సమావేశాల్లో దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. సమాచార, ఎలక్ట్రానిక్-ఐటీ మంత్రిత్వశాఖలు సహా... ఇతర మంత్రులు, విభాగాల మధ్య బలమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. ఇప్పటికే డీఫ్ ఫేక్ టెక్నాలజీ నుంచి వచ్చే సమస్యలను అధ్యయనం చేయడానికి ఎలక్ట్రానిక్-ఐటీ మంత్రిత్వశాఖ తొమ్మిది మంది సభ్యులతో కూడిన సంఘాన్ని ఏర్పాటుచేసింది. డీఫ్ ఫేక్ స్పీచ్, వీడియోలు, వాయిస్ గుర్తించేందుకు వీలుగా రెండు ప్రాజెక్టులు మొదలైనట్లు ఈ నివేదిక వెల్లడించింది. ప్రజలు, ప్రజాస్వామ్యానికి ఫేక్ న్యూస్ తీవ్రమైన ముప్పుగా మారాయని కమిటీ అభిప్రాయపడింది.

డ్రైవర్ కిడ్నాప్ కేసులో తెరపైకి పూజా ఖేడ్కర్ పేరు

న్యూఢిల్లీ: యూపీఎస్సీకి తప్పుడు పత్రాలు సమర్పించి ఐఏఎస్ ఉద్యోగం కోల్పోయిన పూజా ఖేడ్కర్ మరో వివాదంలో చిక్కుకున్నారు. ఓ ట్రక్కు డ్రైవర్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఆమె పేరు మళ్లీ బయటకు వచ్చింది. నవీ ముంబైలోని ఎరోలీ సిగ్నల్ వద్ద కాంక్రీట్ మిక్సర్ ట్రక్, కారు ఢీకొన్నాయి. ఆ సమయంలో ప్రహ్లాద్‌కుమార్ అనే డ్రైవర్ ట్రక్కును నడిపాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ప్రహ్లాద్‌ను ఇద్దరు వ్యక్తులు బలవంతంగా కారులో తీసుకెళ్లారని పోలీసులు తెలిపారు. విచారణ చేపట్టగా డ్రైవర్ పుణెలోని చతుశృంగి ప్రాంతంలో ఉన్నట్లు తేలిందని వెల్లడించారు. అతడి కోసం పూజా ఖేడ్కర్ ఇంటికి వెళ్లగా... ఆమె తల్లి నుంచి తమకు ప్రతిఘటన ఎదురైందని పేర్కొన్నారు. మనోరమ ఖేడ్కర్ తమ విధులకు ఆటంకం కలిగించిందన్నారు. దీంతో ఆమెకు సమన్లు జారీ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు రావాలని కోరారు.

మహారాష్ట్ర గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్ ప్రమాణం

ముంబై: మహారాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం ముంబైలోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రశేఖర్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా హాజరయ్యారు. ఇటీవలే జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ గెలుపొందిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మహారాష్ట్ర గవర్నర్ పదవి నుంచి వైదొలిగారు. ఈనెల 12న భారత 15వ ఉప రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన రాజీనామాతో ఈ ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు మహారాష్ట్ర గవర్నర్‌గా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

హఠాత్తుగా ఆగిన మోనో రైలు.. ప్రయాణికులు భద్రం

ముంబై: ముంబైలో మోనోరైలు సేవల్లో మరోసారి అంతరాయం ఏర్పడింది. రైలు సోమవారం ఉదయం హఠాత్తుగా ఆగిపోవడంతో అందులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మోనో రైలు సోమవారం ఉదయం 7:45 గంటల సమయంలో వడాలా వైపు వెళ్తోంది. అయితే, సాంకేతిక సమస్య కారణంగా రైలు హఠాత్తుగా ఆగిపోయింది. దీంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అందులోని వారందరినీ సురక్షితంగా కాపాడినట్లు ముంబై మెట్రో పాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వెల్లడించింది. చెంబూర్ నుంచి వచ్చిన మరో మోనోరైలులో వారిని సురక్షితంగా తరలించారు. విద్యుత్ సరఫరాలో సమస్య కారణంగానే అంతరాయం ఏర్పడినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. మోనో రైలును కప్లింగ్ ద్వారా అక్కడి నుంచి తొలగించనున్నారు. గత నెలలో కూడా ఓ మోనో రైల్లో సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. నగరంలోని ఆచార్య అత్రే చౌక్ స్టేషన్‌లో ఓ మోనో రైలు దాదాపు 12 నిమిషాల పాటు నిలిచిపోయింది. ముంబైలో మోనోరైల్ సేవలు 2014 నుంచి కొనసాగుతున్నాయి.

ఆరు సాగు పథకాల ఊసే లేదు

- బడ్జెట్‌లో ప్రకటనలు తప్ప ఆచరణ శూన్యం
- విడుదల కాని మార్గదర్శకాలు- నిధులు
- మిషన్లకు ఇంకా లభించని అనుమతులు

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వానికి ప్రకటనలు, ఆర్భాటాలు పరిపాటయ్యాయి. ఇది మాటల ప్రభుత్వం... చేతల ప్రభుత్వం కాదన్న విమర్శలున్నాగానీ ఇచ్చిన హామీలు, చేసిన ప్రకటనలను నిలబెట్టుకోవడంలో సర్కారుకు ఎంత మాత్రం చిత్తశుద్ధి లేదంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అర్ధభాగం పూర్తి అయినప్పటికీ కేంద్ర బడ్జెట్ 2025-26లో గొప్పగా ప్రకటించిన ఆరు కొత్త సాగు పథకాల ఊసే ఎత్తలేదు. వీటిలో ప్రధానమంత్రి ధన్-ధాన్య క్రిషి యోజన, బీహార్‌లో మఖానా బోర్డుతో పాటు పప్పులు, కూరగాయలు-పండ్లు, హైబ్రిడ్ విత్తనాలు, పత్తి సాంకేతికత కోసం నాలుగు మిషన్లు ఉన్నాయి. ఇవన్నీ బడ్జెట్ ప్రకటనలుగానే మిగిలాయి. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ క్రమంలో 100 సాగు జిల్లాల అభివృద్ధి కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంతో మొదలై ఆరేళ్లు సాగే ప్రధాన మంత్రి ధన్-ధాన్య క్రిషి యోజనను కేంద్ర కేబినెట్ జులై 16న ఆమోదించింది. తద్వారా 1.7 కోట్ల మంది రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేసింది. అయితే, ఈ పథకం కోసం మార్గదర్శకాలుగానీ, జిల్లాల జాబితాగానీ వ్యవసాయ శాఖ నేటికీ విడుదల చేయలేదు. అవి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం కోసం పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెద్ద ప్రకటనగా ప్రచారం చేసిన మఖానా బోర్డు కూడా ఏర్పాటు కాలేదు. కేంద్ర కేబినెట్ ఆమోదం అవసరం లేదుగనుక మఖానా బోర్డు కోసం రూ.100 కోట్ల బడ్జెట్‌ను వ్యవసాయ శాఖకు సంబంధించి ఆర్థిక స్థాయి సంఘం (ఎస్ఎఫ్‌సీ) ఆమోదించింది. ఈ బోర్డు త్వరలోనే ఏర్పాటు కాబోతోందని అధికారులు చెబుతున్నారు కానీ ఆ దిశగా కార్యాచరణ లేదు. అలాగే కంది, మినప, ఎర్ర పప్పులపై దృష్టితో ఆరేళ్ల కోసం 'మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్' (పప్పుధాన్యాల్లో స్వీయసమృద్ధి కోసం మిషన్)కు ఆర్థిక వ్యయ కమిటీ (ఈఎఫ్‌సీ) ఆమోదం లభించింది కానీ, కేంద్ర కేబినెట్ ఇంకా పచ్చజెండా ఊపలేదు. కేంద్ర కేబినెట్ అమోదించి, మార్గదర్శకాలు విడుదలైతే తప్ప ఈ పథకం అమల్లోకి రాదు. పత్తి ఉత్పత్తి కోసం మిషన్‌పైనా స్పష్టత లేదు. ఎప్పుడు అమల్లోకి వస్తుందో తెలియదు. కూరగాయలు, పండ్ల కోసం సమగ్ర కార్యక్రమానికి ఆర్థిక వ్యయ కమిటీ, కేంద్ర కేబినెట్ నుంచి ఆమోదం లభించలేదు. హైబ్రిడ్ విత్తనాల కోసం జాతీయ మిషన్ కూడా ఆమోదం కోసం వేచివున్నది. వ్యవసాయ శాఖ పరిధిలోని వ్యవసాయ పరిశోధన, విద్య శాఖ (డీఏఆర్ఈ) ఇప్పటికే ఈఎఫ్‌సీ ఆమోదం కోసం ప్రతిపాదన పంపింది. కాగా, ప్రధానమంత్రి ధన్-ధాన్య క్రిషి యోజన కోసం వేరుగా ఎలాంటి కేటాయింపులు చేయలేదు. కానీ, 11 మంత్రిత్వశాఖల పరిధిలోని 36 పథకాల విలీనం ద్వారా రూ.24వేల కోట్ల వ్యయంతో ఆరేళ్లలో 100 వ్యవసాయ జిల్లాల అభివృద్ధి లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రకటించారు. ఇక పప్పుల మిషన్ కోసం రూ.వెయ్యి కోట్లు, కూరగాయలు, పండ్ల మిషన్ కోసం రూ.500 కోట్లు, మఖానా బోర్డు కోసం రూ.100 కోట్లు, హైబ్రిడ్ విత్తనాల జాతీయ మిషన్ కోసం రూ.100 కోట్లు, పత్తి టెక్నాలజీ మిషన్ కోసం రూ.500 కోటట్లు చొప్పున కేటాయించారు. ఈ పథకాలన్నీ పట్టాలు ఎక్కకపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి చేయాల్సిన వార్షిక వ్యయం మంత్రిత్వశాఖలకు కష్టమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయానికి మంత్రిత్వ శాఖలు హడావిడిగా ఖర్చు చేయకూడదని సాధారణ ఆర్థిక నియమాలు (జీఎఫ్ఆర్‌ల) చెబుతుండటం విదితమే.

ప్రాణాలకు తెగించి పసికందులను కాపాడిన నర్సులు

గువహతి: అసోంలో ఆదివారం సాయంత్రం 5.8 తీవ్రతతో భూకంపం సంభవించిన సమయంలో ధైర్యసాహసాలు ప్రదర్శించి నవజాత శిశువుల ప్రాణాలను కాపాడిన ఇద్దరు నర్సుల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వారి ధైర్యానికి, మానవత్వానికి విస్తృత ప్రశంసలు లభిస్తున్నాయి. నాగావ్ నగరంలోని ఆదిత్య నర్సింగ్ హోమ్‌లోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ)లో రికార్డయిన ఈ వీడియో భూకంపం వచ్చిన సమయంలో అక్కడి పరిస్థితిని కళ్లకు కట్టింది. సాయంత్రం 4:40 గంటల ప్రాంతంలో భూమి కంపించడం మొదలుకాగానే ఆ ఇద్దరు నర్సులు క్షణం కూడా ఆలస్యం చేయకుండా శిశువుల వద్దకు పరుగెత్తారు. వార్డులోని వస్తువులు, అద్దం, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర వైద్య పరికరాలు తీవ్రంగా ఊగిపోతున్నప్పటికీ, వారు తమ ప్రాణాలను లెక్కచేయకుండా శిశువులను పట్టుకున్నారు. ఒక నర్సు ఇద్దరు శిశువులను కాపాడగా, మరో నర్సు ఒక శిశువుకు తన చేతులతో కవచంలా అడ్డుగా నిలబడింది. భూకంపం ఆగే వరకు కూడా వారు ధైర్యం కోల్పోకుండా, శిశువులను తమ చేతుల్లోనే సురక్షితంగా ఉంచుకున్నారు. ఈ భూకంప కేంద్రం ఉదల్గురి జిల్లాలో 5 కిలోమీటర్ల లోతున నమోదైంది. గువహతి, ఉదల్గురి, సోనిత్‌పూర్, తముల్పూర్, నల్బరీతో పాటు అనేక జిల్లాల ప్రజలు భయాందోళనలతో ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. దీని తర్వాత కొన్ని నిమిషాల వ్యవధిలోనే మరో రెండు స్వల్ప భూకంపాలు కూడా సంభవించాయి. ఒకటి 3.1 తీవ్రతతో 4:58 గంటలకు, మరొకటి 2.9 తీవ్రతతో 5:21 గంటలకు నమోదయ్యాయి. ఈ ప్రకంపనలు మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా సంభవించాయి. కష్టకాలంలోనూ తమ విధిని మరువకుండా, చిన్నారి ప్రాణాలను కాపాడిన ఆ నర్సుల ధైర్యం అందరికీ స్ఫూర్తినిస్తోంది.

ఆర్జేడీ, కాంగ్రెస్ వల్లే బీహార్‌కు నష్టం: ప్రధాని మోదీ

పట్నా: ఆర్‌జేడీ, కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన కారణంగా బీహార్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రస్తుతం తాము చేపడుతున్న అభివృద్ధిని చూసి ఆ రెండు పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో పర్యటించిన ప్రధాని, జాతీయ మఖానా బోర్డుతో పాటు 36 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పేదలకు మద్దతివ్వటమే తన విధానమని ప్రధాని మోదీ తెలిపారు. అందులో భాగంగానే నాలుగు కోట్ల ఇళ్లను పేదలకు నిర్మించి ఇచ్చామని చెప్పారు. మరో మూడు కోట్ల గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని వెల్లడించారు.

రాజకీయ పార్టీలు 'పని ప్రదేశాలు' కావు

లైంగిక వేధింపుల చట్టం వర్తించదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రాజకీయ రంగంలో పనిచేస్తున్న మహిళలకు లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్) కింద రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు, కార్యకర్తలకు మధ్య యజమాని-ఉద్యోగి సంబంధం ఉండదని, కాబట్టి రాజకీయ పార్టీలను 'పని ప్రదేశం'గా పరిగణించజాలమని పేర్కొంది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. రాజకీయ పార్టీలను 'పోష్' చట్టంలోని 'పని ప్రదేశం' నిర్వచనం కిందకు ఎలా తీసుకురాగలమని ధర్మాసనం ప్రశ్నించింది. పార్టీకి, దాని కార్యకర్తలకు మధ్య యజమాని-ఉద్యోగి బంధం లేనప్పుడు, ఈ చట్టం వర్తింపజేయడం సాధ్యం కాదని అభిప్రాయపడింది. అడ్వకేట్ యోగమాయ ఎం.జి. ఈ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. 2022 మార్చిలో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. యజమాని-ఉద్యోగి సంబంధం లేనందున, రాజకీయ పార్టీలు అంతర్గత ఫిర్యాదుల కమిటీలను (ఐసీసీ) ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని అప్పట్లో కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు తీర్పు వల్ల రాజకీయ, సినీ, మీడియా వంటి అనధికారిక రంగాలలో పనిచేస్తున్న ఎంతో మంది మహిళలు పోష్ చట్టం రక్షణకు దూరమవుతున్నారని పిటిషనర్ వాదించారు. 'యజమాని', 'ఉద్యోగి', 'పని ప్రదేశం' వంటి పదాలకు చట్టంలో విస్తృత అర్థం ఉందని, కానీ హైకోర్టు తీర్పు దాని స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 19(1) (జి),21 కింద కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమేనని పిటిషన్‌లో ఆరోపించారు. గత నెలలో కూడా ఇదే తరహా ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సీజేఐ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనమే తిరస్కరించింది. అయితే, కేరళ హైకోర్టు తీర్పును ప్రత్యేకంగా ఎస్ఎల్‌పీ ద్వారా సవాలు చేయవచ్చని అప్పుడు సూచించింది. కాగా, గతేడాది డిసెంబర్‌లో ఇలాంటి మరో పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ విషయంలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించడం గమనార్హం.

సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్?

రైల్వే రిజర్వేషన్ విధానంలో కీలక మార్పు

న్యూఢిల్లీ: రిజర్వేషన్ విధానానికి సంబంధించి రైల్వే బోర్డు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై సాధారణ రిజర్వేషన్ టికెట్లకూ ఆధార్ అథెంటికేషన్‌ను తప్పనిసరి చేసింది. మొదటి 15 నిమిషాలు కేవలం ఆధార్ వెరిఫైడ్ యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ లేదా అధికారిక యాప్‌లో టికెట్లు రిజర్వేషన్ చేసుకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇది తత్కాల్ బుకింగ్ విధానంలో అమల్లో ఉంది. అక్టోబర్ 1 నుంచి సాధారణ రిజర్వేషన్లకు కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. ఏదైనా రైలుకు ప్రస్తుతం 60 రోజుల ముందే టికెట్ రిజర్వేషన్ చేసుకునేందుకు సౌలభ్యం ఉంది. కానీ, తత్కాల్ టికెట్ల మాదిరిగానే బుకింగ్ ప్రారంభమైన వెంటనే అక్రమార్కులు సాఫ్ట్‌వేర్ సాయంతో టికెట్లను బుక్ చేసేస్తున్నారు. దీంతో సాధారణ ప్రయాణికులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ టికెట్లు పక్కదోవ పట్టకుండా సామాన్య యూజర్‌కు ఆ ప్రయోజనాలు అందాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే బోర్డు పేర్కొంది. ఈ మేరకు అన్ని జోనల్ కార్యాలయాలకు సమాచారం ఇచ్చింది.

ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇస్తామని చెప్పి... ఇరాన్‌లో చిత్రహింసలు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో ఉద్యోగం వస్తుందనే ఆశతో వెళ్లిన వ్యక్తిని ఇరాన్‌లో ఓ ముఠా కిడ్నాప్ చేసింది. రూ.20 లక్షలు చెల్లించి అతడిని విడిపించుకున్నామని బాధిత కుటుంబం మీడియాకు తెలిపింది. పోలీసుల వివరాల ప్రకారం... కేరళకు చెందిన హిమాన్షు మాథుర్ ఉద్యోగం కోసం తొలుత అమన్ రాఠీని కలిశాడు. హరియాణాలోని కర్నాల్‌లో ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్నట్లు అమన్ తనను తాను పరిచయం చేసుకున్నాడు. కంటిన్యూస్ డిశ్చార్జి సర్టిఫికెట్ కోర్సు చేస్తే షిప్పింగ్ జాబ్ వస్తుందని అమన్, మాథుర్‌ను నమ్మించాడు. దాంతో ఆస్ట్రేలియాలో వర్క్ వీసాకు మార్గం సుగమం అవుతుందని చెప్పాడు. ఈ మాటలు నమ్మి మాథుర్ నోయిడాలో కోర్సు కూడా పూర్తిచేశాడు. ఆగస్టు ప్రారంభంలో మళ్లీ అమన్, మాథుర్‌ను సంప్రదించాడు. తాను ఇండోనేసియాలో ఉన్నానని, రూ.19 లక్షలకు వీసా ఇవ్వడానికి ఓ ఏజెంట్ సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. దీంతో మాథుర్ ఢిల్లీ నుంచి బయల్దేరి జకార్తా వెళ్లాడు. అక్కడ పానిపట్‌కు చెందిన మరో వ్యక్తి విశాల్‌ను కలుసుకున్నాడు. తొమ్మిదో తేదీన కర్నాల్‌కు చెందిన తమ మనిషి వస్తాడని, అతడికి రూ.12 లక్షలు ఇవ్వాలని కోరారు. మిగిలిన రూ.7 లక్షలు తర్వాత ఇవ్వమని చెప్పారు. మూడు వారాల తర్వాత మాథుర్, అమన్, విశాల్ జకార్తా నుంచి ఢిల్లీకి తిరిగొచ్చారు. ఒప్పందం మేరకు ఆగస్టు 29న అమన్‌తో కలిసి మాథుర్ టెహ్రాన్ బయల్దేరాడు. అక్కడి నుంచి ఆస్ట్రేలియాకు పంపిస్తారేమోనని అతడు భావించాడు. అయితే, అనూహ్యంగా వీరిని ఓ గ్యాంగ్ కిడ్నాప్ చేసి చాబహార్ తీసుకెళ్లింది. మాథుర్‌ను అక్కడ పరిచయం చేసుకున్న ఏజెంట్ మిథు కూడా ఆ కిడ్నాప్ గ్యాంగ్‌లో ఓ భాగమని పోలీసులు తెలిపారు. 'మమ్మల్ని మెటల్ పైపులతో కొట్టారు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే చంపి అవయవాలు విక్రయిస్తామని బెదిరించారు' అని మాథుర్ వాపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. మాథుర్‌ను హింసిస్తున్న సమయంలో కిడ్నాపర్లు అతడి సోదరుడు డింపీకి కూడా వీడియో కాల్స్ చేశారు. రూ.కోటి డిమాండ్ చేసి చివరకు రూ.20 లక్షలు తీసుకొని బాధితుడిని విడుదల చేయడానికి అంగీకరించారు. ఆ మొత్తాన్ని జలంధర్‌లో మరో వ్యక్తికి బాధిత కుటుంబం అందజేసింది. దీంతో కిడ్నాప్ గ్యాంగ్ మాథుర్, అమన్‌లను చాబహార్ ఎయిర్‌పోర్టు దగ్గర వదిలిపెట్టింది. ఈ నెల ఏడో తేదీన వారు ఢిల్లీ చేరుకున్నారు. మాథుర్ కోలుకున్న తర్వాత వాంగ్మూలం తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

వంతారాకు ఏనుగుల తరలింపులో తప్పులేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఏనుగుల తరలింపు వ్యవహారంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ స్థాపించిన వంతారా సంస్థకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. నిబంధనలకు అనుగుణంగా వంతారాకు ఏనుగులను తరలిస్తే... ఏ తప్పు లేదని అత్యున్నత న్యాయస్థానం వెల్లడించింది. గుజరాత్‌లోని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి ఏనుగుల తరలింపును సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్య(పిల్)న్ని విచారిస్తూ... ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా వంతారాకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లు జస్టిస్ పంకజ్ మిథల్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వంతారాపై ప్రత్యేక దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికను పరిశీలించిన అనంతరం ఈవిషయంపై వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. వంతారాలో బందీలుగా ఉన్న ఏనుగులను వాటి యజమానులకు తిరిగి ఇవ్వడానికి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ సి.ఆర్. జయసుకిన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్ అస్పష్టమైనదిగా పేర్కొంటూ అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.

అమలుకాని హామీలకు పెట్టింది పేరు మోదీ

ప్రధానిపై తేజ్‌ప్రతాప్ విమర్శ

పట్నా: ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ కారణాలతోనే బీహార్‌కు వస్తారని ఆర్జేడీ బహిష్కృత నేత, ఆ పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ విమర్శించారు. ఇప్పుడు బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడ్డాయని, అందుకే ఇక్కడి ప్రజలపై ప్రధాని వరాల వర్షం కురిపిస్తున్నారని తేజ్‌ప్రతాప్ విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా ప్రధాని ఇదేరకంగా బీహార్‌కు వచ్చారని, షుగర్ మిల్లును ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారని తేజ్‌ప్రతాప్ గుర్తుచేశారు. కానీ ఇప్పటికీ ఇక్కడ షుగర్ మిల్లు ప్రారంభం కాలేదని ఎద్దేవా చేశారు. ఎప్పుడూ అబద్ధపు హామీలు ఇచ్చే ప్రధాని పర్యటన బీహార్ ప్రజలపై ఎలాంటి ప్రభావం చూపబోదని అన్నారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ విమానాశ్రయాలు, వంతెనలను ప్రారంభిస్తున్నారని, కానీ ఇక్కడ ఇప్పుడు ప్రధాన సమస్య వరద పరిస్థితి అని తేజ్‌ప్రతాప్ చెప్పారు. వరదల్లో జవానియా గ్రామం పూర్తిగా కొట్టుకుపోయిందని, అయినా ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలు చేపట్టలేదని విమర్శించారు. జవానియా ప్రజలు ఏడుస్తున్నారని, ప్రధాని అక్కడికి వెళ్లాలని కోరారు. రఘోపూర్‌లో కూడా పరిస్థితి అలాగే ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసు...

ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ మృతి కేసులో డ్రైవర్ అరెస్టు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బీఎండబ్ల్యూ కారు హిట్ అండ్ రన్ కేసులో సోమవారం ఆ కారు డ్రైవర్ గగన్‌ప్రీత్‌ను అరెస్టు చేశారు. ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ నవజ్యోత్ సింగ్, ఆయన భార్య సందీప్ కౌర్ బైక్‌పై వెళ్తుండగా ఆ వాహనాన్ని బీఎండబ్ల్యూ కారు ఢీకొంది. ఆ సమయంలో కారును గగనప్రీత్ డ్రైవ్ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్థికశాఖ ఆఫీసర్ నవజ్యోత్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఇదే ప్రమాదంలో గాయపడ్డ బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ హాస్పిటల్‌లో చికిత్స పొందింది. ఆమెను పోలీసులు అరెస్టు చేసి కస్టడీలోకి తీసుకున్నారు. హిట్ అండ్ రన్ ఘటనలో ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిర్లక్ష్యపూరిత డ్రైవింగ్ కింద సెక్షన్ 281, ప్రమాదభరిత ప్రవర్తన కింద 125 బీ , హత్యాయత్నం కింద 105 సెక్షన్, తప్పుడు సమాచారం ఇచ్చిన కేసులో 238 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డ్యామేజ్ చెందిన వాహనాన్ని ఎఫ్ఎస్ఎల్ బృందం తనిఖీ చేసింది. బీఎండబ్ల్యూ కారును ఓ మహిళ డ్రైవ్ చేసిందని, సెంట్రల్ వర్జ్‌ను ఢీకొన్న తర్వాత ఆ వాహనం కంట్రోల్ తప్పి, బైక్‌ను ఢీకొన్నదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆర్థికశాఖ ఎకనామిక్ అఫైర్స్‌లో డిప్యూటీ సెక్రటరీగా చేస్తున్న నవజ్యోత్ సింగ్.. హరినగర్‌లో నివాసం ఉంటున్నారు. బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్ వయసు 38 ఏళ్లు. ఆమె భర్త పరీక్షిత్ మక్కడ్ వయసు 40 ఏళ్లు. ఢిల్లీ కంటోన్మెంట్ మెట్రో స్టేషన్ వద్ద ప్రమాదం జరిగింది. బైక్‌ను ఢీకొన్న తర్వాత బాధితులు నవజ్యోత్, సందీప్ కౌర్‌లను ఓ వ్యాన్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లారు. జీటీబీ నగర్‌లో ఉన్న న్యూలైఫ్ ఆస్పత్రికి వాళ్లను తరలించారు. అయితే ఆ ఆస్పత్రి ఘటనా స్థలికి 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. కాగా ఆ ఆస్పత్రికి, బీఎండబ్ల్యూ డ్రైవర్ గగన్‌ప్రీత్‌కు నేరుగా సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. 19 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి.

బాను ముస్తాక్‌కు ఆహ్వానంపై పిటిషన్ల కొట్టివేత

బెంగళూరు: చరిత్రాత్మక మైసూరు దసరా ఉత్సవాలను ప్రారంభించడానికి బుకర్ ప్రైజ్ విజేత బాను ముస్తాక్‌ను ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కర్నాటక హైకోర్టు సోమవారం తోసిపుచ్చింది. మాజీ ఎంపీ ప్రతాప్ సింహాతో సహా నాలుగు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాలను విచారణకు స్వీకరించేందుకు ప్రధాన న్యాయమూర్తి విభు భక్రు, న్యాయమూర్తి సీఎం జోషితో కూడిన డివిజన్ బెంచ్ నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమానికి వేరే మతవిశ్వాసాలు కలిగిన వ్యక్తిని ఆహ్వానించడం చట్ట ఉల్లంఘనగా కానీ, రాజ్యాంగపరమైన హక్కులను ఉల్లంఘించడంగా కానీ తాము భావించడం లేదని డివిజన్ బెంచ్ స్పష్టం చేసింది. పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్టు ప్రకటించింది. బాను ముస్తాక్ కొద్ది నెల క్రితం హిందూ వ్యతిరేక, కన్నడ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పిటిషనర్లు వాదించారు. దసరా ప్రారంభోత్సవంలో చాముండేశ్వరి దేవత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలని, వేదాలను పఠించాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడానికి బాను ముస్తాక్ తగిన వారు కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు హాజరైన అడ్వకేట్ జనర్ కె.శశికిరణ్ షెట్టి తన వాదన వినిపిస్తూ, ఉత్సవాల ప్రారంభించే వ్యక్తిగా ఎవరిని ఆహ్వానించాలనే దానిపై ఏర్పాటు చేసిన కమిటీలో అన్ని పార్టీలకు చెందిన స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, తక్కిన భాగస్వాములంతా ఉన్నారని తెలిపారు. దసరా పండుగ రాష్ట్ర పండుగ అని, పిటిషన్లను కొట్టివేయాలని కోర్టును కోరారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకూ 11 రోజుల పాటు మైసూరులో దసరా ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు ఆహ్వానితులతో పాటు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, అధికారులు పాల్గొంటారు. చాముండేశ్వరిదేవికి పుష్పార్చన ద్వారా శ్రీకారం చుట్టే ఉత్సవాలలో ప్రతిరోజూ సాహిత్య, సాంస్కృతిక, నృత్య కళాప్రదర్శనలు ఉంటాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-హైదరాబాద్: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ప్రజావాణిలో అందచేసిన ఫిర్యాదులపై సత్వరమే అధికారులు స్పందించాలని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి తో కలసి అదనపు కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పెండింగ్లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలని సూచించారు. సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, సిపిఓ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటి, హౌసింగ్ పి.డి.అశోక్ చక్రవర్తి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు జి.ఆశన్న, కోటాజి, ప్రవీణ్, ఇలియాస్ అహ్మద్, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవణ్ కుమార్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరిలో : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి అదనపు కలెక్టరు (113) దరఖాస్తులు స్వీకరించారు.

ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అక్టోబర్ 12న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి శిశువుకు పోలియోచుక్కలు వేయించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అదికారి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్బంలో జిల్లా వైద్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ళ లోపు పిల్లలు 4 లక్షల తొంబై వేల మంది పిల్లలు ఉన్నట్లు సర్వేలో గుర్తించడం జరిగిందని అన్నారు. అక్టోబర్ 12 న ఆదివారం పోలియో భూత్ లలో పోలియో చుక్కలు వేస్తారని తప్పని సరిగా అందరూ ఆ రోజు భూత్‌లోకి వెళ్ళి చుక్కలు వేయించాలని సూచించారు. 13 నుండి 15 వరకు ఇంటింటికి వెళ్ళి ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. పాఠశాలల పిల్లలకు, ఇతర 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి ఈ మహమ్మారి దరిదాపులోకి రాకుండా చూడాలని అధికారులను కోరారు.

అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శోభారాణి, అల్వాల్ ప్రాజెక్ట్ సహాయకార్యదర్శి శిరీష మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని, ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించాలని విద్యాబోధన బాధ్యత అంగన్వాడీ ఉద్యోగులకు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, ఒకే ఆన్లైన్ యాప్ ఉండాలని, 5జి మొబైల్ ఫోన్లు ఇవ్వాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా రూ.18 వేల వేతనం పిఎఫ్ అమలు చేయాలని, ఐసిడిఎస్ మంత్రి హామీ ప్రకారం 24 రోజుల సమ్మె వేతనాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో 8ని సవరించాలని, పెంచిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని, మూడు నెలల పిఆర్సి, మినీ టీచర్స్‌కు 11 నెలల ఏరియర్స్, రిటైర్మెంట్ అయిన వాళ్లకు 18 నెలల సి.బి.ఈ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌తోపాటు విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడం కోసం నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చింది. ఇంతటి ప్రమాదకరమైన విధానాలను వ్యతిరేకంగా నిలబడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనికి భిన్నంగా ఐసిడిఎస్‌ను మొత్తం నిర్వీర్యం చేస్తున్నదన్నారు. నాలుగైదు యాప్స్ తో అంగన్వాడి ఆన్లైన్ వర్క్ విపరీతమైన తల భారంగా మారిందని, దానిని మొత్తం ఒకే యాప్‌లో పొందుపరచాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నామని, లేనియెడల అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

డా.తులసి వెంకట రమణాచార్యులను సన్మానం



విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్ బాగ్ ప్రాంతానికి చెందిన కవి, రచయిత తులసి వెంకట రమణా చార్యులు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఓరియంటల్ విభాగంలో మసన చెన్నప్ప రచనలు పరిశీలన అనే అంశంపై డా.చంద్రశేఖర్ రావు పర్యవేక్షణలో పీ.హెచ్.డి పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా అక్షర కౌముది సంస్థ పక్షాన డా.తులసి వెంకట రమణా చార్యుల దంపతులను ఈస్ట్ ఆనంద్ బాగ్ లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు తులసి విజయ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి మూర్తి శ్రీదేవి, కోశాధికారి బచ్చల మాధవి, కార్యవర్గ సభ్యులు కంద్లకుంట నరసింహాచార్యులు, గుటూరు సత్యనారాయణ, మహాలక్ష్మీ, రామచంద్రుడు, కవి మిత్రులు సుధామత్రేయ, రఘునాథ రెడ్డి, తాళ్లూరి వెంకట కృష్ణ, సుజాత ముదిగొండ, సంతోష్ కుమార్ శర్మ, సూరినేని రమేష్ అభినందనలు తెలిపారు.

ఒప్పో ఇండియా ఎఫ్31 5జీ సిరీస్ విడుదల

హైదరాబాద్: ఒప్పో ఇండియా తన ప్రసిద్ధ ఎఫ్ లైనప్‌లో తాజాది అయిన ఎఫ్31 5జీ సిరీస్‌ను విడుదల చేసింది. ఇది భారతదేశ మన్నిక, సున్నితమైన పనితీరు కోసం అవసరాన్ని తీర్చడానికి రూపొందింది. కొత్త సిరీస్ మూడు మోడల్స్‌ను అందిస్తుంది. ఎఫ్31 ప్రో ప్లస్, ఎఫ్31 ప్రో, ఎఫ్31, ఇవి బలమైన నిర్మాణాలు, దీర్ఘకాలిక బ్యాటరీలు, మెరుగైన వేడి నిర్వహణ, అధునాతన కనెక్టివిటీతో రూపొందాయి. ఈ అప్‌గ్రేడ్‌లతో, ఎఫ్31 5జీ సిరీస్ భారతదేశంలో రూ.35,000 లోపు అత్యంత సున్నితమైన, అత్యంత మన్నికైన స్మార్ట్‌ఫోన్ శ్రేణిగా నిలిచింది. స్నాప్‌డ్రాగన్, డైమెన్సిటీ ప్రాసెసర్లు, ఆరు సంవత్సరాల ప్రవాహ ధృవీకరణ, అలాగే జియో, టీయూవీ ధృవీకరించిన అనుసంధానంతో, ఎఫ్31 సిరీస్ భారతదేశ మధ్యస్థ శ్రేణి విభాగంలో మన్నికకు కొత్త ప్రమాణాన్ని నిర్ధారిస్తుంది. ఈ పరికరం గరిష్టంగా 24జీబీ ర్యామ్ (12జీబీ ఫిజికల్ ం 12జీబీ వర్చువల్), యూఎఫ్ఎస్ 3.1నిల్వకు మద్దతు ఇస్తుంది. ఎఫ్31 ప్రో ప్లస్, టీఎస్ఎంసీ 4ఎన్ఎం ప్రాసెస్‌పై నిర్మితమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 3 ద్వారా శక్తిని పొందుతుంది.

అంకితభావంతో నగర ప్రజలకు సేవలందించాలి

జీహెచ్ఎంసీలో 32 మందికి కారుణ్య నియామకపత్రాలు అందజేత కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజలకు ఉత్తమ సేవలను అందించడం ద్వారా జీహెచ్ఎంసీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కష్టపడి బాగా పనిచేయాలని నూతనగా ఉద్యోగాలకు సూచించారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ.. మృతి చెందిన ఉద్యోగుల వారసులు 32 మందికి కారుణ్య నియామకాల క్రింద జీహెచ్ఎంసీ ఉద్యోగాలు కల్పించింది. వీరికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నియామక పత్రాలను అందించారు. 32 మందిలో 10 మంది జూనియర్ అసిస్టెంట్‌లు గా, 17 మంది ఆఫీస్ సబార్డినెట్ లుగా, 5 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్ లుగా వివిధ విభాగాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... మీకు మంచి భవిష్యత్తు ఉంది. సానుకూల దృక్పథంతో, ఫిర్యాదులు లేకుండా ఉత్తమ పనితీరు కనబరచాన్నారు. విధి నిర్వహణలో సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆసుపత్రి కార్మికులను వేధిస్తున్న వారిని సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని పారిశుధ్య,సెక్యూరిటీ, పేషంట్ కేర్, కాంట్రాక్ట్ కార్మికులను సిబ్బందిని మానసిక శారీరక వేధింపులకు గురిచేస్తున్న శానిటరీ అధికారులైన సిహెచ్ఓ రాం నాయక్, ఎస్‌హెచ్ఓ నరేందర్ లను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కార్మికులు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతృత్వంలో సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహా రెడ్డికి ఫిర్యాదు చేశారు. ముందుగా మహబూబ్ నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరకి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్నది నూటికి 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ అట్టడుగు సామాజిక వర్గాల పేదలేనని ఇలాంటి వారిపై కనికరం లేకుండా సిహెచ్ఓ రామ్ నాయక్, ఎస్ హెచ్ ఓ నరేందర్‌లు కార్మికుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ తీవ్రమైన వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కార్మికుల బాధలపై మాట్లాడేందుకు వెళ్లిన యూనియన్ నాయకత్వంపై కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించడమే కాకుండా దాడికి పాల్పడి మళ్లీ వారే అక్రమ కేసులలో ఇరికించేందుకు తప్పుడు ఫిర్యాదులు చేశారని మండిపడ్డారు. ఒక పక్క కార్మికులు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన పనిభారం మరో వైపు జీవో 60 ప్రకారం ప్రభుత్వ వేతనాల అందక ఆర్థికంగా దోపిడికి గురవుతూ నలిగిపోతున్న కార్మికులకు అండగా నిలవాల్సిన సమయంలో కార్మికులతో సంబంధంలేని పనులు చేయించడమే కాకుండా కార్మికులు పనిచేయడం లేదనే విధంగా అధికారులకు సిహెచ్ ఓ రామ్ నాయక్ నరేందర్ లు రిపోర్ట్ చేస్తూ కార్మికులను అభాసుపాలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే సిహెచ్ఓ రామ్ నాయక్ ఎస్ హెచ్ ఓ నరేందర్ లను సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రి బ్రాంచ్ నేతలు కార్మికులు బి.చెన్నయ్య మొగులయ్య,రంగన్న, అంజి, శ్రీను, యాదగిరి, భీమయ్య, జగ్గ నాయక్, యాదయ్య, లోకేష్, మన్యం, నరేష్, రాఘవేందర్, పద్మ, సత్యమ్మ,ఇందిరా, సవిత, అంజమ్మ, శిరీష, వెంకటమ్మ, రాధ, వరలక్ష్మి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.అల్వాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో అందాల పోటీలకు నిధులు ఇచ్చి విద్యార్థుల ఫీజు బకాయిల విడుదలకు నిధులు ఎందుకు ఇవ్వరని! సంక్షేమ పథకాల అమలు కోసం వేలకోట్ల అప్పులు చేస్తారు. కానీ విద్యార్థుల చదువుల బకాయిల విడుదల కోసం ఎందుకు చేయరు అని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థులు చదువులకు దూరమైన ప్రభుత్వంలో చలనం లేకపోవడం సిగ్గు చేటని, విద్యార్థులకు ఓట్లు లేకపోయినా విద్యార్థుల తల్లిదండ్రులకు ఓట్లు ఉన్నాయనే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకొని వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రిని, మంత్రులను తిరగనివ్వమని విద్యార్థులతో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమని, గత మూడు విద్యాసంవత్సరాల నుండి ఫీజు బకాయిలు 8వేల కోట్లు పూర్తిగా పెండింగ్ లో ఉన్నాయని, ఫీజు బకాయిలు విడుదల లేక విద్యార్థులతో పాటు బడ్జెట్ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వం పై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని మణికంఠ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, సామిడి వంశీవర్ధన్ రెడ్డి, నాయకులు అరుణ్, ఉదయ్, అనిల్, హరీష్, వెంకటేష్, రూప్ సాయి,ప్రకాష్,శివ, విరాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రెస్‌అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా కాచిగూడలో భారత కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా దొరలు పటేల్, పట్వారిలు భూస్వామ్యాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని జరుగుతున్న పోరాటాన్ని ప్రతిబింబిస్తూ షోయబుల్లాఖాన్ తాజ్వీ పత్రికలో వ్యాసాలు ప్రచురించడం జరిగింది. ఈ పత్రికపై నిజాం సర్కార్ కత్తిగట్టి నిషేధం పెట్టింది. అయినా కూడా ఆయన రయ్యత్ పత్రికలో ముస్లిం మేధావులను సమీకరించి వారి అభిప్రాయాలను ముద్రించటం జరిగింది. ఈ పత్రికపై కూడా నిషేధం కొనసాగింది. చివరికి ఇమ్రోజ్ పత్రికకు ఎడిటర్‌గా ఉంటూ సర్కార్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పౌర ప్రజాస్వామిక హక్కులు లేకుండా పత్వాలు జారీ చేస్తున్న పాలనపై తన రచనల ద్వారా కలానికి పదును పెట్టి ప్రజలను చైతన్యం చేయడం జరిగింది. ఇది నచ్చని నిజాం సర్కార్ షోయబుల్లాఖాన్ ను బెదిరింపులకు గురి చేయడమే కాకుండా హత్య చేస్తామని చెప్పడం జరిగింది. బెదరకుండా, నిండు గర్భవతిగా ఉన్న తన భార్య గురించి ఏమాత్రం ఆలోచన చేయకుండా అత్యంత ధైర్యంగా నిజాంపై వార్తలు ప్రచురించారు. పత్రిక పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న షోయబుల్లాఖాన్ ను రజాకార్లు అత్యంత దారుణంగా కాచిగూడలో తన రెండు చేతులను నరికి దారుణంగా హత్య చేయడం జరిగింది. ఇట్లాంటి త్యాగాల చరిత్ర కలిగిన షోయబుల్లాఖాన్ పేరును తెలంగాణకి ప్రెస్ అకాడమీకి పెట్టి సముచితంగా గౌరవించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపల్లి శ్రీనివాస్, మహమ్మద్ సలీం, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, సి.హెచ్.జంగయ్య, కళ్యాణ్, అనిల్, ధరంపురి, గణేష్, ఐలయ్య, ఫహీం, సుశాంత్, అరుణ్, భాను, అరవింద్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలపై పని భారం తగ్గించాలి

విశాలాంధ్ర-హైదరాబాద్ : వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎం (ఎంపిహెచ్ఏ(ఎఫ్))లు తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటునారని మొబైల్ అప్లికేషన్స్‌ను రద్దు చేసి పని ఒత్తిడిని తగ్గించాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పని ఒత్తిడి తగ్గించాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాను నిర్వహించారు. ఈధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగిస్తూ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి, ఆరోగ్యం మెరుగు పడటానికి కావలసిన ముందస్తు జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించడానికి, చిన్నపిల్లలకు టీకాలు వేయడానికి మమ్ములను ఏఎన్ఎంలుగా ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. 2016వ సంవత్సరంలో ఆన్లైన్ విధానాన్ని ప్రవేశపెట్టారని, ఒకటి రెండు యాపులతో ప్రారంభమైన ఆన్లైన్ పనులు ప్రస్తుతం దాదాపు 14 మొబైల్ అప్లికేషన్స్‌లను పూర్తి చేయాల్సి వస్తుందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఆఫ్లైన్ మరొకవైపు ఆన్లైన్ వర్కులు చేస్తూ వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్యల పరిష్కరించాలని ఏఎన్ఎంలు ఆందోళన అనంతరం సమస్యలను వివరించడానికి తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ దగ్గరకు వెళ్ళినప్పుడు కమిషనర్ సమస్యలను వినకుండా తాను ఏమి చెప్పదలుచుకున్నారు అది చెప్పి వెళ్లిపోవడం హర్షించదగ్గ విషయం కాదన్నా. సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వారిని ఆ సమస్యల నుండి బయటకు తీసుకురావాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని కనీసం సమస్యను వినటానికి కూడా ఇష్టపడకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఏఎన్ఎంల సమస్యల పరిష్కరించడానికి భవిష్యత్తులో పోరాట రూపకల్పన చేయనున్నట్లు తెలియజేశారు. రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జే.పద్మ, బి శ్యామల, కార్యదర్శులు తన్వీర్ సుల్తానా, పి.జయమ్మ, కృష్ణవేణి, రాణి, ఉపాధ్యక్షురాళ్ళు గోపమ్మ, సారిక, టి.జయమ్మ, పార్వతి, సంతోషిని, లతా, గీత, సరిత, సరోజిని, సంధ్యారాణి, యాదలక్ష్మి, ఫస్ట్ ఏఎన్ఎం యూనియన్ నాయకులు సరిత, సరస్వతి, ముంతాజ్ పాల్గొన్నారు.

నీటి వనరుల పరిరక్షణకు డీప్ టెక్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 58వ ఇంజినీర్స్ డే సందర్భంగా, భారత్‌లోని అందరు ఇంజినీర్లకు నమస్కారాలు. ఈ దేశానికి పునాదులు వేసినవారు, ప్రస్తుతం కష్టపడుతున్న వారు, భవిష్యత్తుకు మార్గదర్శనం చేయబోయే వారందరికీ రామ్‌కి ఇన్ ఫ్రా ఎండి.వై.ఆర్.నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఇంజినీర్లు, రహదారుల నుంచి స్మార్ట్ వాటర్ గ్రిడ్ల వరకు అన్నింటికీ వెన్నెముకగా నిలిచారన్నారు. మీ కృషి వల్లే మనం మౌలిక సదుపాయాలను మాత్రమే కాకుండా, పర్యావరణాన్ని కాపాడే, జీవితాలను మెరుగుపరిచే భవిష్యత్తును నిర్మిస్తున్నాం. బలమైన ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యకరమైన పర్యావరణం కోసం మీరు చేస్తున్న కృషికి ధన్యవాదాలు అన్నారు. ఈ సంవత్సరం థీమ్ "డీప్ టెక్, ఇంజినీరింగ్ ఎక్సలెన్స్: డ్రైవింగ్ ఇండియాస్ టెకేడ్". దేశంలో ప్రతిరోజూ 72,368 మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతోందన్నారు. కానీ దానిని శుద్ధిచేసే సామర్థ్యం కేవలం 31,841 ఎమ్మెల్డి మాత్రమే అని అందులో కూడా పనిచేసే సామర్థ్యం ఇంకా తక్కువగా ఉంది. సుమారు 28శాతం మురుగునీరు మాత్రమే శుద్ధి అవుతోందన్నారు. మిగతా 72శాతం శుద్ధి కాకుండానే మన నీటి వనరులను కలుషితం చేస్తోందన్నారు. మనం తయారు చేసే ప్రతి లీటర్ మురుగునీటిని శుద్ధి చేసి మళ్లీ వాడాలని పిలుపునిచ్చారు. ప్రతి నీటి వ్యవస్థలో వృథా తగ్గించి, సామర్థ్యం పెంచాలన్నారు. ఇలా మనం అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే, దేశం నిజంగా అభివృద్ధి చెంది, సుస్థిరంగా మారుతుందన్నారు.

నాలా పూడికతీత, పరిశుభ్రతపై దృష్టి సారించాలి: కమిషనర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : మల్లేపల్లి నాలాలో పూడికతీత, పరిశుభ్రత పనులను చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మెహదీపట్నం సర్కిల్ పరిధిలోని మల్లేపల్లి నాలాను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. తద్వారా భారీవర్షాల సమయంలో నాలా సమీప ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. అవసరమైన చోట నాళాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించేలా చూడాలని కమిషనర్ సూచించారు. వర్షపునీరు నిల్వ కాకుండా, నాలాలో స్వేచ్ఛగా ప్రవహించేలా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు.

ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటం ఒక సంవత్సరం పాటు వీరోచితంగా సాగింది ఈ పోరాటంలో 4500 మంది అమరులైనారు నాగర్ కర్నూల్ జిల్లా నుండి కూడా ఈ పోరాటంలో అసువులు భాసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి నుండి సిఆర్ శర్మ, కటికనేని గోపాల్‌రావు, పెద్ద లింగారెడ్డి, చిన్న లింగారెడ్డి తప్పెట బుగ్గయ్య, పేరుమల బాలయ్య, పేరుమల మాసయ్య ఇలా అనేకమంది ఈ పోరాటంలో మరణించారు. చాలామంది జైల్లో శిక్షలు అనుభవించారనీ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహం, సిపిఐ నాగర్కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ హాజరై వారు ఇరువురు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారికి ఇస్తున్నారని ఆరోపించారు. పెద్దకొత్తపల్లి సిపిఐ ఆఫీస్ నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు ర్యాలీగా వచ్చి ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఎంపీడీవోకి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యవర్గ సభ్యులు టి నరసింహ, పెబ్బేటి విజయుడు, కోళ్ల యేసయ్య, పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాస్, కోడేరు మండల కార్యదర్శి తప్పెట కిరణ్ కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు విద్యా శ్రీనివాసులు, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు తన్నీరు మల్లయ్య, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, బండి కృష్ణయ్య, సాయిలు, లక్ష్మణస్వామి, పర్వతాలు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కార్పోరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని ఉప్పరగూడ, రాజా నగర్ కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జలమయమైన ప్రాంతాల్లో కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. 600 ఎంఎం డయా పైప్‌లైన్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్నరోడ్డు పనులు పిట్టల బస్తీలో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులు పూర్తి చేయాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడం జరిగింది. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ. లౌక్య, ఏ.ఈ.ఈ సత్యలక్ష్మి, వర్క్ఇన్స్పెక్టర్ రజనీకాంత్, ఉమేష్ సింగ్, కిషోర్, ఎం.డి మాజీద్, కాలనీవాసులు నరసింగరావు, శ్రీధర్‌రెడ్డి, బుచ్చి రాములు, గోపీనాథ్, గోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వ ఆలసత్వం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో 13 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఒక్క పైసా కూడా లేదని డిప్యూటీ సిఎం చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనా నికి నిదర్శనమన్నారు. విద్యార్థుల ఫీజుల కోసం లేని డబ్బులు, కమీషన్లు, కాంట్రాక్టులకు మాత్రం ఎక్కడి నుంచి వస్తున్నాయో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్ లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ స్థాయి బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించామన్నారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు గత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన మూడు వేల కోట్ల రూపాయలను కూడా చెల్లించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డబ్బులు లేవన్న సాకుతో పెండింగ్ బకాయిలను ఇవ్వడం లేదని విమర్శించారు. కాలేజీల బంద్‌ను ఆపి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న యూరియా కొరత, సంక్షోభానికి కాంగ్రెస్ పార్టీనే ప్రధాన కారణమన్నారు కేటీఆర్. రైతుల కోసం కేటాయించిన యూరియాను కాంగ్రెస్ నాయకులే బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో పట్టపగలే దోపిడీలు, అత్యాచారాలు జరుగుతున్నాయని, క్రైమ్ రేట్ విపరీతంగా పెరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణలోని ప్రతీ ఒక్కరు కోరుకుంటున్నారన్న కేటీఆర్, గులాబీ జైత్రయాత్ర జూబ్లీహిల్స్ ఉపఎన్నికతోనే మొదలవ్వాలన్నారు. తెలంగాణ దివాలా తీసింది, ఎయిడ్స్ పేషెంట్, క్యాన్సర్ పేషెంట్ అంటూ రేవంత్ రెడ్డి రాష్ట్రం పరువు తీస్తున్నాడని కేటీఆర్ విమర్శించారు.

స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్
Regd. No. CR-21

మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీస్ చట్టం, 2002 (ఇప్పటివరకు సవరించబడింది) నిబంధనల ప్రకారం, "స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్" హైదరాబాద్ జనరల్ బాడీ సమావేశం తేదీ 29 సెప్టెంబర్ 2025 న (సోమవారం) 6.00 p.m.కి SBIOA భవన్ D.నం. 3-5-1093/4, వెంకటేశ్వర కాలనీ, నారాయణగూడ, సెంట్రల్ బ్లడ్ బ్యాంక్ లేన్ ఎదురుగా, హైదరాబాద్-500029 లో జరుగుతుందని ఇందుమూలంగా తెలియజేయబడుతోంది.

తేదీ 12.09.2025, హైదరాబాద్ సం/- కార్యదర్శి

ఘనంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుక

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఐ) ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిసిఈ(ఐ) సౌత్ వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ కాచర్ల, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏసిసిఈ (ఐ) జిసి మెంబర్ కాశీరామ్ ఆడెపు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ రంగంలో విశేష సేవలందించిన ఇంజనీర్లను సన్మానించారు. కన్సల్టెంట్ రంగంలో సేవలందిస్తున్న ఇంజనీర్లు ఎస్.రాజగోపాలరెడ్డి, వి.వి కృష్ణారెడ్డి, ఇండస్ట్రియల్‌లో ఇంజనీర్ బి.శీనయ్య, అకాడమి విభాగంలో పి.శ్రీనివాసరావు, ప్రొఫెసర్ నీలిమ సత్యం, విద్యార్థి డి.చంద్రకాంత్‌లను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ సెంటర్ చైర్మన్ ఎస్.మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ భీమ్ రావ్ జలిగమ, సెక్రటరీ రమేశ్ చీకలపర్వి, ట్రెసరర్ వి.సిహెచ్ నర్మద, కో అప్షన్ మెంబర్ అక్కల సుధాకర్, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ అందించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వికలాంగులకు, పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీ ప్రకారం పెన్షన్ అందించాలని లేదా పదవుల నుంచి దిగిపోవాలని వీహెచ్.పి.ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్, విహెచ్.పి.ఎస్ అధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పిలుపులో భాగంగా తహసిల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు వినయ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి జాతీయ నాయకులు జిల్లా ఇన్చార్జ్ లక్ష్మణ్ మాదిగ, ఎం.ఎ.పి జిల్లా అధ్యక్షులు రామచందర్ మాదిగ, ఎం.జె.ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్కాజిగిరి తహసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సంఘ నాయకులు, పెన్షన్ దారులు మహిళతో కలిసి పెన్షన్ పెంచాలని నినాదాలు చేశారు. తర్వాత తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు పెన్షన్ దారులకు రూ.2 వేల నుండి రూ.4వేలు పెన్షన్ను అందిస్తామని, వికలాంగులకు రూ.4 వేల నుండి రూ.6 వేలు పెన్షన్ అందిస్తావని చెప్పి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచిపోతున్నా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ఇవ్వకపోవడం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రానున్న దసరా పండుగకు ప్రభుత్వం వీరికి శుభవార్తగా పెన్షన్ పెంచి అందిస్తుందని కోరుకుంటున్నామన్నారు. లేనిపక్షంలో రానున్న రోజులలో ఉద్యమాన్ని తీవ్రతరం చేసి మందకృష్ణ మాదిగ ఉద్యమ మార్గంలో ప్రభుత్వాన్ని కూల్చుదానికి కూడా వెనకాడ మని అది ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మార్ పిఎస్, విహెచ్.పిఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ అధ్వర్యంలో సోమవారం బండ్లగూడ రఘు రామనగర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి కంటి అద్దలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుదిన జీవితంలో మానవుడు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చాలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చును. మన ఆరోగ్యం మన చేతులలోనే ఉంటుంది. వీలైనంత నడక కొద్దిపాటి వ్యాయామం మన శరీరానికి ఎంతో మేలు చేకూరుస్తాయి అని అంతర్జాతీయ వెంట్రిలాక్విస్ట్ మాజీషియన్ సామ్ గుంటి తెలిపారు. ప్రజలను చైతన్యవంతులను చేయడమే కాకుండా, ఖరీదైన వైద్య సేవలను ఉచితముగా అందించడం అభినందనీయం అని ఆయన చైతన్య సంస్థ సేవలను కొనియాడారు. గతంలో కూడా చైతన్య రూరల్ డెవలప్మెంట్ సోషల్ సర్వీస్ సొసైటీ పలు సేవా కార్యక్రమాలకు తాను ముఖ్య అతిథిగా హాజరయ్యానని, ఐతే ఈ క్యాంప్లో అత్యాధునిక వైద్య పరికరాలతో వారు కంటి పరీక్షలను నిర్వహించారని ఆయన తెలియజేశారు.

తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: తెలంగాణ రైతన్న సాయుధ పోరాట వారోత్సవాల సభ సీపీఐ శేరిలింగంపల్లి కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా రంగారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొని మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా హ్యాదల్ ప్రభువుల అణిచివేత దోపిడీలకు వ్యతిరేకంగా జరిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మాతృభాష కోసం భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు ధిక్కారస్వరమన్నారు. భాంచంద్ దొర కాల్మొక్త. అన్న వెట్టి మనిషి.. దొర ఏందీ రో. నీ.దొరత నం.ఏందిరో అంటూ.. బంధువులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది. తెలంగాణ సాయుధ పోరాటల వారోత్సవాల. స్ఫూర్తితో శేరిలింగంపల్లిలో ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని అన్నారు. రక్తపు నాగేష్ గౌడ్ ఏడవ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు పానగంటి పర్వతాలు, కే చందు యాదవ్, కే సుధాకర్, ఎస్ కొండలయ్య, ఎస్ నారాయణ, టి వరలక్ష్మి, ఎస్ సురేష్, ఎస్ నరసమ్మ, చంద్రమ్మ, కృష్ణ బంగారి రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఎస్‌విఆర్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర- కొత్తూరు: ఈనెల 13,14 తేదీల్లో తెలంగాణ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలోని లిటిల్ ఏంజిల్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో మున్సిపల్ పరిధిలో గల ఎస్‌విఆర్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్‌జోన్ త్రోబాల్ 2025 పోటీలో రాష్ట్రస్థాయి రెండో స్థానాన్ని సాధించారు. క్రీడల పట్ల ఆసక్తి, పట్టుదలతో ముందుకు సాగిన ఈ బృందం రాష్ట్రస్థాయిలో విజయం సాధించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. సౌత్ జోన్ త్రో బాల్ పోటీలో గెలుపొందిన విద్యార్థులు ప్రణ్య, దీక్షా, సంజని, లక్ష్మీదేవి, అశ్విన్ తేజ, రాము, రూపేష్, హర్ష, దీక్షా ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ స్కూల్ డైరెక్టర్ వీరమోని దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం ఎంతో సంతోశకరమన్నారు. తమ విజయానికి డైరెక్టర్ దేవేందర్, ప్రిన్సిపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆనంది, స్పోర్ట్స్ ఇన్‌చార్జీలు సుమన, రాహుల్, భాగ్యలు అందించిన మార్గదర్శకత, ప్రోత్సాహమే కారణమని విద్యార్థులు కొనియాడారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పాఠశాల నిర్వాహకులు తల్లిదండ్రులు, అభినందించారు.

మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలి

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహిళలపై జరిగే హింసాత్మక చర్యలను, వేధింపులను నివారించడానికి తమ వంతు సహకారం అందించాలని, మహిళలకు అండగా నిలవాలని సంబంధిత అధికారులను జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మంజుదార్ ఆదేశించారు. సోమవారం సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డా.అర్చన మంజుదార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'జన సునవాయి' పేరుతో సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో బాధిత మహిళలు అందించిన పలు ఫిర్యాదులను ఆమె పరిశీలించి, వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చనా మజుందార్ పేర్కొన్నారు. వారు అందించే వినతులు, పోలీసు కేసుల విషయంలో చొరవ చూపాలని, పరిపాలనాపరమైన, న్యాయపరమైన సేవలను స్నేహపూర్వక వాతావరణంలో అందించాలని సూచించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో భరణం వచ్చేలా, స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు సూచించారు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మహిళలు 56 వినతులను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన కేసులను పెండింగ్లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యులు ఆదేశించారు. పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని 56 పెండింగ్ కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. గృహహింస కేసులకు సంబంధించి పోలీసులు నిర్లక్ష్యం వహించద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ళ శారద, డిఎస్పిలు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే నా లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: లిమ్స్ హాస్పిటల్ అంబులెన్స్ సేవలు, ప్రస్తుతం ఇదే నా ముందున్న లక్ష్యం అందుకే అసెంబ్లీలో ప్రజల ఆరోగ్య రక్షణ లక్ష్యంగా ఉమ్మడి మండలానికి ఒకటి చొప్పున అదనంగా నాలుగు అంబులెన్స్ సేవలను ఏర్పాటు చేయనున్నట్లు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే శంకర్ బావమరిది డాక్టర్ రామ్ రాజ్ వారి సహకారం అన్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎంతో ఔదార్యంతో శంషాబాద్ లిమ్స్ ప్రైవేట్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ అంబులెన్స్‌లను కేశంపేట, ఫరూక్ నగర్ మండలాలతో పాటు, ఉమ్మడి మండలాలైన కొందుర్గుకు చౌదరి గూడలకు కలిపి ఒకటి, కొత్తూరు, నందిగామ మండలాలకు కలిపి మరొకటి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వీటిలో డ్రైవర్ సదుపాయం, నర్సు సదుపాయంతో పాటు, ఆక్సిజన్, వెంటిలేటర్ వంటివి ఇతర అత్యవసర వైద్య సదుపాయాల ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన ఖర్చు మొత్తం తామే భరించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అంబులెన్స్ ల కోసం గ్రామీణ ప్రజలు గంటల తరబడి వేచి ఉండి ప్రాణం మీదికి తెచ్చుకుంటున్న నేపథ్యంలో ఆ నష్టాన్ని నివారించేందుకే ఒక్కో అంబులెన్స్ కు 10 నుంచి 15 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యారంగానికి, వైద్య రంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని, తాను కూడా అదే రీతిలో తన నియోజకవర్గంలో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయం ద్వారా కూడా ఆపరేటింగ్ విధానం పెడతామని, ఇక్కడ ఇబ్బందులు ఉన్నా వెంటనే అంబులెన్స్‌ను అలర్ట్ చేస్తామని అన్నారు. త్వరలో కమ్యూనిటీ ఆసుపత్రి కూడా 100 పడకలతో అందుబాటులోకి వస్తుందని అన్నారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి నిత్యం 1300 పైగా రోగులు వస్తుంటారని, కొందుర్గు, కేశంపేట, చౌదరిగుడా, నందిగామ, చింపోడు, బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి 2000 నుంచి 2500 మంది రోగులు వస్తుంటారని వెల్లడించారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నారని, ఆసుపత్రి తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రఘునాయక్, బాలరాజు గౌడ్, అగనూరు బస్వం, ముబారక్, రవికుమార్, ఆసుపత్రి కార్యనిర్వహణాధికారి విష్ణువర్ధన్,జె. శ్రీనివాసులు, అశోక్, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయ గమనాన్ని మార్చిన తెలంగాణ సాయుధ పోరాటం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరించుకుంటూ సిపిఐ జిల్లా కార్యాలయం సంగారెడ్డిలో జిల్లా కార్యవర్గ సభ్యులు యం. డి మహబూబ్ ఖాన్ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఈటీ నరసింహ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజలు తిరుగుబాటు చేశారు. గ్రామాలలో దొరలు, దేశ్ముఖ్, పట్వారి, పటేల్‌ల ఆదిపత్యం కొనసాగింది. ప్రశ్నించిన ప్రజలపై అణచివేత కొనసాగించటం జరిగింది.ఈ భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు కాపాడడం కోసమే రజాకార్లనే సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన కొనసాగుతున్న పోరాటాలకు భయపడిన దొరలు నగరాలకు పరిగెత్తారు. కమ్యూనిస్టు పార్టీకి అధికారం దక్కుతదని భావించిన భూస్వామ్య వర్గాల ప్రతినిధులుగా ఉన్న సర్దార్ పటేల్ హోం మంత్రి నాయకత్వంలో నిజాం రాజుతో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఫలితంగా నిజాంకు గవర్నర్ పదవితో పాటు కోట్లాది రూపాయల రాజభరణాలు చెల్లించారు. ప్రజలను హింసించి అరాచకాలు సృష్టించిన రజాకార్ల సైన్య అధ్యక్షుడు ఖాసిం రజ్వీకి సరైన అనే శిక్ష విధించకుండా పాకిస్తాన్ పంపిన చరిత్ర ఆనాటి పాలకులది. ఇట్లాంటి చరిత్రను బిజెపి తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఆనాటి భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం గురించి, రజాకార్ సైన్యానికి ఉపాధ్యక్షుడుగా ఉన్న విస్నూరు రామచంద్రారెడ్డి దొర గురించి మాట్లాడకుండా కేవలం నిజాం ముస్లిం కాబట్టి ఇది ముస్లింల పైన హిందువులు సాధించిన విజయంగా చెప్పుకుంటూ చరిత్రను వక్రీకరిస్తున్నది. ఈ తరంలో ఉన్న యువత బిజెపి తప్పుడు ప్రచారాల ను తిప్పికొడుతూ వాస్తవ చరిత్రను ప్రజలకు వివరిస్తూ పాలకవర్గాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలకు బాటలు వేయాలని పిలుపునివ్వడం జరిగింది. జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచనం దినోత్సవం పేరుతో బిజెపి సంబరాలు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దినోత్సవం పేరుతో సెప్టెంబర్ 17న ప్రభుత్వం అధికారికంగా సాయుధ పోరాట వీరుడు ఉన్న స్మరించుకుంటూ కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఏ రెహమాన్, నాయకులు ఆనంద్, బాల్ రెడ్డి, ఆర్. లక్ష్మి, రూబీనా బేగం, రత్నాకర్ రెడ్డి, శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసాచారిని వరించిన విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కారం

విశాలాంధ్ర - తుర్కయంజల్ : సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ, ఎల్బీనగర్ నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం వైస్ ప్రెసిడెంట్ దార్ల శ్రీనివాసాచారిని విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కారం వరించింది. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లి గ్రామంలో జన్మించిన ఆయన రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ కు వచ్చి ఇక్కడే స్థిర పడ్డారు. రెండు దశాబ్దాల కాలంగా జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ సమాజంలో నెలకొన్న సమస్యలపై పలు వార్తా కథనాలు రాసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు. ప్రస్తుతం ఆయన ఎల్బీనగర్ నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్,సంయుక్త ఆధ్వర్యంలో పోలోజు రాజ్ కుమార్ నిర్వహణలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కేంద్రంలోని శ్రీ రాజ్యలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం మహోత్సవం-2025 పురస్కరించుకొని జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వ కళా విరాట్ బ్రహ్మశ్రీ వంగల శాంతి కృష్ణ ఆచార్య, చింతగట్టు దేవస్థాన పీఠాధిపతులు వీరధర్మరాజు స్వామి, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ చేయడం లింగమూర్తి, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు కొలే జగన్నాథం, పొడి శెట్టి విష్ణువర్ధన్ ఆచార్యులు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు నిర్వాహకుల చేతుల మీదుగా దార్ల. శ్రీనివాసాచారి విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కారంతో పాటుగా మెమొంటో, ప్రశంసాపత్రం, మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అయోధ్య రామాలయంలో బాల రామునికి పాదుకలు రూపొందించిన హైదరాబాద్ బోయిన్‌పల్లికి చెందిన జాతీయ శిల్పి పిట్టంపల్లి రామలింగచార్యులు, చిలుమోజు చంద్రకళ, దార్ల ఉమా, దార్ల హర్షవర్ధన్ చారి, దార్ల అక్షిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీమియా అకాడమీ జాతీయ క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: ప్రీమియా అకాడమీ జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించి, విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనతో మైలురాయిగా నిలిచింది. చిన్నారుల కోసం మినీ-మరాథాన్, బ్యాలెన్స్ కార్యకలాపాలు, అలాగే కుంగ్ ఫూ, టేక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లు నిర్వహించబడ్డాయి. ఇంటర్-హౌస్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లు పోటీ స్ఫూర్తిని పెంపొందించాయి. క్రీడా పోటీలకే పరిమితం కాకుండా, ఈ వేడుకలు క్రీడలు కలిగించే క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత అనే విలువలను గుర్తు చేశాయి. విద్యార్థులు సహచరులను ఉత్సాహపరిచారు. ఉపాధ్యాయులు ప్రతి కృషిని ప్రోత్సహించారు. మేజర్ ధ్యాన్ చంద్ వారసత్వానికి గౌరవం నివాళిగా, ప్రీమియా అకాడమీ క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వాన్ని, ఆత్మవిశ్వాసాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనమని మరోసారి రుజువు చేసింది. ప్రీమియా అకాడమీ వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ డైరెక్టర్ సిందూరి రెడ్డి మాట్లాడుతూ:"ప్రీమియా అకాడమీ విద్యలోనే కాకుండా క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలపై కూడా సమాన దృష్టి సారిస్తుంది. పుస్తకాల జ్ఞానం మాత్రమే కాదు, క్రీడలు పిల్లల శారీరక, మానసిక బలాన్ని పెంపొందిస్తాయి. ముఖ్యంగా టీమ్‌వర్క్, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం వంటి జీవన నైపుణ్యాలను నేర్పుతాయి. ఈ సమతౌల్యమే పిల్లలను ధైర్యవంతులు, క్రమశిక్షణ గలవారు, భవిష్యత్‌కు సిద్ధమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతుందన్నారు. ప్రిన్సిపాల్ తృప్తి రావు మాట్లాడుతూ క్రీడలు విద్యలో అంతర్భాగం.ధైర్యం, సహనశక్తి, ఆరోగ్యకరమైన పోటీభావనను పెంచుతాయి. ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని ఇవ్వడం, వారి సామర్థ్యాన్ని వెలికి తీయడం, నాయకత్వ గుణాలను మైదానంలోనూ బయటా అమలు చేయడం మా లక్ష్యం." అని పేర్కొన్నారు. ప్రీమియా అకాడమీ విద్యా-క్రీడల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి సాధించాలనే నిబద్ధతను ప్రతిబింబించాయి.

రైల్వే కార్యకలాపాల భద్రతపై సమీక్షా సమావేశం

విశాలాంధ్ర, హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రయాణీకుల శాఖాపరమైన భద్రతను నిర్ధారించడానికి భద్రతా విధానాలు ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఏదైనా భద్రతా కార్యకలాపాలు చేపట్టేటప్పుడు రైల్వే బోర్డు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లెవల్ క్రాసింగ్‌లు, గేట్ల వద్ద అనధికార వాహనాల కదలికపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టేషన్లలో బ్యాటరీ ఆపరేటెడ్ కార్ల (బి.ఓ.సిలు) నిర్వహణ, క్యాంపింగ్ కోచ్‌లను సరిగ్గా స్థిరపరచడం, రిలే గదులలో పూర్తి ఇంటర్‌లాకింగ్ ప్లాన్‌ల నిర్వహణ కోసం భద్రతా సూచనలను పాటించాల్సిన అవసరాలపై ఆయన దృష్టి సారించారు. జనరల్ మేనేజర్ జోన్ వ్యాప్తంగా కొనసాగుతున్న భద్రతా కార్యక్రమాలను సమీక్షిస్తూ, ఇంజనీరింగ్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్స్, మెకానికల్ మరియు ఎలక్ట్రికల్ వంటి వివిధ విభాగాలు చేపట్టిన చొరవలను పరిశీలించారు. పశువుల రన్ ఓవర్ కేసులను పర్యవేక్షించడం, ప్రైవేట్ సైడింగ్‌లలో సి.సి.టి.వి ఏర్పాటు, సరుకు రవాణా రైలు కార్యకలాపాలలో భద్రతా చర్యలు వంటి ముఖ్యమైన రంగాలను ఆయన పరిశీలించారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ భద్రతా ప్రమాణాలను పెంపొందించడంపై వ్యూహాత్మక ప్రాధాన్యతనిచ్చారు. పర్యవేక్షకులు క్షేత్రస్థాయి కార్యకలాపాలను నిశితంగా పర్యవేక్షించాలని, సమస్యల సకాలంలో పరిష్కారాన్ని నిర్ధారించాలని ఆదేశించారు.

మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు సీఎంకు ఆహ్వానం

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు. 22న సాయంత్రం శంషాబాద్‌లోని క్లాసిక్ కన్వెన్షన్ 3లో 5149వ మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకలు జరుగుతాయని సీఎంకు వారు వివరించారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాలను కూడా ఆయనకు ప్రతినిధి బృందం తెలిపారు. సమయం కుదిరితే ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటానని రేవంత్ రెడ్డి వారికి హామీ ఇచ్చారనీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, సలహాదారులు బద్రి విశాల్ బన్సాల్, హరీష్ గుప్తా, సంజయ్ గుప్తా, యస్వి ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా మాట్లాడుతూ దేశంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో అగర్వాల్ సమాజ్ తెలంగాణ ఎల్లప్పుడూ తన సేవలను తను, మన, ధన రూపంలో మనస్ఫూర్తిగా అందించిందన్నారు.

విద్యాసంస్థలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడం సరికాదు

విశాలాంధ్ర -కుత్బుల్లాపూర్: చదువు చెప్పే విద్యాసంస్థలకు ట్రేడ్ లైసెన్స్ నోటీసులు జారీ చేయడం సరికాదని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. కుత్బుల్లాపూర్ మండలం పరిధిలోని ప్రైవేట్ పాఠశాలకు కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ట్రేడ్ లైసెన్స్ నోటీసులను ఖండిస్తూ సోమవారం మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పాఠశాలల యాజమాన్యంతో కలిసి మేడ్చల్ కలెక్టరేట్ కార్యాలయం నందు ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ నరసింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ 2022 సంవత్సరంలో హైకోర్టు ఆఫ్ తెలంగాణ, ప్రైవేట్ పాఠశాలలకు, విద్యా సంస్థలకు ట్రేడ్ లైసెన్స్ అవసరం లేదంటు అనుమతులను జారీ చేసిందని తెలిపారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల మధ్య తరగతి పాఠశాలలపై తీవ్రప్రభావం చూపుతుందని, పాఠశాల యాజమాన్యాలు దివాళా తీసే స్థాయికి వస్తాయని తెలియజేశారు. అక్రమ వసూళ్లను ఇకమీదట చేయవద్దని, ఇకమీదట ఇలా జరిగితే పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థిని విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. జిహెచ్ఎంసి పరిధిలోని చాలా వరకు ఇండ్లకు 100% వంద శాతం పన్ను వేస్తున్నారని, అక్కడ నివసించే పేద ప్రజలపై పన్నుల పేరుతో అధిక భారం వెయ్యవద్దని ప్రజావాణిలో స్థానికులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, ప్రైవేట్ పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెరిగిన ధరల ప్రకారం డీఏ ఇవ్వాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : పెరిగిన ధరల ప్రకారం డీఏ ఇవ్వాలని కోల్ ఇండియా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కేంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ కల్వల లక్ష్మణ్, సర్వజిత్ పొద్దర్ మహేశ్వర్ లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్ష ఇరవై వేల పైగా విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. పెన్షన్ తక్కువ ఉండడం వల్ల వైద్య సౌకర్యాలు లేక లక్ష మంది పైగా పెన్షన్ దారులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం డీఏ పెంచినప్పుడల్లా ఈపీఎఫ్ పెన్షనర్స్‌కు పెరుగుతుందని, కానీ సీఎంపీఎస్ పెన్షనర్స్‌కు పెరగడం లేదని చెప్పారు. నెలకు కనీస పెన్షన్ పదివేలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాలపై బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బొగ్గు గనుల సీఎండీ ప్రసాద్‌లకు పలుమార్లు కలిసి వినతి పత్రం అందజేశామని వివరించారు. ఇప్పటికైనా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి మా సమస్యలు పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కేంద్రమంత్రి క్యాంపు ఆఫీస్ ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-దుండిగల్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చర్యలు తప్పవని దుండిగల్ మండలం తహసీల్దార్ సయ్యద్ మతిన్ హెచ్చరించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ-దుండిగల్ మండలం డి.పోచంపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ సయ్యద్ మతిన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్ తన సిబ్బందితో కలిసి జెసిబి సాయంతో బేస్‌మేట్‌లను ఒక ఇంటి నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికి యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని, నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది జితేందర్, దేస్వంత్‌రావు పాల్గొన్నారు.

చేయూత, దివ్యాంగ పెన్షన్‌దారులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-మొయినాబాద్: వృద్ధులు, దివ్యాంగులు, వితంతు ఫించన్లు పెంచుతామని కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జీ శంకర్‌రావు మాదిగ అన్నారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు పెన్షన్లు పెంచాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్వో కార్యాలయాన్ని పెన్షన్ దారులు ముట్టడించారు. అనంతరం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత వికలాంగుల పెన్షన్ దారులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎన్నికల హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా చేయూత పెన్షన్లు రూ.2000 నుంచి రూ.4000, వికలాంగుల పెన్షన్లు రూ.4000 నుంచి రూ.6000, కండరాల క్షీణించిన వారికి రూ.15000 పెంచుతామని హామీ ఇచ్చారని, ఈ హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్న ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణం అన్నారు. వెంటనే హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శివ కుమార్, సిద్దయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సాయి కుమార్, వరుణ్ కుమార్, నవీన్, సత్తయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ వరద బాధితులకి మాజీ కార్పొరేటర్ సాయం

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలకి అతలాకుతలమైన పంజాబ్‌కి సహాయార్థం, జూబ్లీహిల్స్ నుంచి బియ్యం మొదలైన నిత్యావసరాలు, అమీర్పేట్‌లో ఉన్న గురుద్వారా శిరోమణి కమిటీకి, సోమవారం ఎంఐఎం యూసుఫ్ గూడా డివిజన్ అధ్యక్షుడు ఎం.డి. సర్తాజ్ ఖాన్, నిర్వహిస్తున్న పంజాబ్ రిలీఫ్ డొనేషన్ క్యాంప్, యూసుఫ్గుడా డివిజన్, వెంకటగిరి అల్మాస్ హోటల్, దగ్గర మాజీ కార్పొరేటర్ జి.సంజయ్ గౌడ్ తన వంతుగా రెండు కుంటల బియ్యంని అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. షకీల్ ఉద్దీన్, సుధాకర్, అహ్మద్ హస్సన్, ఎం.డి షఫీ మొదలైన వారు పాల్గొన్నారు.

యూరియా అత్యంత ప్రమాదకరం

సంక్షేమం అంటే సాధికారతకు మార్గం
కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: యూరియా వాడకం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వినియోగం తగ్గించే ప్రతి కట్టకు రూ.800 నేరుగా రైతుకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు. యూరియా ఎక్కువ వాడటం వల్ల క్యాన్సర్ వస్తుందని హెచ్చరించారు. దీని వాడకంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్లకు పిలుపునిచ్చారు. క్యాన్సర్ రోగాల జాబితాలో ఏపీ ప్రస్తుతం టాప్-5లో ఉంది. వాడకం ఇలాగే కొనసాగితే క్యాన్సర్‌లో నంబర్-1కి వెళ్లిపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది నుంచి ఎంతవరకు అవసరమో అంతే వినియోగించాలని రైతులను కోరారు. యూరియా ఎక్కువ వాడితే ఎక్కువ పంట వస్తుందనుకోవడం సరికాదన్నారు. యూరియా అధికంగా వినియోగించిన పంజాబ్‌ను కేస్ స్టడీగా చూడాలని సూచించారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మొదటి రోజు సోమవారం సీఎం వ్యవసాయరంగంపై చర్చ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. పాలనలో కలెక్టర్లది కీలక పాత్ర అని, ప్రతి అంశంలో క్రియేటివ్‌గా వ్యవహరించాలని వారికి మార్గనిర్దేశనం చేశారు. శాఖల వారీ సమీక్షిస్తూ వాటి లక్ష్యాలు, ప్రగతి, లోటుపాట్లపై దిశానిర్దేశం చేశారు. పాలనలో మొదటి ఏడాది పరీక్షలు పూర్తి అయిపోయాయని, ఇకపై మరింత బాధ్యతగా పనిచేయాల్సిన సమయం వచ్చిందని ఉద్బోధించారు. శాఖలపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయకపోతే ఫలితాలు రావని స్పష్టం చేశారు. సాంకేతికత పెరిగిన దృష్ట్యా స్మార్ట్ వర్క్ చేయాలని, ఏఐ, డేటా లేక్ వంటి వాటి ద్వారా సమన్వయం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. పథకాలు, కార్యక్రమాల అమలు కోసం ఆర్టీజీఎస్ సేవలను ఉపయోగించుకోవాలని మార్గనిర్దేశనం చేశారు.

విద్యా రుణాలకు త్వరలో కొత్త పథకం: విద్యారుణాలపై త్వరలో పథకం తీసుకొస్తామని సీఎం చెప్పారు. ఇంటర్ తర్వాత చదువులకు పావలా వడ్డీ రుణాలకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సంక్షేమ హాస్టళ్లలో ఐఐటీ కోచింగ్‌పై కలెక్టర్లు దృష్టిపెట్టాలి. మంచి కోచ్‌లను ఏర్పాటు చేస్తే అద్భుత ఫలితాలు వస్తాయి. త్వరలో అందరికీ యూని వర్సల్ హెల్త్ కార్డులు. డిజిటల్ హెల్త్ కార్డుల తయారీ జరుగుతోంది. యూనివర్సల్ హెల్త్ సర్వీసుల కింద రూ.2.5 లక్షల భీమా రాష్ట్రంలో ప్రజలందరికీ వర్తిస్తుంది. నాలుగేళ్లలో అర్హులందరికీ గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు భూమి ఇస్తాం. దీనిని ఫ్యామిలీ యూనిట్‌గా జియో ట్యాగింగ్ చేసి పథకం అమలు చేయాలని సీఎం సూచించారు.

అన్ని వర్గాలకూ అండగా...: ఎన్నికల వాగ్దానాలన్నీ అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్‌తో పాటు అన్ని వర్గాలకు మేలు జరిగే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సీఎం వివరించారు. వడ్డెర్లకు క్వారీల్లో రిజర్వేషన్లతో పాటు సీనరేజీలో మినహాయింపు ఇస్తామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు కూడా గౌరవవేతనం ఇస్తున్నామని, విజయవాడలో హజ్‌హౌస్ త్వరలోనే పూర్తి అవుతుందన్నారు. హజ్ యాత్రికులకు రూ.1 లక్ష ఆర్థిక సాయం చేస్తున్నాం. మసీదుల నిర్వహణకు నెలకు రూ.5 వేలు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం... అన్ని దేవాలయ ట్రస్ట్ బోర్డుల్లోనూ బ్రాహ్మణులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు. నిర్మాణ రంగంలో వర్కర్ల సంక్షేమం కోసం కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. శాశ్వత కుల ధృవీకరణ పత్రం కూడా త్వరలోనే జారీ చేస్తున్నాం. అల్లూరి సీతారామరాజు పేరును భోగాపురం ఎయిర్ పోర్టుకు పెడతాం. కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించాం. తోట చంద్రయ్య, అమర్నాథ్ గౌడ్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యలపై విచారణకు ఆదేశించాం. మత్స్యకారుల సేవలో భాగంగా వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఇస్తున్నాం. ఎవరికీ అన్యాయం జరక్కుండా ఎస్సీ వర్గీకరణను కూడా విజయవంతంగా పూర్తి చేశాం. డ్రైవర్ల సాధికారిక సంస్థ ఏర్పాటు చేసే అంశం పరిశీలిస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. అర్చకులకు గౌరవ వేతనం రూ.15 వేలకు పెంచాం. వేద విద్యార్థులకు రూ.3 వేలు ఇస్తున్నాం. జర్నలిస్టులకు ఇళ్లస్థలాల కేటాయించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. అసంపూర్తిగా ఉన్న కాపు భవనాలను పూర్తి చేసేలా కార్యాచరణ చేస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆదుకునేందుకు కార్యాచరణ చేపట్టాం. రజకులకు దోబీ ఘాట్లు, షెడ్లు, ఇస్త్రీ చేయడానికి ఆధునిక మౌలిక వసతులు కల్పించాలి. 200 యూనిట్లు హ్యాండ్లూమ్‌కు, 500 యూనిట్లు పవర్ లూమ్స్ ఉన్నవారికి ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. దసరాకు ఆటోలకు 15వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని సీఎం వివరించారు. అభివృద్ధిలో ఉత్తరాంధ్ర దూసుకెళ్తోందన్నారు. అక్కడ ఆర్సెలార్ మిట్టల్, టీసీఎస్, గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయని... రాయలసీమలో లేపాక్షి నుంచి ఓర్వకల్లు వరకూ పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. శ్రీసిటీతో పాటు తిరుపతి కేంద్రంగానూ పరిశ్రమలు వస్తున్నాయి. ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా పాలసీలను తీసుకువచ్చాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు కూడా వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం. గ్రీన్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేశాం. సీ-వీడ్ కల్చర్‌ను లాజికల్‌గా తీసుకెళ్తే పెద్దఎత్తున ఆర్థిక లబ్ధి చేరే అవకాశం ఉంటుందన్నారు.

వక్ఫ్‌పై సుప్రీం ఉత్తర్వులు
సర్కారుకు చెంపపెట్టు

నిజాయతీ లేని మోదీ మణిపూర్, అసోం పర్యటనలు
తెలంగాణ సాయుధ పోరటంపై గవర్నర్ అర్థరహిత వ్యాఖ్యలు
సీపీఐ కార్యదర్శి నారాయణ విమర్శలు

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనలను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేయడాన్ని స్వాగతిస్తున్నట్లు సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తెలిపారు. ఏకపక్షంగా ముందుకెళ్లే మోదీ ప్రభుత్వానికి తాజా ఉత్తర్వులు చెంపపెట్టుగా వ్యాఖ్యానించారు. బిల్లు చట్ట రూపం దాల్చక ముందే జేపీసీకి సిఫార్సు చేయాలని కోరినట్లు గుర్తుచేశారు. నారాయణ సోమవారం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మంద బలంతో చేసిన చట్టంపై సుప్రీం కోర్టు స్పందన హర్షణీయమన్నారు. సీపీఐ మొదటి నుంచే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తోందని చెప్పారు. కేంద్రప్రభుత్వం ఏకపక్ష వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ఒక శాతం ఉన్న ప్రజలకు కూడా మతపరమైన హక్కులు ఉన్నాయని, సుప్రీం కోర్టు తాజా ఉత్తర్వులు కేంద్ర ప్రభుత్వ ఏకపక్ష వైఖరికి చెంపపెట్టు లాంటిదని నారాయణ వెల్లడించారు. ప్రధాని మోదీ మణిపూర్, అసోంలో పర్యటించడాన్ని విమర్శించారు. మోదీ పర్యాటనలో నిజాయతీ లేదన్నారు. 'మూడేళ్లుగా అట్టుడికిపోతుంటే కన్నెత్తి చూడలేదు. సమాజం రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణలు జరిగినా పట్టించుకోలేదు. మోదీ ఇప్పుడు మణిపూర్‌కు వెళ్లి ఏం సాధించారు' అని నారాయణ విమర్శించారు. పుంగనూరు జవాను పోయాడు.. వచ్చాడు అనే సామెత తరహాలో మోదీ పర్యటన ఉందని ఎద్దేవా చేసారు. నిర్మాణం జరిగి... ఉపయోగంలో ఉన్న భవనాలను కొత్తగా ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. మోదీ మణిపూర్ పర్యటన మోసపూర్తితమని దుయ్యబట్టారు. అదే సమయంలో తెలంగాణ సాయుధ పోరాటోత్సవాల నేపథ్యంలో తెలంగాణ గవర్నర్ చేసిన వ్యాఖ్యలు ఆర్‌ఎస్‌ఎస్ అజండాను మోసేలా ఉన్నట్లు నారాయణ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించిన పటేల్ పేరుతో రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. నిజాంకు ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు ఇచ్చినట్లు గుర్తుచేశారు. నాలుగు వేల మంది కమ్యూనిస్టుల త్యాగాలు, పది లక్షల ఎకరాల భూమి పంపకం తెలంగాణ సాయుధ పోరాటం ద్వారానే సాధ్యమైందని, ఇవన్నీ మరిచి ఆర్‌ఎస్‌ఎస్‌కు తొత్తులా గవర్నర్ మాట్లాడటం ఏమిటని నారాయణ ప్రశ్నించారు. తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు సహా వివిధ రాష్ట్రాల గవర్నర్లు ఆర్‌ఎస్‌ఎస్ మూలాలకు చెందిన వారిని, కేంద్రానికి తొత్తులుగా మారి రాష్ట్రాల్లో సమాంతర పాలన చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు తెలంగాణ సాయుధ పోరాటంపై మాట్లాడే అర్హత లేదని నారాయణ అన్నారు. స్వతంత్ర పోరాటంలోనూ వారికి పాత్ర లేదన్నారు. బీజేపీ నుంచి ఒక్కరైనా నాడు జైలుకు వెళ్లారా? ఒక లాఠీ దెబ్బ తిన్నారా? ఒక తూటానైనా ఎదుర్కొన్నారా? అంటూ నారాయణ ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిల త్యాగాలను తమకు అనుకూలంగా వాడుకోవాలని బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ యత్నిస్తున్నాయని, శవాలను కూడా అద్దెకు తీసుకుని రాజకీయంగా పబ్బం గడుపుకోగలవని నారాయణ విమర్శించారు.

సుప్రీం మధ్యంతర తీర్పు స్వాగతిస్తున్నాం: మంత్రి ఫరూఖ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వక్ఫ్‌చట్టంపై సుప్రీం మధ్యంతర తీర్పును స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వక్ఫ్‌చట్టం సవరణలపై ముస్లిం వర్గాలలో నెలకొన్న ఆందోళనను దృష్టిలో పెట్టుకుని, వారి మనోభావాలకు అనుగుణంగా వక్ఫ్‌చట్టం జేపీసీ దృష్టికి వెళ్లేలా సీఎం చంద్రబాబు కృషి చేశారని పేర్కొన్నారు. అపుడు జేపీసీ కొన్ని అసమంజస సవరణలను తొలగించగా, సుప్రీంకోర్టు మధ్యంతర తీర్పులో మిగిలిన అసమంజస సవరణలపై స్టే విధించిందని గుర్తుచేశారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌లో ముస్లిమేతర సభ్యులు నలుగురు కంటే ఎక్కువగాను, వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతర సభ్యులు ముగ్గురు కంటే ఎక్కువగాను ఉండకూడదని, వీలైనంతవరకు ముస్లిమునే వక్ఫ్ బోర్డు సీఈవోగా నియమించాలని మంత్రి ఫరూక్ తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు.

బీసీ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యం

విశాలాంధ్ర -సచివాలయం: బీసీ నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలిస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా డీఎస్సీ, సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నట్టు చెప్పారు. తాజాగా డీఎస్సీలో 241 మంది టీచర్ పోస్టులు సాధించగా, బ్యాంకు, పోలీసు సహా ఇతర ప్రభుత్వ పోస్టులను బీసీ అభ్యర్థులు సొంతం చేసుకున్నారన్నారు. కర్నూల్ జిల్లాలో 36, అనకాపల్లి 40, నెల్లూరు 17, కృష్ణాజిల్లాలో 10, ఈస్ట్ గోదావరి నుంచి ఆరుగురు, చిత్తూరు నుంచి ఎనిమిది, పల్నాడు నుంచి ముగ్గురు, కడప నుంచి 12, పార్వతీపురం మన్యం,బాపట్ల, నంద్యాల నుంచి ఒక్కొక్కరు, అనంతపురం, ఏలూరు, శ్రీకాకుళం నుంచి ఏడుగురు చొప్పున, అన్నమయ్య, కోనసీమ నుంచి ముగ్గురు చొప్పున, గుంటూరు 12 మంది, కాకినాడ నలుగురు, ఎన్టీఆర్ జిల్లా ఆరుగురు, ప్రకాశం ఎనిమిది మంది, సత్యసాయి జిల్లా ఇద్దరు, తిరుపతి 13, విశాఖపట్నం అయిదుగురు, విజయనగరం 14 , వెస్ట్ గోదావరి 12 మంది టీచర్లగా ఎంపికయ్యారని వివరించారు. గ్రూప్ -2 మెయిన్స్ కు 12 మంది, ఆర్.ఆర్.బి లెవల్ 1కు పది మంది, ఎఫ్.ఆర్.వో ప్రిలిమ్స్‌కు ఇద్దరు, మెయిన్ కు ఒకరు అర్హత సాధించారన్నారు.

జీఎస్డీపీలో 44 శాతం పారిశ్రామిక రంగానిదే

విశాలాంధ్ర -సచివాలయం: రాష్ట్ర జీఎస్డీపీలో 44 శాతం వాటా పారిశ్రామిక రంగమే అందిస్తోందని పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించి సోమవారం సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్ ఇచ్చారు. జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ ఎస్ గ్రీవెన్స్ డే లాగానే ప్రతి మంగళవారం ఇండస్ట్రీడే కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చే పారిశ్రామిక వేత్తలు, సంస్థలతో జిల్లా కలెక్టర్లు స్వయంగా సంప్రదింపులు జరిపి క్షేత్ర స్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలు తెలుసుకుని వాటిని తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ ఉద్యోగుల దశలవారీ ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం దశల వారీ ఆందోళనలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల, కార్మికుల ఉమ్మడి కార్యాచరణ కమిటీ శ్రీకారం చుట్టింది. రాష్ట్ర విద్యుత్ సంస్థలలోని యూనియన్లు, అసోసియేషన్లు(దాదాపు 23 సంఘాలు) ఆగస్టు 25వ తేదీన విద్యుత్ సంస్థల యాజమాన్యలకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందదే. దీనిలో భాగంగా సోమ, మంగళ వారాల్లో విద్యుత్ సంస్థలో ట్రాన్స్‌కో, జెన్కో డిస్కమ్‌లలో విద్యుత్ ఉద్యోగులు కాంటాక్ట్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారని తెలిపారు. ఈనెల 17, 18 భోజన విరామ సమయంలో రాష్ట్రంలోని అన్ని సర్కిల్ ఆఫీసుల ఎదుట, జనరేటింగ్ స్టేషన్ల ముంగిట ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. 18, 19 తేదీలలో రాష్ట్రంలోని అన్ని సర్కిల్ కార్యాలయాల ఎదుట, జనరేటింగ్ స్టేషన్లలో దగ్గర రిలే నిరాహార దీక్షలు చేస్తారు. 22వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రాల్ని ఇస్తారు. అప్పటికీ యాజమాన్యాలు స్పందించకుంటే 24వ తేదీన 23 సంఘాలతో కూడిన జేఏసీ, కాంట్రాక్టు కార్మిక సంఘాలను సమావేశ పరిచి తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ చైర్మన్ ఎస్.కృష్ణయ్య, కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనల్ని 1 ఫిబ్రవరి 1999 నుంచి 31 ఆగస్టు 2004 వరకు నియమించిన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలని తదితర డిమాండ్లతో దశలవారీ ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు.

కళ్లల్లో బాధ... గుండెల్లో ధైర్యం

పంజాబ్ వరద పీడితులకు రాహుల్ పరామర్శ

చండీగఢ్: వరదలతో అతలాకుతలమైన పంజాబ్‌ను ఆదుకోవాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. బాధితులకు వెంటనే సహాయక ప్యాకేజీ, పరిహారం అందించాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వారికి సాధ్యమైనంత సాయం అందేలా గళమెత్తుతానని, బాధితులకు అండగా నిలుస్తానని రాహుల్ వెల్లడించారు. ఆయన సోమవారం ముంపు ప్రాంతాలైన అమృత్‌సర్, గురుదాస్పూర్‌లో పర్యటించారు. వరద పీడితులను పరామర్శించారు. వారి కళ్లల్లో బాధ... గుండెల్లో ధైర్యం స్పష్టంగా కనిపిస్తున్నదని రాహుల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. రూ.1,600 కోట్ల కేంద్ర ప్యాకేజి అక్కరకు రాదన్న తమ పార్టీల నాయకుల అభిప్రాయంతో ఏకీభవించారు. సముచిత పరిహారం అందించాలని పాలకులను కోరారు. విపత్తు వేళ ప్రజలకు పార్టీ అందించిన తోడ్పాటును మెచ్చుకున్నారు. రాహుల్ అమృత్‌సర్‌కు చేరుకొని అక్కడ నుంచి ఘోనేవాల్ గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. నష్టంపై ఆరా తీశారు. రాహుల్‌కు క్షేత్రస్థాయి పరిస్థితులను పార్టీ నాయకులు వివరించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించివుంటే 75 శాతం నష్టాన్ని నివారించే అవకాశం ఉండేదని వారన్నారు. ఈ పర్యటనలో భాగంగా అమృత్‌సర్‌లోని చారిత్రక గురుద్వారా బాబా బుదా సాహిబ్‌ను రాహుల్ సందర్శించారు. అక్కడ ఆయనకు 'సిరోపా' (గౌరవంగా కప్పే కండువా) అందజేశారు. రాహుల్ వెంట చత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బాఘెల్, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ, కాంగ్రెస్ పంజాబ్ అధ్యక్షుడు అమరిందర్ సింగ్ రాజా వారింగ్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బాజ్వా, ఎంపీలు గుర్జీత్ సింగ్ ఔజియా, సుఖ్‌జిందర్ సింగ్ రంధావా తదితరులు ఉన్నారు. గురుదాస్పూర్‌లోని రావి నది పరివాహక ప్రాంతంలోని సరిహద్దు గ్రామం తూర్‌కు వెళ్లకుండా రాహుల్‌ను అక్కడి పోలీసులు అడ్డుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

ప్రజా పోరాటాలు బలోపేతం

సీపీఐ రాజస్థాన్ రాష్ట్ర మహాసభలో గిరీశ్, అనీరాజా పిలుపు

ఉదయ్‌పూర్: ప్రజా పోరాటాలు బలోపేతం కావాలని సీపీఐ కార్యదర్శులు డాక్టర్ గిరీశ్, అనీరాజా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, న్యాయ వ్యవస్థ పరిరక్షణ కోసం పోరాట బాటలో ప్రజలను ముందుకు నడిపించడం అవసరమన్నారు. సీపీఐ రాజస్థాన్ రాష్ట్ర మహాసభ ఉదయ్‌పూర్‌లో ప్రారంభమైంది. తొలుత అరుణ పతకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో అనీరాజా, గిరీశ్ మాట్లాడుతూ సీపీఐ ప్రజల పార్టీ అని, ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తుందని అన్నారు. ప్రజాసామ్యం, లౌకికవాదం పరిరక్షణ కోసం ఉద్యమ బాటలో మరింతగా ముందుకెళ్లడం తక్షణావశ్యమని నొక్కిచెప్పారు. తమ పోరాటాల్లో కలిసి రావాలని ప్రజా సంఘాలకు, లౌకికవాదులకు, ప్రగతిశీల వాదులకు పిలుపునిచ్చారు. మహాసభలో పార్టీ రాష్ట్ర కర్యాదర్శి నరేంద్ర ఆచార్య, సీనియర్ నాయకుడు తారా సింగ్ సిద్ధూ పాల్గొన్నారు.

చేనేత రంగం పునర్జీవనమే లక్ష్యం

చేనేత అధ్యయన యాత్ర ప్రారంభోత్సవంలో ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, చేనేతరంగం పునర్జీవనమే తమ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎన్ఆర్ఐ వై జంక్షన్ వద్ద నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి చేనేత అధ్యయన యాత్రను సోమవారం ఆయన ప్రారంభించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘం చేపట్టిన ఈ అధ్యయన యాత్ర ద్వారా నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. చేనేత రంగం సంక్షోభంలో ఉందని ముప్పాళ్ల అన్నారు. చేనేత కార్మికులకు ప్రోత్సాహకాలు, ముడి సరుకులపై సబ్సిడీలు, మార్కెట్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల చేనేత కార్మికులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎన్నికలు జరిగితే సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. కనీస వేతన హామీ, రుణమాఫీ, చౌకగా ముడిసరుకు అందుబాటులో ఉంచడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక విధానాలు తీసుకురావాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, గొట్టిముక్కల బాలాజీ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి బత్తూరి మోహనరావు, గజపల్లి వెంకటకృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు, బొడ్డు ఉమామహేశ్వరావు, గంజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించుదాం

సురవరం ఆశయసాధనకు కృషి: సంస్మరణ సభలో రామకృష్ణ

విశాలాంధ్ర- క్రిష్ణగిరి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పిలుపునిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా క్రిష్ణగిరి కమ్యూనిటీ భవనంలో పార్టీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ నిబద్ధతగల నాయకుడు సురవరం అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారత దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి కమ్యూనిస్టు పార్టీ నాయకులు పోరాటాలు చేశారన్నారు. స్వాతంత్ర్య పోరాట సమరంలో ఎంతోమంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, మరి కొందరు జైళ్లకు వెళ్లారన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదలకు భూములను పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పేదలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పరిపాలన గాలికి వదిలేసి ఆర్‌ఎస్‌ఎస్‌ను ప్రోత్సహిస్తూ మతకలహాలు సృష్టిస్తుందన్నారు. పదకొండు సంవత్సరాల పాలనలో ప్రజలకు, రైతులకు ఒక్క మంచి పని కూడా చేయలేదని రామకృష్ణ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో దొంగ ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వాన్ని దించేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత క్రిష్ణగిరి మండల పరిధిలోని కటారుకొండ గ్రామంలో రోడ్డుకిరువైపులా పార్టీ శతదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ గ్రామ సర్పంచ్, జిల్లా సహాయ కార్యదర్శి నక్కిలేని బాబు అధ్వర్యంలో వంద మొక్కలుపైగా నాటారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య , సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నబి రసూల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజా సాహెబ్, బొంతిరాళ్ల సర్పంచ్, క్రిష్ణగిరి మండల కార్యదర్శి రవిమోహన్, ఖలీల్ బాషా, చిన్న రంగన్న, పరమేశ్వర్ రెడ్డి, చెన్నయ్య, చిన్నమాదులు మాధవకృష్ణ, పుల్లయ్య వెంకటరాముడు, రాముడు, ఎం గోపాల్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో ప్రగతి

జాతీయ సదస్సు ముగింపులో వక్తలు

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: 'మహిళా సాధికారత' పై పార్లమెంటు, శాసన సభ కమిటీల జాతీయ సదస్సు రెండవ రోజు సోమవారం ఘనంగా ముగిసింది. తిరుపతి జిల్లా, తిరుచానూరు రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరయిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు డి.పురందేశ్వరి, ఏపీ శాసన సభ స్పీకర్ సి.అయ్యన్నపాత్రుడు, ఏపీ మండలి డిప్యూటీ చైర్ పర్సన్ ఎం.జకియా కానం, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గౌరు చరితారెడ్డి, ఏపీ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవర, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఘన స్వాగతం పలికారు అనంతరం గవర్నర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్‌కు శాలువా కప్పి శ్రీరామ పట్టాభిషేకం చిత్రపటాన్ని శాసన సభ సభాపతి, ఉప సభాపతులు బహుకరించారు. సదస్సును ఉద్దేశించి రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత లేకుండా వికసిత భారత్ సాధ్యం కాదని, గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీలకు శిక్షణ, స్వావలంబన అవకాశాలు కల్పించడం ద్వారా సాధ్యమైన మార్పులను వివరించారు. ప్రత్యేకంగా ఓర్వకల్లు మండలంలో సెల్ఫ్-హెల్ప్ గ్రూపుల విజయాలు, బాలబాలికల స్కూల్ ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు, ఎంఎస్ఎంఈ పరిశ్రమల సృష్టి వంటి కార్యక్రమాలను వివరించారు. సదస్సులో డిజిటల్ విద్య, సాంకేతిక పరిజ్ఞానం ముఖ్య అంశంగా నిలిచింది. శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు, రాజకీయాల్లో మరింత ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి, ఆర్థిక రంగాల్లో అవకాశాలు, సురక్షిత సమాజ నిర్మాణం ఇవి కేవలం నినాదాలు కాకుండా సాధించవలసిన లక్ష్యాలని తెలిపారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ మహిళా సాధికారత కమిటీ 1997లో ఏర్పడినప్పటి నుంచి దేశంలో మహిళా హక్కుల పెంపు కోసం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. పార్లమెంటు మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ జెండర్-రెస్పాన్సివ్ బడ్జెటింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల శక్తి వినియోగంపై తీసుకున్న నిర్ణయాలను వివరించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మహిళా సాధికారత కేవలం మహిళల కోసం మాత్రమే కాకుండా సమాజానికి విముక్తి ప్రసాదించే మార్గమన్నారు. సదస్సులో మహిళా రిజర్వేషన్ (33 శాతం సీట్లు లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలు), డిజిటల్ అవగాహన, సైబర్ సురక్షా, సాంకేతిక శిక్షణ, జెండర్-రెస్పాన్సివ్ బడ్జెటింగ్, గ్రామీణ ప్రాంతాల్లో స్వావలంబన, ఉపాధి అవకాశాలు, మహిళల నూతన నాయకత్వ, విద్య, ఆరోగ్య, భద్రతా అవకాశాలు వంటి ముఖ్యమైన అంశాలను చర్చించారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలు దేశంలో మహిళా సాధికారతకు దిశానిర్దేశకంగా నిలవనున్నాయని ప్రతినిధులు తెలిపారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఓటు చోరీపై సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామని, దీనికి పెద్దఎత్తున ప్రజానీకం మద్దతీయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల కోరారు. సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబరు 15 వరకు సంతకాల సేకరణ కొనసాగుతుందన్నారు. ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందని, ఎన్నికలు స్వేచ్ఛగాను, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉండగా.. ఎన్నికల సంఘం మాత్రం ప్రధాని మోదీ చేతిలో బందీగా మారిందన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దేశం ముందు బయటపెట్టారని, ఇది పచ్చినిజం అని చెప్పారు. ఎన్నికల సంఘం బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న వాళ్ల ఓట్లను తొలగించిందని, బీజేపీకి అనుకూలంగా దొంగ ఓట్లను నమోదు చేసిందన్నారు. ఓటు చోరీపై దేశ వ్యాప్తంగా పోరాటం చేయాల్సి ఉందని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ ఉద్యమిస్తోందని స్పష్టంచేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు కావాలని, సంతకం కావాలని, మాతో కలిసి పోరాటం చేయాలని రాష్ట్ర ప్రజలకు ఆమె సూచించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.